RNI No.21139/1970

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:57, Issue: 03
August - 2026, Price Rs.20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

ఆగష్టు 2026
వెల రూ. 20/-
పుటలు - 56





# తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 14-09-2026 | సోమవారం | -- | సేనాధిపతిఉత్సవం, అంకురార్పణం |
| 15-09-2026 | మంగళవారం | వజ్రకవచాద్యాభరణాలతో తిరుచ్చిఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 16-09-2026 | బుధవారం | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 17-09-2026 | గురువారం | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 18-09-2026 | శుక్రవారం | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 19-09-2026 | శనివారం | పల్లకీలో మోహినీ అవతారం | గరుడవాహనం |
| 20-09-2026 | ఆదివారం | హనుమద్వాహనం, సా॥ వసంతోత్సవం స్వర్ణరథరంగ డోలోత్సవం | గజవాహనం |
| 21-09-2026 | సోమవారం | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 22-09-2026 | మంగళవారం | రథోత్సవం | అశ్వవాహనం |
| 23-09-2026 | బుధవారం | పల్లకీ ఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చిఉత్సవం, ధ్వజావరోహణం |



## గీతాశ్లోకార్థసారం

శ్లో : కామాత్మానః స్వర్గపరా జన్మకర్మఫలప్రదామ్।
క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥
భోగైశ్వర్యప్రసక్తానాం తయాఽ పహృతచేతసామ్।
వ్యవసాయాత్మికా బుద్ధిస్సమాధౌ న విధీయతే॥

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-43, 44 శ్లోకాలు)

**ప్రతిపదార్థం:** కామాత్మానః= కోరికలతో నిండిన మనస్కులు; స్వర్గపరాః= స్వర్గాసక్తులు (అగు); అవిపశ్చితః= అవివేకులు; జన్మకర్మ ఫలప్రదామ్= జన్మ, కర్మ, వాటి ఫలాల్ని ఇచ్చునట్టి; భోగైశ్వర్యగతిం ప్రతి= భోగ, ఐశ్వర్య సంపాదనకు; క్రియావిశేషబహులాం= వివిధకర్మకలాపాలతో కూడింది; పుష్పితామ్= ఫలప్రదంకాక, కేవలం పుష్పాలవలే చూపులకు మాత్రం రమ్యమై ఉండేది(అగు); యామ్ ఇమామ్= ఏ యీ, వాచమ్= వాక్యాన్ని; ప్రవదన్తి= విశేషించి చెప్పుతున్నారో; తయా= దానిచేత; అపహృత= అప హరింపబడ్డ; చేతసామ్= మనస్సుగలవారు; భోగైశ్వర్యప్రసక్తానామ్= భోగ, ఐశ్వర్యాలపై ఎక్కువ ఆశ కలవారికి; వ్యవసాయాత్మికా బుద్ధిః= నిశ్చయమైన బుద్ధి; సమధౌ= దైవధ్యానంలో; న విధీయతే= కలుగదు.

**భావం:** ఓ అర్జునా! విషయవాంఛలతో నిండిన మనస్సు కలవారు, స్వర్గాభిలాషులైన అల్పజ్ఞులు, జన్మ, కర్మ, తత్ఫలం ఇచ్చేదీ, భోగైశ్వర్యసంపాదనకోసం వివిధ కార్యకలాపాలతో కూడింది, ఫలశూన్యమైంది అయిన ఏ వాక్యాన్ని చెప్పుతున్నారో, దానిచే అపహరింపబడ్డ మనస్సుకలవారు, భోగైశ్వర్యప్రియులు అయిన జనులకు దైవధ్యానంలో నిశ్చయమైన బుద్ధి కలుగనే కలుగదు.

---

## సకలదేవతా చక్రవర్తి

జయమంగళము నీకు సర్వేశ్వరా
జయమంగళము నీకు జలజవాసినికి

శరణాగత పారిజాతమా
పారి నసురుల పాలి భూతమా
అరుదయిన సృష్టికి నాదిమూలమా వో-
హరి నమో పరమపుటాలవాలమా

సకలదేవతాచక్రవర్తి
వెకలివై నిండిన విశ్వమూర్తి
అకలంకమైన దయానిధి
వికచముఖ నమో విధికి విధి

కొలచినవారల కొంగుపైఁడి
ములిగినవారికి మొనవాఁడి
కలిగిన శ్రీవేంకటరాయా
మలసి దాసులమైన మాకు విధేయా

సంపుటం-2 - సంకీర్తన 431





ఓ లోకేశ్వరేశ్వరా! శ్రీవేంకటేశ్వరా! ఓ పద్మనిలయా! అలమేలుమంగా! మీకు జయము, జయము మంగళము అగుగాక! శరణాగతులకు నీవు పారిజాతమై సమస్తకోర్కెలను తీర్చుదువు. భయంకరులైన రాక్షసులకు నీవు భూతమై వారిని దూరంగా తరిమివేయుదువు. చాల విశిష్టమైన ఈ సృష్టికి ఆదిమూలమైన మహనీయుడవు. పరమమైన మోక్షానికి నీవే నిలయమైన వాడవు. దేవతలందరికి నీవే చక్రవర్తివి. విశ్వమంతా వ్యాపించిన విష్ణు మూర్తివి నీవే. నీవు స్వచ్ఛమైన దయానిలయుడవు. వికసించిన పద్మంవంటి ముఖంగల స్వామీ! నీకు నమస్కారం! నీ భక్తులకు కొంగుబంగారమైనవాడవు. సంసారసముద్రంలో మునుగువారిని పైకెత్తు వాడిమొన గల ఆయుధం గలవాడవు. ఓ వేంకటరాయా! నీవు ఎంతటి మహానుభావుడంటే నీకు దాసులమైన మాకు నీవు విధేయుడవై ఉండే దయామూర్తివి. నీకు, అలమేలుమంగకు జయం. మంగళం అగుగాక!




# తిరుపతి

## సమీపంలోని ప్రసిద్ధ దేవాలయాలు & దర్శనీయ ప్రదేశాలు

✲ ప్రకృతిరామణీయకం, దైవదర్శన అనుభూతి కలిసే తీర్థయాత్ర ✲

### ప్రసిద్ధ దేవాలయాలు

1  శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయం - తిరుమల — 22 కి.మీ.

2  శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయం - తిరుపతి — 0.5 కి.మీ.

3  శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయం - తిరుచానూరు — 5 కి.మీ.

4  శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి వారి ఆలయం - శ్రీనివాసమంగాపురం — 12 కి.మీ.

5  శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి వారి ఆలయం - అప్పలాయగుంట — 20 కి.మీ.

6  శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయం, తిరుపతి — 4 కి.మీ.

7  శ్రీకోదండరామస్వామి వారి ఆలయం - తిరుపతి — 2 కి.మీ.

8  శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామి వారి ఆలయం - నారాయణవనం — 38 కి.మీ.




### దర్శనీయ ప్రదేశాలు

1  తలకోన జలపాతం — 58 కి.మీ.

2  చంద్రగిరి కోట — 16 కి.మీ.

3  శిలాతోరణం (తిరుమల ఆలయం నుంచి) — 3 కి.మీ.

4  ఆకాశగంగ (తిరుమల ఆలయం నుంచి) — 5 కి.మీ.

5  పాపవినాశనం (తిరుమల ఆలయం నుంచి) — 7 కి.మీ.

### తిరుపతి నుండి దూరాలు (సుమారుగా)

| | | | |
|---|---|---|---|
| 1 తిరుమల | 22 కి.మీ | 6 కపిలతీర్థం | 4 కి.మీ |
| 2 శ్రీగోవిందరాజస్వామిఆలయం | 0.5 కి.మీ | 7 శ్రీకోదండరామస్వామి ఆలయం | 2 కి.మీ |
| 3 తిరుచానూరు | 5 కి.మీ | 8 నారాయణవనం | 38 కి.మీ |
| 4 శ్రీనివాసమంగాపురం | 12 కి.మీ | 9 కార్వేటినగరం | 46 కి.మీ |
| 5 అప్పలాయగుంట | 20 కి.మీ. | 10 వకుళమాత ఆలయం | 9 కి.మీ. |

### గోవింద... గోవింద...



### ప్రయాణ సూచనలు

- రోడ్డు మార్గం చాలా సులభం.
- అన్ని వేళల రోడ్డు వాహన సౌకర్యాలు ఉంటాయి
- దేవాలయ దర్శన సమయాలు ముందుగా తెలుసుకోవాలి
- తగిన ఆహారం, త్రాగునీరు తీసుకెళ్లండి
- ప్రకృతి అందాలను పరిరక్షించండి!

"గోవింద నామంతో మొదలైన ప్రతి ప్రయాణం...
ఆశీర్వాదంతో ముగుస్తుంది"

**శ్రీనివాసా.. గోవిందా..!**

శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు మీ కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలి

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 57 ఆగష్టు, 2026 సంచిక : 03

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| మాసాల్లో మేటి శ్రావణం | డా॥ఆకెళ్ళ విభీషణశర్మ | 07 |
| శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనమే దశావతార సందర్శనం!! | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ | 09 |
| సందేహాలు-సమాధానాలు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ | 12 |
| స్వాతంత్ర్య స్వర్గం | 'కళారత్న' డా॥ కంపల్లె రవిచంద్రన్ | 13 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 14 |
| అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీక రక్షాబంధనం | శ్రీమతి డి.పూర్ణిమా స్వాతి | 15 |
| తిరుమల ఆలయం- విఖనస ఆరాధన | డా॥ నొస్సం నరసింహాచార్య | 18 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 19 |
| సకల దేవతాస్వరూపిణి గాయత్రీదేవి | శ్రీమతి పి.రమాదేవి | 20 |
| మహాభక్త కవయిత్రి | డా॥ సంగీతం కేశవులు | 22 |
| రాయలవారి కావ్యానికి నాంది! | డా॥ గంగిశెట్టి శివకుమార్ | 23 |
| స్వామికి మిక్కిలి ప్రియుడు | డా॥ రెడ్డి సుబ్రమణ్యం గాడి | 24 |
| తిరుకోష్ఠియూర్ (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| శ్రీవరలక్ష్మి వ్రత పూజావిధానం | | 26 |
| చల్లని కృష్ణుడు | డా॥ కడిమిళ్ళ వరప్రసాద్ | 35 |
| శ్రీ సుబ్రహ్మణ్య షోడశనామ స్తోత్రమ్ | | 41 |
| శ్రీనివాస విలాస సేవధి (ద్విపద) | సంక్షిప్తవచనం- ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి | 43 |
| నమ్మినోళ్లకు నమ్మినంత | శ్రీ మూరిశెట్టి గోవిందు | 44 |
| అహింసను సమర్థించిన రాజు | శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు | 46 |
| దుర్మార్గం - మంచితనం (వేమన శతకం) | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 47 |
| శత్రువులతో స్నేహం ఎంత అవసరమో అంతే! (చిత్రకథ) | కథ: 'కళారత్న' డా॥ కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు: శ్రీ తుంబలి శివాజీ | 48 |
| హయగ్రీవుడు | | 50 |
| గరుడ పంచమి | | 50 |
| క్విజ్ | | 51 |
| బాలవినోదం | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| శ్రీపదకేళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీ పద్మావతీఅమ్మవారు, తిరుచానూరు
వెనుకచిత్రం : శ్రీ వల్లీ దేవసేన సమేత షణ్ముఖస్వామివారు



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥

**గౌరవ సంపాదకులు**
శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు

**ప్రచురణకర్త-సంపాదకులు,**
**ప్రధాన సంపాదకులు** (ఎఫ్.ఏ.సి.)
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,
పి.జి.డిప్లొమా ఇన్ జె.ఎం.సి.

**ఉపసంపాదకులు**
'కళారత్న' డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., తెలుగు & ఇంగ్లీషు, ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి, (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
ప్రధానసంపాదకులు-0877-2264363
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333

సంపాదకీయం

# సృష్టిలో తీయనిది...!

ఎవరిని చూడడం వల్ల, ఎవరిని స్పృశించడం వల్ల, ఎవరి మాటలు వినడం వల్ల, ఎవరితో మాట్లాడడం వల్ల మనస్సు ద్రవిస్తుందో అది మంచి స్నేహమని చెప్పింది రామాయణం. కిష్కింధకాండలో స్నేహానికి సంబంధించిన అపురూప విషయాలు ఆవిష్కరించబడ్డాయి. హనుమంతుడు రామలక్ష్మణులను సుగ్రీవుని దగ్గరకు తీసుకువచ్చి, వారిద్దరినీ అతనికి పరిచయం చేశాడు. తన అన్న వాలి కారణంగా భయంభయంగా కాలం గడుపుతున్న సుగ్రీవుడు, రామలక్ష్మణుల మైత్రి లభిస్తున్నందుకు సంతోషించాడు. "రామా! నాతో స్నేహం నీకు అంగీకారమైతే ఇదిగో నా చేయి చాపుతున్నాను. నువ్వూ చేయి కలుపు. ఇపుడే శాశ్వతబంధం ఏర్పరచుకుందాం" అన్నాడు. శ్రీరాముడు కూడా సంతోషించి అతనితో చేయి కలిపాడు. హనుమంతుడు స్వయంగా అగ్నిని ప్రతిష్ఠించగా ఆ అగ్నిసాక్షిగా రామసుగ్రీవులు మైత్రీప్రతిజ్ఞ చేయడం ఇక్కడ విశేషం. సుగ్రీవుడు "నువ్వు నా స్నేహితుడవయ్యావు. ఇక సుఖమైనా, దుఃఖమైనా మనిద్దరికీ ఒక్కటే" అన్నాడు. ఒక్కరి సమస్య ఒకరు చెప్పుకున్నారు. రాముడు సీతను గూర్చి బాధపడుతుండగా, సుగ్రీవుడు "మన స్నేహాన్ని పురస్కరించుకుని నీకు హితవు చెప్తున్నానే గానీ ఉపదేశం కాదు సుమా. మన మైత్రిని మన్నించటానికైనా నీవు శోకం వదలిపెట్టు" అన్నాడు. సహానుభూతితో హితవాక్యాలు పలికే స్నేహితులను ఇక్కడ గమనిస్తాం.

వాలి, రాముని శరాఘాతానికి నేలకూలాడు. వాలివధ తాను కోరుకున్నదే అయినా, తీరా అది జరిగే సరికి సుగ్రీవునిలో విచిత్రంగా ఒక అపరాధభావన ఏర్పడగా, రామునికి దుఃఖం చెప్పుకున్నాడు. తన అన్నగారి మరణానికి కారణం అయిన తాను అగ్ని ప్రవేశం చేస్తానన్నాడు. సామాన్యులైతే ఈ విషయంలో చిరాకు పడేవారు. కానీ అతని మానసికస్థితిని అర్థంచేసుకున్న మిత్రునిగా రాముడు అతనితో ఒక్క మాట కూడా మాట్లాడకుండా, కన్నీళ్లు పెట్టుకుని విమనస్కుడయ్యాడు. ఇక్కడ మిత్రుని పట్ల రాముని సహనశీలం గమనించాలి. లోకంలో చాలామంది మిత్రులు ఎన్నో సందర్భాల్లో "నన్ను అర్థంచేసుకో!, నన్ను అర్థంచేసుకో!" అంటూనే ఒకరినొకరు అర్థం చేసుకోరు. నిజంగా అర్థం చేసుకుంటే, సమయోచితంగా సహనం పాటించాలి. అవతలి వారి బలహీనతను క్షమించగలగాలి. ఐశ్వర్యవంతుడైనా, దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నా, దుఃఖితుడై వున్నా, సుఖాలలో తేలుతున్నా, నిర్దోషియైనా, దోషియైనా స్నేహితుడిని వదిలిపెట్టకూడదంటుంది రామాయణం.

సుగ్రీవుడు పట్టాభిషిక్తుడయ్యాక రాజ్యభోగాల ననుభవిస్తూ రామకార్యం విస్మరించినప్పుడు అతని వద్దకు లక్ష్మణుని పంపుతూ "కటువుగా ఏమాత్రం మాట్లాడవద్దు" అన్నాడు. ఇది రాముడు స్నేహానికి ఇచ్చిన మర్యాద.

ఒకరితో స్నేహం చేయటం సులభమే, చివరిదాకా దాన్ని నిలబెట్టుకోవడమే కష్టం. మనస్సు చంచలమైతే చిన్నచిన్న కారణాలకు కూడా స్నేహం దెబ్బ తింటుంది. అందువల్ల మైత్రీబంధం ఎంతో పవిత్రంగా, అపురూపంగా దాచుకోవాల్సిన ధనం!

# మాసాల్లో మేటి శ్రావణం

- డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ,
98662 34482

కాలం పరమాత్మ స్వరూపం. మన్వంతరాలు, కల్పాలు, యుగాలు, సంవత్సరాలు, ఋతువులు, మాసాలు, పక్షాలు, వారాలు, పగలు, రాత్రులు ఇలా జ్యోతిశ్శాస్త్రము తెలుపుతోంది. పూర్ణిమతో కూడిన నక్షత్రం పేరే మాసానికీ వస్తుంది. అందులో శ్రావణం చైత్రాది మాసాల్లో ఐదవది. "శ్రోణా నక్షత్రం విష్ణుర్దేవ తేతి" అని వేదవాక్యం. కనుక శ్రవణా నక్షత్రము విష్ణుదేవతాకం. కలియుగ ప్రత్యక్షదైవం శ్రీనివాసుని అవతారం శ్రవణా నక్షత్రంతో కలసిన పున్నమనాడే. వర్షఋతువులో ఆదిత్యుని ప్రభావం వల్ల సకాలవర్షాలు, సజీవ వర్షాలు కురిసి భూమిని సస్యశ్యామలం చేస్తాయి.

శృణ్వన్తి శ్రోణామమృతస్య గోపామ్,
పుణ్యామస్యా ఉపశృణోమివాచమ్ ।
మహీం దేవీం విష్ణుపత్నీ మజూర్యామ్,
ప్రతీచీమేనాగ్ం హవిషా యజామహే ॥

అనే వేదవాక్కు విష్ణువు శ్రోణా (శ్రవణ) నక్షత్రరూపమైన దేహం కలవాడు. ఆ పుణ్యశ్రవణ కీర్తనునిచే, విష్ణుభార్య భూరూపంతో పాలించబడుతోంది. జీవులకు సంతాపాలు లేకుండా చేసే ఆ నక్షత్రాన్ని యజ్ఞంతో ఆశ్రయించాలి. అలా ఆచరించే వారికి శుభం చేకూరుతుంది. దక్షిణాయణ పుణ్య కాలంలో ముందుగా వచ్చే మాసమిది. మహానదుల్లో తప్ప ఈ మాసంలో మామూలు నదీస్నానాలు నిషేధించబడ్డాయి. కానీ గంగాజలంతో సంబంధం కలిగిన నదులకు ఇది వర్తించదు. అలాగే గ్రహణసమయంలో, ఉపాకర్మ సమయంలో, శ్రాద్ధకర్మల విషయంలో కూడా నదీస్నానానికి నిషేధం లేదు. జంధ్యాలపున్నమ నాడు వేదవిద్యార్థులకు ఉపాకర్మ వల్ల మేధాశక్తి వృద్ధి పొందుతుంది.

ఆషాఢపు వేడిగాలులకు స్వస్తి పలికి, శ్రావణ మేఘమాలికలు కనువిందు చేస్తాయి. శ్రావణ భూలక్ష్మి పచ్చని చీర కట్టుకొని వర్ష ముత్యాలతో ముస్తాబవుతుంది. చెదురుముదురు చిరుజల్లులు మంత్రాలై, చల్లగాలి సవ్వడులతో ప్రకృతిని పులకింపజేసేదే ఈ శ్రావణం. కదులుతున్న పూలన్నీ రంగుల ఓణీలతో కనువిందు చేసే కన్నెపిల్లలకు సైదోడు. ఆవులతో లేగదూడల్లా అమ్మల వెనుక అమ్మమ్మల వెనుక ఆడపిల్లలు అడుగులేస్తారు. సెనగల మూటలు పట్టుకున్న చేతుల సవ్వడికి, కాళ్ళపట్టీల మోత తోడవుతుంది. మెడకింద గంధపు చారలతో ముత్తైదువులు గౌరీదేవత రూపాల్లా దర్శనం ఇచ్చే శ్రావణమాసం, పవిత్రమైనది.

ఈ శ్రావణంలో గృహనిర్మాణానికి శ్రీకారంచుడితే భృత్యలాభమని మత్స్యపురాణం ప్రబోధిస్తోంది. శ్రావణంలో



## 2026, సెప్టెంబర్ నెల ఉత్సవాలు, పర్వదినాలు

- **04** కృష్ణాష్టమి, గోకులాష్టమి
- **13** బలరామజయంతి, వరాహజయంతి
- **15-23** తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవం
- **14** వినాయకచవితి
- **23** వామనజయంతి
- **25** అనంతపద్మనాభవ్రతం

పుట్టిన విప్రుడు వేదోక్తకర్మలు చేయించడంలో ఘనుడౌతాడు. శ్రావణంలో శ్రీహరి అవతారాలయిన హయగ్రీవుడు పున్నమనాడు, శ్రీకృష్ణస్వామి బహుళ అష్టమినాడు జ్ఞాన స్వరూపులుగా అవతరించారు.

ఈ మాసంలోనే గరుడుడు అమృతాన్ని తెచ్చి తన తల్లి వినత దాస్య శృంఖలాలు తొలగించాడు. శ్రావణ శుద్ధపంచమి తిథి నాడు గరుడుడు జన్మించాడు. గరుడసేవ పెరియతిరువడిగా (ఘనమైన సేవగా) వైష్ణవులు కీర్తిస్తారు. అలాగే ఆళవందారు, బదరీనారాయణ పెరుమాళ్, గోదాదేవి మొదలైన భక్తవరేణ్యుల తిరునక్షత్రాలు ఈ నెలలోనే వస్తాయి.

ఈ మాసంలో శుక్ల, కృష్ణపక్షాల్లో చేసే ఎన్నోవ్రతాలను వరాహ, స్కాందపురాణాలు వివరిస్తున్నాయి. నాగులచవితినాడు, నాగపంచమినాడు నాగదేవతలతోపాటు గరుడాళ్వారుని పూజ కూడా చెయ్యాలి. శ్రావణశనివారాలు, మంగళవారాలు, శుక్రవారాలు మంగళకరమైనవి. శ్రావణమంగళ గౌరీవ్రతాలు అన్నిజన్మల్లోనూ సువాసినులకు వైధవ్యదోషాన్ని తొలగిస్తాయి. శ్రావణశుక్రవారాలు సంపదలను ఇచ్చే లక్ష్మీ పూజలకు శ్రేష్ఠమైనవి. విశేషించి వరలక్ష్మీవ్రతం పౌర్ణమిముందు వచ్చే శుక్రవారం నాడు ఆచరించడం సంప్రదాయం. పురాణకాలంలోని చారుమతి నుంచి ఈ సంపత్కరమైన వ్రతం సువాసినులు ఆచరిస్తున్నారు.

ఈ మాసంలో కొత్తగా పెళ్ళైన వధూవరులు ఆనంద డోలికల్లో ఉంటారు. అత్తగారు మురిపెంతో కొత్తకోడలుకు బహూకరించే బంగారు నగలను శ్రావణతగువుగా, శ్రావణ పట్టీగా పేర్కొంటున్నారు.

ఈ నెలలో సోదర సోదరీ బంధానికి చెరగని సాక్ష్యం రక్షాబంధనం. ఇదే రాఖీపండుగ లేదా రాఖీపౌర్ణమి. ఇదే రోజు ద్విజులకు నూతన యజ్ఞోపవీత ధారణసమయం. ఈ రోజే పరమశివుడు హాలాహలం లోకహితానికై స్వీకరించాడు.

కనుక శివారాధనను గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, పార్వతికూడా కైలాసంలో దేవతలతో కొలువై ఘనంగా చేస్తారని విశ్వాసం. అందుకే ఉపాకర్మతో పాటు రుద్రాభిషేకాలు, నమక, చమక పారాయణులతో శ్రోత్రియుల ఇళ్ళు పూర్ణ కలశాలౌతాయి.





# శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనమే దశావతార సందర్శనం!!

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ

కల్కి అవతారం రాలేదు కానీ మనకు వ్యాసవాక్కు ప్రమాణం. ఆ అవతారం ఎప్పుడు ఎక్కడ వస్తుందో వ్యాసభగవానుడే చెప్పాడు. స్వాహాకారం, వషట్కారం వినపడవు. యజ్ఞయాగాది క్రతువులు ఉండవు. గోవులు విశేషంగా వధింపబడి జనాలు గోమాంసాన్ని తినడం ప్రబలమౌ తుంది. వివాహవ్యవస్థ నిలబడదు. తల్లిదండ్రులను చూసే బిడ్డలు ఉండరు. భార్యని భర్త చూడడు. భర్తని గౌరవించే భార్య లోకంలో ఉండదు. పురుషుల ఆయుర్దాయం 18 సం॥లకే పూర్తవుతుంది. స్త్రీలు జడ వేసుకునే సంప్రదాయం విచ్ఛిన్నమైపోతుంది. ఆయుర్దాయాలు క్షీణించిపోయిన తరుణంలో శంబళ అనే గ్రామంలో విష్ణుయశుడు అనే బ్రాహ్మణునికి కల్కి అన్న పేరుతో శ్రీమహావిష్ణువు 10వ అవతారంగా పుడతారు. అది కలియుగం చివరలో, కృతయుగం ప్రారంభంలో వస్తారు. ఆయన అవతరించారనడానికి గుర్తు–

వ్యాధులు ప్రబలుతాయి. పరమపుణ్యాత్ములైనవాళ్లు మాత్రమే మిగులుతారు. ఆయన శ్వేతాశ్వం ఎక్కి కాషాయపతాకం పట్టుకుని తిరుగుతాడు. అధర్మంతో మిగిలిపోయిన రాజ్యాలను ఆక్రమించినవాళ్లు, అధికారానికి తగిన అర్హత లేకపోయినా సింహాసనం మీద కూర్చుని పరిపాలన చేసే ప్రభువులందరినీ దునుమాడతాడు. కలియుగం పూర్తై కృతయుగం ప్రారంభమైందనడానికి జలప్రళయం సంభవించి నీళ్లు వచ్చి భూమండలాన్ని కప్పివేస్తాయి. కలియుగం చివరలో వచ్చే గొప్పదైన కల్కి అవతారాన్ని స్మరించినా, నమస్కరించినా పాపబుద్ధిపోతుంది. మనం కలియుగంలో ఈ అవతారాలలో ఏ ఒక్క అవతారాన్ని చూస్తామన్న తృప్తి ఉండదు. మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, పరశురామ, వామన, రామ, కృష్ణ, బలరామ– ఏ అవతారమైనా భక్తితో అనుసంధానం చేస్తే ఇప్పటికీ అనుగ్రహిస్తాయి. పరశురామావతారం చిరంజీవి. ఇప్పటికీ మహేంద్రపర్వతం మీద ఉంది. కానీ దశావతారాలను చూడాలి అనుకుంటే ఒక్కచోట చూడవచ్చు. ఎక్కడ అనగా..

**ఇందరికీ అభయమ్ము నిచ్చు చేయి,**
**కందువగు మంచి బంగారు చేయి**

- అని అన్నమాచార్యుల వారు చెప్పారు.

వేదోద్ధారణ, మందరాభరణ, పృథ్వీధర్మ నిర్మాణ, ప్రహ్లాదత్రాణ, బలిప్రతారణ నృపాహంకార నిర్వాపనా, వైదేహీరమణా, ధనంజయ జయ వ్యాపారపారీణా, క్షోణీ దివ్యకరుణా, తమోహరణా, తంత్రీ! వేంకటేశ ప్రభో! ఆ వేంకటేశ్వరస్వామి దర్శనమే దశావతార దర్శనం.

ఆయనను ఏ దేవతలూ, విశ్వకర్మా చెక్కలేదు. తనంత తానుగా నిలబడిన మూర్తి. అటువంటి మహానుభావుడు ఏ చేతితో దశావతారాలను ఉద్ధరించాడో, దర్శనమిచ్చాడో ఆ స్వామి దర్శనమే దశావతారదర్శనం.

## శ్రీవేంకటేశ్వరస్వామి వారి మానసిక దర్శనం

వేంకటాచలం వెళ్లి స్వామి పుష్కరిణిలో స్నానం చేసి బయటికి వచ్చి, ఆదివరాహస్వామి కోవెలకు వెడుతున్నప్పుడు ఎడమచేతి పక్కన ఉన్న పద్మంలో ఏనుగులు పద్మకింజల్కాలు వర్షిస్తున్న గజలక్ష్మి దర్శనం పొంది బయటికి వెళ్లి ఆదివరాహ

స్వామి దేవాలయంలోకి వెళ్లినప్పుడు గుళ్లో స్వామి నిటారుగా ఉంటే ఆయన వక్షఃస్థలం మీద అడ్డంగా ఉన్న లక్ష్మి, ఆయన మాట్లాడుతున్నప్పుడు ఇద్దరూ గుసగుసలాడుకుంటున్నారా! అన్నట్లుగా ఆయన నోటి దగ్గరకు ఆవిడ చెవి వచ్చేటట్లుగా ఉండి, చిన్ని ముఖంతో చక్కగా కస్తూరితిలకంతో ఉన్న అమ్మవారు, ఆ ఆదివరాహస్వామి భూమినుండి పైకి వచ్చిన మూర్తి. ఆయనని దర్శనం చేసుకుని బయటికి వచ్చి చక్కగా శ్రీ వేంకటాచలం వేంకటేశ్వర దేవాలయం రాజద్వారం వద్దకి వచ్చేటప్పటికి గొట్టాలకు ఉన్న కన్నాలలోనుండి సన్నగా నీళ్లు స్రవిస్తూ తమంత తాముగా మన కాళ్లు కడిగితే, ద్వారానికి అటూ ఇటూ ఉన్న శంఖనిధి, పద్మనిధి లోపల ఉన్న పరాత్పరుడు సమస్త ఐశ్వర్యాలనూ ఇవ్వగలిగినవాడు, సార్వభౌముడు, జగత్తులను శాసించ గలిగినవాడు అని తెలియచెప్పే శంఖనిధి, పద్మనిధులను దర్శించి, అటూ ఇటూ గెలలతో కట్టిన అరటిచెట్లు చూసి పెద్ద గడపని దాటి అవతలకి వెళ్లి ఎర్ర తివాచీ మీద నడుస్తూ కొంచెం ముందుకు వెళ్లి కుడిపక్కకు తల ఎత్తి చూస్తే కింద బొడిపితో అనంతాచార్యులవారు శ్రీ వేంకటేశ్వరస్వామి మీదకు విసిరినపుడు గడ్డానికి తగిలి దెబ్బ తగలడానికి ఉపయుక్తమైన గునపం కనపడి కింద తెలుగులోనూ, ఇతరభాషలలో గడ్డపార అని వ్రాయబడ్డ బోర్డులు చూసి కొంచెం ముందుకి వెళ్లి ఎడమ పక్కకు తల తిప్పి చూస్తే వేంకటపతి రాయలు, అచ్యుతరాయలు, వరదాజీ అమ్మాండి ముగ్గురి విగ్రహాలు కనపడితే కుడిపక్కకు చూస్తే అక్కడ శ్రీకృష్ణదేవరాయలువారు టోపీ పెట్టుకుని రెండు చేతులతో అంజలి ఘటిస్తూ అటు పక్కన తిరుమలదేవి, ఇటు పక్కన చిన్నాదేవి నిలబడి ఉంటారు.

ఒక్క క్షణం అలా చూసి ఎడమ చేతి పక్కన స్వామివారి తులాభారం పిల్లలను పెద్దలను తీసుకుని వచ్చి ఏ మొక్కులు ఉన్నవాళ్లో పటిక బెల్లంతో, బెల్లం గడ్డలతో, అఖరికి వొంటి మీద నగలతో, మంచిముత్యాలతో తూచి ఇచ్చే తులాభారం. అక్కడే ఉన్న రంగనాయకమంటపం అక్కడే ఉన్న తిరుమలరాయ మంటపం ఎదురుగా ఉన్న అద్దాల మంటపం, దాని మెట్లమీద కూర్చుని ఎదురుగా ఉన్న రంగనాయకుల మంటపం వంక చూస్తే ఎదురుగా ఉన్న పెద్ద ఇత్తడి ప్లేటు, దాని మీద నల్లటి అక్షరాలతో మాలిక్ కాపూర్ దక్షిణదేశం మీద దండయాత్ర చేసినప్పుడు శ్రీరంగంలో ఉన్న రంగనాయకస్వామివారి విగ్రహాన్ని రక్షించడానికి తీసుకు వచ్చి ఈ మంటపంలో ఉంచడం చేత, ఈ మంటపానికి రంగనాయకమంటపమని పేరు వచ్చింది అన్న బోర్డు చూసి, మళ్లీ వెనుకకు వచ్చి తులాభారం పక్కనుండి రంగనాయకుల మంటపం పక్కనుండి ప్రదక్షిణంగా వస్తుంటే అక్కడ ఉన్న ఇత్తడి కచ్చడాలకు ఉన్న కాశీ తాళ్లు మధ్యలో గుచ్చబడ్డ విజిటింగు కార్డులు, నొక్కుపోయిన నాణేలు ఇవన్నీ చూస్తూ లోపలకు చూస్తూ దగ్గరకు వెళ్లి మొదటి గడప కులశేఖ రాళ్వార్ పడి దగ్గర నిలబడితే స్వామి వారి పాదాలు పైనుంచి ఒక్కసారి చూసేటప్పటికి ఆ కిరీటం, కిరీటం నుంచి పెద్ద తోమాల దాని పక్కన చెవులు, చెవుల మీద పెట్టిన మకరకుండలాలు, మకరకుండలాల పక్కన మెరిసిపోతున్న పెద్దపెద్ద చెక్కిళ్లు, కోటేరు లాంటి ముక్కు, పట్టిపట్టి చూస్తే సున్నా చుట్టినట్టు చిరునవ్వు, నవ్వుతున్నాడా అన్నట్లుగా ఉన్ననోరు, పెద్ద పెద్ద ఊర్ధ్వపుండ్రాలు, మహానుభావుడి కంఠం త్రిగుణాలతో ఉండి మెడలో వేసుకున్న సాలగ్రామ మాలలు విశేషమైన పుష్పహారాలు, వక్షఃస్థలం ముందుకు పొడుచుకుని వచ్చిందా అన్నట్లు ఉండి ఇటూ అటూ స్వర్ణంతో చేసిన శ్రీదేవి భూదేవి మెడలో వేయబడ్డ పుష్పమాలలు, కిందకి వేలాడుతున్న మాలలు ఇలా చూసేటప్పటికి నవరత్నాలతో పొదగబడ్డ అభయహస్తం కనిపిస్తుంది.

ఆ చేతిలోనే దశావతారాలను చూపించారని స్మరించి, అభయహస్తం చూసి, బ్రహ్మాండమైన పాదాభరణాలు వ్రేలాడు తుంటే ఇంకా కిందకి వచ్చేటప్పటికి పాదాలకు పెట్టుకున్న అందెలు, పాదాల మీద పెట్టిన వెండి తొడుగులు... స్వామిని సంతోషంతో ఆపాదమస్తకం కిందనుంచి పైకి, పైనుంచి కిందకి చూసి, మనకు ప్రసాదమిస్తే పుచ్చుకుని ఎంతో సంతోషంగా వెనకకు తిరిగి అదేపనిగా చూస్తూ నడచుకుంటూ పైకి వచ్చి, కుడిచేతి పక్కకు తిరగగానే పక్కన ఉన్న ఘంటామండపంలో గంటలు చూసి కొంచెం ముందుకి వెళ్లి బయటికి వచ్చి కుడి పక్కకు తల ఎత్తితే ఉత్తరద్వారమని బోర్డు ఉండి, పెద్ద ఆది శేషుడు మీద పడుకున్న శ్రీమహావిష్ణువు నాభికమలంలో నుండి పైకి వచ్చిన బ్రహ్మమూర్తిని చూసి వైకుంఠ ఏకాదశినాడు ఉత్తర ద్వారంలోనుండి భక్తులు ఇటే వెళ్లి బయటికి వస్తారని సంతోషించి, కొంచెం ముందుకి వెళ్లి అక్కడ ఉన్న భూదేవి తీర్థం నుయ్యి దాని మీద పెట్టిన చక్రం అక్కడ ఏర్పాటు చేసిన వంట శాలలోకి నీటి సరఫరా ఏర్పాటు చూసి, మెట్లుఎక్కి ఎడమపక్కకు లోపలకు వెళ్లి చూస్తే లోపల ఉన్న కన్నంలో నుండి వంటశాల ఇవతలకి వస్తే బొమ్మల గూడులా ఉన్న బోలెడంతమంది స్వాములు, నోటికి చెయ్యి అడ్డంగా పెట్టుకున్న ఆజ్ఞాపాలక

హనుమని చూసి, అక్కడ ఉన్న అర్చకులు పెద్ద ఉద్ధరిణితో చేతిలో తీర్థం పోస్తే లోపలకు తీసుకుని, ఉత్తరీయంతో తుడుచుకుని, నమస్కారం చేసుకుని తల అంతాపట్టేసేటంత పెద్దశటారి తలమీద పెడితే అక్కడనుండి మెట్లుదిగి మళ్లీ ఒక్కసారి భూదేవి బావి దగ్గరకు వచ్చి తల ఎత్తి చూస్తే సింహ వాహనం, దాని వెనకాల ఉన్న వేంకటేశ్వరస్వామి వీరాసనంలో తొడమీద కాలు వేసుకున్నవాడు సింహం మీద కూర్చున్నట్టుగా కనపడితే కొంచెం ముందుకు వెళ్లి కుడిపక్కకు వెళ్లి తిరిగితే ఎదురుగా గోడ మీద వేంకటేశ్వరస్వామి వృత్తాంతంలో గుర్రం దిగి చోళరాజు పరిజనాన్ని పలకరిస్తున్న ఆ వేంకటేశ్వరస్వామి వారిని చూసి ఒక్కసారి ఆనందనిలయం వంక వంగి చూస్తే ఎడమపక్కకి వెనక చూస్తే తూము దగ్గర "ఇచ్చట కర్పూరము వెలిగించరాదు, కొబ్బరి కాయలు కొట్టరాదు" అని ఉన్న బోర్డు చదివి, ఎడమపక్క చూస్తే అరుగులమీద ఉన్న పంచెలు కట్టుకుని కూర్చుని లెక్క పెడుతున్న నాణేలు నోట్లు, విదేశీ కరెన్సీ, వెండి, బంగారం చూసి "అబ్బో ఏమి స్వామి ఏమి వైభవం" అనుకుని ముందుకు వెళ్లి ఇటుపక్కకు తిరిగి కుడిచేతి పక్కకు చూస్తే దుంగల మీద స్వామివారికి చందనం అరగదీస్తున్న పరిజనం. అక్కడకు వెళ్లి మెట్లమీద నించుని బాణం గుర్తు వేసి ఉన్న విమాన వేంకటేశ్వర స్వామివారిని చూస్తే లోపల ఎలా ఉన్నాడో అలాగే కనపడి ఆయనకు ఎడమచేతి పక్కన తోక తల వరకు తగిలేటట్టు హనుమ, ఆయనకు కుడిపక్కన చేతులు ఎత్తి అడుకుంటున్న చిన్నికృష్ణుడు, ఆ పక్కన రెక్కలు విప్పిన గరుత్మంతుడిని చూస్తాము.




మెట్లుదిగి ముందుకెళ్లి మెట్లు ఎక్కి ఎడమ పక్కకు వస్తే ఒంటినిండా ఊర్ధ్వపుండ్రాలు పెట్టుకున్న భగవత్ రామానుజాచార్యులవారికి నమస్కారం చేసి ముందుకి వెళ్లి యోగనరసింహ స్వామి ముందుకి ఇలా చేతులు పెట్టుకుని గోడుగా చేతులు వేళ్లు కనపడుతూ పట్టుబట్ట కట్టుకుని కూర్చుంటే, ఆయనకు నమస్కారం చేసి ప్రదక్షిణం చేసి, మెట్లుదిగుతూ కుడిపక్కకు చూస్తే రాతి పళ్లెం కనపడితే "ఇక్కడ కర్పూరం అరగదీస్తారు ఇక్కడ కూర్చుండరాదు" అని బోర్డు చదివి తెలీక ఇక్కడ కూడా కూర్చుంటారులా ఉంది అనుకుంటుంటే, కొంతమంది ఓమ్కారం రాసేస్తూ శ్రీకారం రాసేస్తూ, కళ్లకద్దుకునే భక్తులను చూసి మెట్లుదిగి కొంచెం ముందుకి వెళ్ళి హుండీ దగ్గరకు వెళ్లి హుండీలో ముడుపు చెల్లించి కొంచెం ముందుకి వెళ్లి గోడమీద నిలబడి ధనం కురిపిస్తున్న లక్ష్మీదేవి రెండుపాదాలు చేతులు ఎత్తి పట్టుకుని చల్లబడ్డ చేతులు కళ్లకి అంటించుకుని పొంగిపోయి వెనుకకు వచ్చి రంగనాయకస్వామి వారు ఉన్నదగ్గర మొలకి చుట్టుకుని నేలమీద పడి సాష్టాంగనమస్కారం చేసి పైకి లేచి ఒంటికి అంటుకున్న తడి తుడుచుకుని నాలుగు అడుగులు మళ్లీ పైకి ఎక్కి ఎడమపక్కకు వస్తే ఉచిత ప్రసాద కేంద్రాలు ప్రసాదాలు తెచ్చుకుని పూలబావి దగ్గర నించుని కొంచెం ముందుకి వెళ్లి ఇత్తడి పంపు నొక్కి వచ్చిన తియ్యటి చల్లటి నీళ్లు నాలుగు గుటకలు తాగి చేతులు కడుగుకుని పంచపైకి పట్టుకుని నీటి గొట్టాలతో కడుగుకుని నాలుగు అడుగులు వేస్తే స్వామి వారి ఊరేగింపులో ముందు పట్టుకెళ్లిన కాగడాలు ఆరిపోయినవి పొగలు వస్తూ అక్కడ ఉంటే దాటి కిందకి దిగి ఎర్ర తివాచీ మీద నడుస్తూ మళ్లీ ఎడమ పక్క గునపం చూసి బయటికి వచ్చి స్వర్ణరథం పూర్వం పెట్టిన ప్రదేశం దగ్గర నిలబడి స్వామివారి దేవాలయ ప్రాకారం వంక చూస్తుంటే జన్మ తరిస్తుంది. కలియుగంలో దశావతార దర్శనం ఎక్కడ అంటే –

**ఇందరికీ అభయమ్ము నిచ్చు చేయి**
**కందువగు మంచి బంగారు చేయి.**



# సందేహాలు సమాధానాలు

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ

**ప్ర) మహాలక్ష్మి అమ్మవారు అష్టలక్ష్ములుగా అవతరించింది కదా! దానికి సంబంధించిన కథను వివరిస్తారా?**

**జ)** అష్టలక్ష్ములు అవతారాలు కావు. వాటికి కథ లేదు. మనకు కావలసిన ఐశ్వర్యాలు ప్రధానంగా ఎనిమిది. వాటిని ప్రసాదించే ఒకే ఐశ్వర్యాధి దేవత శ్రీ మహాలక్ష్మి, అష్టవిధ ఐశ్వర్యాలుగా విభిన్నంగా చూసినప్పుడు ఒక్క లక్ష్మినే ఎనిమిది నామరూపాలతో ఆరాధిస్తున్నాం.

తద్ద్వారా మనకు అవసరమయ్యే అష్ట ఐశ్వర్యాలు ఆ తల్లి దయలేనని గ్రహించగలం!

**ప్ర) 'లక్ష్మీగణపతి' అంటే ఏమిటి? లక్ష్మి విష్ణువుపత్ని కదా? గణపతితో ఉన్న లక్ష్మి ఎవరు?**

**జ)** ఆ లక్ష్మి వేరు. ఈ లక్ష్మి వేరు. ఇవన్నీ మంత్రశాస్త్ర విషయాలు. ఉపాసనారహస్యాలు, 'లక్ష్మి' అంటే 'లక్షణశక్తి'. ప్రతి దేవతకీ, ఆ దేవతాశక్తి లక్ష్మి. ఐశ్వర్యమే లక్ష్మి. ఆ దైవం యొక్క శక్తే ఆ దైవానికి ఐశ్వర్యం. కాబట్టి ఆ దైవశక్తిని 'లక్ష్మి' అన్నారు. విష్ణుపత్ని లక్ష్మికీ, గణపతిశక్తి లక్ష్మికీ భేదం ఉంది.

వీటిని పౌరాణికంగా వ్యాఖ్యానించనవసరం లేదు. మంత్రోపాసనలో భాగాలివి. ఉపాస్యదైవంలో సర్వదేవతాశక్తులూ ఉంటాయి. ఆ విధంగా– పరాశక్తి 'లక్ష్మి' పేరుతో ఉన్న గౌరిగా శివాంకంలో ఉన్నట్లు తంత్రశాస్త్రం వర్ణిస్తోంది.

**ప్ర) గాయత్రీమంత్రం పుస్తకంలో చూసి ప్రతి రోజూ మనసులో జపిస్తున్నాం. ఇలా చేయవచ్చా?**

**జ)** ఏ మంత్రమైనా పుస్తకంలో చూసి, జపించడం పనికిరాదు– మనసులో కూడా. 'జపం' ప్రధానంగా మానసికమే కదా! సరియైన విధానంగా యోగ్యులైన గురువుల నుండి ఉపదేశం పొందిన మంత్రాన్నే జపించాలి.

ఆ మంత్రానికి చెప్పబడ్డ ఋషి, బీజం, కీలకం, అంగన్యాస, కరన్యాసాదులు తెలియాలి. అలా లేనప్పుడు విపరీత ఫలాలిస్తాయి. రోగాలకి మందులు వైద్యగ్రంథాలలో చూసి వాడకూడదు కదా! అయితే స్తోత్రాల, నామాల విషయంలో ఫరవాలేదు. పుస్తకంలో చూసి, సర్వకాల సర్వావస్థలలోనూ చదువుకోవచ్చు.

మంత్రాలను మరో పద్ధతిలో స్తోత్రాదుల ద్వారా అందించారు మహర్షులు. ఏకాగ్రంగా భగవన్నామమో, స్తోత్రమో జపించినా మంచి ఫలితాన్నిస్తాయి.

**ప్ర) దేవతలను పద్మాలలో కూర్చున్నట్లుగా వర్ణిస్తారు. ముఖ్యంగా మహాలక్ష్మిని. ఏ కారణం దేవతలను చేత?**

**జ)** పద్మం పరిపూర్ణకుసుమం. అది ఐశ్వర్యానికీ, వికసించిన జ్ఞానానికీ సంకేతం. జ్ఞానంలోనే దేవతాశక్తి దీపిస్తుంది. అదేవిధంగా దేవతాశక్తి అనుగ్రహించినప్పుడే ఐశ్వర్యం లభిస్తుంది. దేవత అంటేనే ఐశ్వర్యశక్తి. వాక్కు, జ్ఞానం, ధనం, ధాన్యం, సంతోషం, ఆయువు– ఇవన్నీ ఐశ్వర్యాలే. వీటిని అధిష్ఠించి ఉంటారు దేవతలు. ఐశ్వర్యాధిదేవత లక్ష్మిని 'కమల'గా వర్ణించారు.

హృదయాన్ని కూడా పద్మంగా పేర్కొన్నారు. సద్భావాలతో పరిమళించి, శాంతానందమే అనుభూతిమకరందంగా, మెత్తదనమే లక్షణంగా, జ్ఞానంతో వికసించిన మనఃపద్మంలో దైవం గోచరిస్తాడు. దానికి సంకేతంగా పద్మంలో దైవాన్ని దర్శిస్తారు.

యోగపరంగా సుషుమ్నా నాడి మార్గంలో ముఖ్య ప్రాణరూపంగా ప్రసరించే దైవచైతన్యాన్ని ఆరు చక్రాలలో ఆవిష్కరించుకుంటాం. ఆ ఆరు చక్రాలు స్పందించి వికసించాలి. ఏ అవరోధాలు లేకుండా శక్తిని ఆవిష్కరించుకొనేలా ఆ చక్రాలు వికసించినప్పుడు పద్మంవలే భాసిస్తాయి. ఆ ఆరు చక్రాలనే ఆరు పద్మాలుగా వర్ణించారు. వాటిలో ప్రకాశించే ఆత్మచైతన్యమే దేవత. పరమపదంగా బహువిధాలుగా బ్రహ్మరంధ్రంలో ప్రకాశమానమైన సహస్రారకమలంలో పరిపూర్ణ పరబ్రహ్మ తేజస్సు గోచరిస్తుంది. ఈ స్థితిని గ్రహించడానికే కమలంలో దైవాన్ని ఆరాధించడం.

# స్వాతంత్ర్య స్వర్గం

– 'కళారత్న'
డాII కంపల్లె రవిచంద్రన్,
98487 20478

సీII నిర్భయం బైనట్టి నిబిడమౌ నెమ్మది
తలవంచక యెచట తనరగలదొ,
అన్యాయమును గాంచి, అదరక, చెదరక
వాగ్ధాటి ఎచ్చోట వరలగలదొ,
సరిహద్దు లేనట్టి స్వాతంత్ర్య సత్కాంక్ష
పరమమై ఎచ్చోట పరగగలదొ
ద్వార కుడ్యములందు తగ నహోరాత్రుల
నావాస మెచ్చోట నాటగలదో,

గీII అట్టి సౌభాగ్య సుశ్రీక మతిశయించి,
మరియు స్వాతంత్ర్య దివిసీమ విరియునట్లు,
మంచి కలలన్ని ఫలములై మించునట్లు,
కూర్మి భారతావని మేలుకొలుపు తండ్రి!!

సీII మహిత ప్రపంచమే మందిరం బది కాగ,
సందుగొందులతోడ సన్నబడక,
ఖండ ఖండాంతర గళితంబు తా నయి
విడగొట్ట బడకుండ వేద్క నుండి,
సత్యసీమాంతర సహజమౌ భూమిపై
అమృత వాగ్ధారలే అట్టె వెడల,
కర్మప్రవాహంబు కడకు భిన్నంబులై
దిక్కుల నుప్పెనై నిక్కిపార,



గీII అట్టి సౌభాగ్య సుశ్రీక మతిశయించి,
మరియు స్వాతంత్ర్యదివిసీమ విరియునట్లు
మంచి కలలన్ని ఫలములై మించునట్లు
కూర్మి భారతావని మేలుకొలుపు తండ్రి!!

సీII సడలుట నెరుగని శ్రమదేవత యిచట
బాహు లతలఁ జాచి, పథముఁ జూప,
పౌరుషం బది యొండె ప్రతినిత్య మిచ్చోట
వందల ముక్కలై చిందువడక
నిర్జీవ దుశ్శీల నిర్జల భూమిలో
వాహినీ జ్ఞానంబు వరదపార.
ఆశయంబుల గాదు ఆచరణంబుల
హృదయంబు ముందుకు నుదుటు నురక

గీII అట్టి సౌభాగ్య సుశ్రీక మతిశయించి,
మరియు స్వాతంత్ర్య దివిసీమ విరియునట్లు,
మంచికలలన్ని ఫలములై మించునట్లు
కూర్మి భారతావని మేలుకొలుపు తండ్రి!!

*(రవీంద్రుని
'where the mind is without fear'కు
స్వేచ్ఛానువాదం)*

ధారావాహిక

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000



**గతసంచిక తరువాయి..**

వేదవతి లంకలో నానాబాధలు పడింది. ఆమె నిన్ను కోరి తపస్సుచేసింది. అంచేత దయతో వేదవతిని నీవు పెళ్లాడు అని చెప్పింది. అప్పుడు నేను "సీతా! నేను ఏకపత్నీవ్రతుణ్ణి. ఇద్దరిని పెళ్లాడలేను. దేహం తరంలో పెండ్లాడుతాను ద్వాపరాంత కలియుగంలో భక్తుల్ని రక్షించడంకోసం వేంకటాద్రిలో అవతరించే వేళ ఈ కన్యను తప్పక వివాహమాడతాను. ఎప్పుడయితే నేను వేంకటాద్రిలో అవతరించినప్పుడే ఈమె భూలోకంలో అవతరిస్తుంది. ఈ రహస్యం మా ముగ్గురికి తప్ప ఇతరులకు తెలీదు. ఆపై వేదవతిని వహ్ని సంరక్షణలోనే ఉంచి అసలు సీతను చేపట్టాను. విభీషణునికి పట్టం గట్టాను. సౌమిత్రితో, వానరులతో సాకేతం చేరుకున్నాను. ఆపై అయోధ్య పాలకునిగా నా ధర్మం నెరవేర్చాను. నేనే ద్వాపరంలో శ్రీకృష్ణుణ్ణి. వల్మీకంలో దాగిన వాణ్ణి కూడా నేనే" అని వకుళమాతకు శ్రీవేంకటేశ్వరుడు తన పూర్వవృత్తాంతమంతా చెప్పాడు. అయినా వకుళమ్మ వేదవతి వృత్తాంతాన్ని సవిస్తరంగా చెప్పమని ప్రార్థించింది.

"వేదవతి ఒక విప్రకన్య. నన్ను మగనిగా చేసుకోవాలనుకుంది. తపస్సుతోనే నా తోడి వివాహం సాధ్యమని తపస్సుకు సిద్ధమైన తరుణి. కానీ ఆమెను దనుజవిభుడు కామించాడు. విప్రకన్య దేహంపై ఆశ వదలుకుంది. విశ్రవసువుని కుమారునితో "నేనే నిన్ను హరిచేత చంపిస్తా"నని ప్రతిజ్ఞ చేసింది. ఆ పై దేహత్యాగానికి సిద్ధపడ్డ వేళ అగ్ని ఆమెను తన రక్షణలో ఉంచాడు. రావణుడు సీతను కొనిపోయేవేళ ఆ విప్రకన్యను సుందరస్త్రీగా మార్చి రావణునికి అప్పగించాడు. సీతమ్మను తన దేవేరి స్వాహా సంరక్షణలో నిలిపాడు.

ఆ వేదవతి లంక చేరుకొని దశగ్రీవుణ్ణి నా చేత సంహారం చేయించింది. వహ్నిలో కనబడ్డ సీతను నా కప్పగించి బ్రహ్మలోకానికి వెళ్లి ఘనతపం కొన సాగించింది. తదనంతరం పద్మంలో ప్రవేశించింది. ఆకాశరాజు పుత్రాకామేష్టి ప్రయత్నంలో యాగభూమిలో శిశువుగా అవతరించింది. ఆమె వనసీమలో నన్ను చూచి మోహించింది. నేనూ ఆమెను మోహించాను" అని వేదవతి వృత్తాంతాన్ని తెలియజేశాడు.

ఇవన్నీ ఓపికగా విన్న వకుళ స్వామిని చూస్తూ "ఓ దేవా! మహానుభావా! నేను అజ్ఞానంతో నిన్ను సామాన్య మానవుడిగానే లెక్కగట్టాను. నీవు అమాయకపు బాలుడవని భావించాను. సాక్షాత్ బ్రహ్మమని తెలుకోలేకపోయాను." వేంకటేశా! నా కుమారుడవని నీ పట్ల నేను వాత్సల్యం పెంచుకొన్నాను. నీవే ఈశ్వరుడవని తెలుసుకోలేకపోయాను" అంది.

"అమ్మా! నీవు నన్ను తల్లిలాగానే సాకావు. తల గాయాన్ని మానేలా చేశావు. నీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలీక సదా ఆలోచిస్తున్నా" అని మాయతో ఆవిడను సామాన్యస్త్రీ లాగే చేశాడు. తన పట్ల ఆవిడకు పుత్రభావమే ఉండేలా చేశాడు. ఆపై "నాకు నీవే వివాహం చేయాలి. పెళ్లి పెత్తనానికి నీవే వెళ్లాలి." అని బుజ్జగించాడు.

స్వామి చెప్పినవన్నీ విన్న వకుళ "అంతా బాగుంది. నేను ఈ కొండ నుండి ముందు దిగాలి కదా! ఆ మార్గమేదో చెప్పమని కోరింది."

వేంకటేశుడు 'అమ్మా! చూడు. నేను నిర్దేశించిన మార్గంలో పయనం సాగించు. పావనపుణ్యతీర్థంలో మునకలు ముగించు. కపిలమహాముని ప్రతిష్ఠిత శివలింగాన్ని దర్శించి మొక్కి శ్రీనివాసునికి శీఘ్రంగా పెళ్లి అయ్యేలా చూడమని మనసా ప్రార్థించి ఆ పై శుకాశ్రమం చేరి ఆ మహర్షికి నమస్కరించి, అగస్త్యాశ్రమానికి వెళ్లి ఆ మునికి వందనాలర్పించి, అక్కడి శివాలయాన్ని దర్శించి, తగిన ప్రార్థనలు చేసి, అక్కడున్న స్త్రీ జనం వెంబడి నారాయణపురం చేరుకుని, నారాయణపుర రాణి దగ్గరకు వెళ్లి పద్మావతితో నా వివాహం జరిగేలా అనుకూలంగా మాట్లాడవమ్మా" అన్నాడు.

(ఇంకా ఉంది)

## అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీక

# రక్షాబంధనం

– శ్రీమతి డి.పూర్ణిమా స్వాతి

శ్రావణపూర్ణిమ, వరలక్ష్మీ వ్రతం అంటే తెలియని వారు ఉండవచ్చునేమో కానీ, రాఖీపూర్ణిమ అంటే తెలియని వారుండరు. పూర్ణిమనాడు శ్రవణానక్షత్రం ఉన్న మాసానికి శ్రావణమాసమని పేరు. శ్రావణమాసంలో రాత్రివేళ పూర్ణిమ తిథి ఉన్న రోజును 'రక్షికా పూర్ణిమ' అన్నారు పెద్దలు. రక్షించగలిగిన పూర్ణిమ, రక్షణ కోరుకునే వారికోసం ఉద్దేశింపబడ్డ పూర్ణిమ అని ఈ రక్షికాపూర్ణిమ అర్థాలు. ఈ పండుగ కాస్తా కాలక్రమంలో రాఖీపూర్ణిమగా పేరు మార్చుకుంది.

### ఈ పండుగనాడు ఇలా చేయాలి

శ్రావణపూర్ణిమనాడు సూర్యోదయకాలంలోనే స్నాన విధిని పూర్తి చేయాలి. ఎవరిని రక్షించదలిచామో – అంటే నేటి నుండి ఒక సంవత్సరంపాటు ఎవరికి అండగా ఉండదలిచామో ఆ వ్యక్తి ముంజేతికి మనం కట్టబోయే రక్షిక(రాఖీ)ని దైవం ముందుంచి పూజ చేయాలి. వరుడు కట్టబోయే మంగళ సూత్రానికి ఎలా మాంగల్యబలం పూజ చేస్తారో, ఆ పూజాశక్తి దానిలో ప్రవేశించి ఆ సూత్రాన్ని కట్టించుకున్న ఆమెకి, కట్టిన వ్యక్తికి ఆపద లేకుండా చేస్తుందో అంతటి శక్తి ఉన్నది ఇక్కడ రక్షికకి. కాబట్టి దీనికీ పూజ చెయ్యాలి. అంటే పూజ ద్వారా పూజాశక్తిని దానిలోనికి ప్రవేశింపచెయ్యాలన్న మాట. అలా పూజాశక్తితో కూడుకున్న ఈ రక్షికని ఒక సంవత్సరకాలంపాటు మనం ఎవరిని రక్షించడానికి అండగా నిలువదలిచామో ఆ వ్యక్తి ముంజేతికి బహిరంగ ప్రదేశంలో కడుతూ 'తప్పక అండగా నిలుస్తానని ప్రమాణం చేస్తున్నా'నంటూ బంధు, స్నేహితుల మధ్య ప్రకటించి ఆ రక్షిక మీద అక్షతలని వేయాలి. ఇలా కట్టడాన్ని అపరాహ్ణ సమయంలో మాత్రమే చేయాలని శాంతి కమలాకరం చెప్తోంది. కాబట్టి ఇది నేటి ఆచారం కాదనీ, ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయమేనని తెలుస్తుంది. రక్షాబంధనం కట్టడం పూర్తయింది కదా అని ఇక వదిలేయకూడదు. మాటకు కట్టుబడి ఆ సంవత్సరకాలంపాటూ ఆమెకి అన్నింటా అండగా నిలవాలి. మరోముఖ్య విశేషమేమిటంటే ఇది కేవలం స్త్రీలు మాత్రమే కట్టాలనే నియమం ఎక్కడాలేదు. ప్రతిఫలాన్ని ఆశించకుండా నిష్కల్మషమైన ప్రేమతో, స్వచ్ఛమైన మనసుతో జరుపుకునే ఈ పండుగ సమాజంలో అందరూ ఒకరికొకరు తోబుట్టువుల వంటి వారేనని, స్వంత సంబంధం లేకపోయినా, సామాజికంగా పురుషుల మధ్య ప్రేమ, ఆత్మీయత, మమతానురాగాలు పరిఢవిల్లాలని, తోబుట్టువులు లేరని చింతించకుండా సోదర ప్రేమ కలిగిన వారికి రక్షణగా నిలవాలన్నది ఈ పండుగ పరమార్థం.

అలా అండగా నిలవాలనే పవిత్రోద్దేశం ఉంటే స్త్రీలకి స్త్రీలూ, పురుషులకు పురుషులు కూడా కట్టుకోవచ్చు. స్థితికారుడైన శ్రీహరి జన్మనక్షత్రం శ్రవణం నిండుగా ఉండే ఈ శ్రావణపూర్ణిమనాడే "నేను ఫలాని వారికి రక్షణ కోసం



కడుతున్నాను. నిరంతరం లోకాలని రక్షిస్తూనే ఉండాలనే తపనగల ఆ శ్రీహరి అనుగ్రహం నా మీద ప్రసరించి నేనూ రక్షించేవాడిగానే ఉండాలని అర్థం. చేసుకోవడానికే శ్రావణ పూర్ణిమని ఈ పండుగరోజు నిర్ణయించారని గమనించాలి. అపరాహ్ణ సమయంలో రక్షికని కడుతున్నది నా రక్షికాబంధానికి ఆ ప్రత్యక్ష కర్మసాక్షి సూర్యుడని తెల్పడానికే!

"రాక్షసులకు రాజు, మహాబలవంతుడు అయిన బలి చక్రవర్తి ఏ రక్షాబంధనశక్తి కారణంగా శ్రీహరికి వశమైపోయాడో, దేవతలంతా తమతమ తపశ్శక్తిని శ్రీహరికి బాసటగా ఉంచుతూ రక్షికని కట్టారో ఆ రక్షికా శక్తి నాలో ప్రవేశించిన నేను కూడా ఈ మిత్రునికి లేదా మిత్రురాలికి ఈ రక్షికని ముడివేస్తున్నాను. ఓ రక్షికా! రక్షణశక్తి నీ నుండి తొలగకుండును గాక!" అని చెప్పుకోవాలి!

ఒకప్పుడు తెల్ల ఆవాలతోనూ, అక్షతలతోనూ పూజింపబడ్డ రక్షికని పురోహితుడు (ఇంటి పురోహితుడు) ఆ దేశపు రాజు ముంజేతికి ముడి వేసేవాడు. ఆపత్సమయంలో ఇతర సంకటాలు ఏమైనా ఏర్పడినప్పుడూ చక్కని సూచనల నిస్తూ, ఉపాయాలు చెప్తూ రక్షిస్తూ ఉంటానని భావం.

### శ్రీపదకేళి

### :: 127 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 వ | ర | 2 ల | క్ష్మీ | 3 వ్ర | త | 4 ము | | 5 జం |
| రా | | క్ష్మి | | జ | | క్తి | | ధ్యా |
| హా | | | 6 మ | ను | వు | | 7 క | ల |
| వ | | 8 ఆ | | డు | | 9 గ | | పూ |
| 10 తా | మి | శ్ర | ము | | 11 పో | రు | | ర్ణి |
| ర | | మం | | 12 కా | | డ | | మ |
| 13 ము | గ్గ | | 14 ని | మి | | 15 పం | కం | |
| | | 16 ర | | క | | చ | | 17 పా |
| | 18 ప | వి | త్ర | | 19 అ | మి | త | ము |

ఉదయకాలంలో అంటే పన్నెండుగంటల లోగా దారాలతో ఉండే యజ్ఞోపవీతాన్ని వైదికులు ధరిస్తే అపరాహ్ణ కాలంలో ఈ అభేదం లేకుండా అలాగే దారాలతో ఉండే రక్షికని అందరూ కట్టడం గాని, కట్టించుకోవడంగాని చేస్తుండేవారు. యజ్ఞోపవీతం, అలాగే రక్షిక అనేవి రెండూ దారాలతో చేయబడినవే కావడం కారణంగా కొందరు ఈ రక్షికని కట్టే పూర్ణిమని నూలు పున్నమి అని కూడా పిలుస్తారు.

## శుభకార్యాలప్పుడు కట్టే రక్షాబంధనానికి, దీనికి తేడా ఏమిటి?

ప్రతి శుభకార్యంలోనూ, ముఖ్యంగా వివాహ సమయంలో కట్టే రక్షాబంధనమూ, ఇదీ ఒకటి కానేకాదు. వధూవరులూ, వారి తల్లిదండ్రులూ ఏదో పనిధ్యాసలో పడి వివాహ స్థలాన్ని విడిచి వెళ్లిపోకుండా ముంజేతికి కట్టింది కనిపిస్తూ అనుక్షణం 'నువ్వు ఒక ముఖ్యమైన పనిలో బద్ధుడివై ఉన్నావని' తెలియజేస్తూ ఉండేది రక్షాబంధం. ఇది మహా అయితే కొన్ని గంటలపాటు ఉంచుకునేదే అయితే రక్షిక మాత్రం సంవత్సరకాలం పాటు ఉంచుకోవాల్సిన బంధం.

**పౌరాణికం :** ఒకసారి రాక్షసులు ఇంద్రలోకంపై దండెత్తారు. దేవరాజు ఇంద్రుడు రాక్షసులతో తీవ్రంగా పోరాడాడు. అయితే ఈ పోరులో రాక్షసులదే పైచేయిగా మారింది. ఇంద్రుని బలం క్షీణించి అలసిసొలసి స్పృహతప్పి నేలపైకి ఒరిగిపోయాడు. ఈ పరిస్థితుల్లో దేవగురువు బృహస్పతి యుద్ధం ఆపి, రాక్షసులకు లొంగిపోవటం శ్రేయస్కరమని హితవు పలికాడు. అయితే మహేంద్రుని భార్య శచీదేవి అందుకు అంగీకరించలేదు. యుద్ధంలో విజయం సాధించడానికి తన పతికి తగిన బలం ప్రసాదించవలసిందని త్రిమూర్తులను ప్రార్థిస్తూ ఒక రక్షాబంధనాన్ని భర్త చేతికి కట్టి, ఆయనను ఉత్సాహపరుస్తూ తిరిగి యుద్ధానికి పురికొల్పింది. రక్షాబంధన ధారణతో నూతనోత్తేజం పుంజుకున్న ఇంద్రుడు ఈసారి యుద్ధంలో రాక్షసులను జయించాడు. రక్షాబంధన ప్రాశస్త్యాన్ని గుర్తించిన దేవతలు ఆనాడు శ్రావణపూర్ణిమ కావడంతో నాటినుంచి ప్రతి శ్రావణ పూర్ణిమనాడూ ఎవరి శ్రేయస్సునైతే తాము కాంక్షిస్తున్నామో వారికి బలాన్ని, శక్తిని ప్రసాదించి, రక్షణ నివ్వవలసిందిగా కోరుతూ వారి ముంజేతికి రక్షాకంకణాన్ని కట్టడం ఆచారంగా మారింది.

దుష్టశక్తులపీడ లేకుండా, వాహన ప్రమాదాలు, తదితర విపత్తుల బారినుంచి కాపాడి భగవంతుడు ఈ సంవత్సరమంతా మీకు రక్షగా నిలవాలని కాంక్షిస్తూ ఎంతో దూరాభారాలకు ఓర్చి పుట్టింటికి వచ్చి సోదరుల చేతికి రక్షాబంధనం కట్టడం, వారికి తీపి తినిపించడం, "నీకు అండగా



నేనున్నాను" అని అభయమిస్తూ సోదరులు వారి శక్తికొద్దీ పసుపుకుంకుమలు, చీరసారెలతో సత్కరించడం సత్సంప్రదాయం. ఈ సంప్రదాయాన్ని ఒక పండుగలా జరుపుకోవడంతో మాత్రం సరిపెట్టకూడదు. అందులోని అంతస్సూత్రాన్ని అర్థంచేసుకుని, దాన్ని ఆచరణలో పెట్టినప్పుడే సామాజిక శ్రేయస్సు పరిఢవిల్లుతుంది.

**శ్రావణపూర్ణిమ ప్రాశస్త్యత :** దైవీకశక్తులతో కూడిన శ్రావణపూర్ణిమనాడు చేసే దేవతారాధన, జపం, స్తోత్రపారాయణం సత్ఫలితాల నిస్తాయి. దక్షిణభారతదేశంలో శ్రావణపూర్ణిమనాడు ద్విజులు నదులలో, చెరువులలో లేదా కాలువస్నానం, అదీ కుదరనప్పుడు ఇంటి వద్దనయినా స్నానం చేసి జీర్ణ (పాత) యజ్ఞోపవీతాన్ని విసర్జించి, నూతన యజ్ఞోపవీతాన్ని ధరిస్తారు. ముహూర్తంతో నిమిత్తం లేకుండా ఈ రోజున ఉపనయనాలు కూడా చేసుకోవడం కొన్ని ప్రాంతాలలో ఉంది. కొత్తగా ఉపనయనం జరిగిన వారికి శ్రావణపూర్ణిమనాడు ఉపాకర్మ జరిపిస్తారు. యజ్ఞోపవీతం ధరించే ప్రతి ఒక్కరు ఈ జంధ్యం మార్చుకోవడం ఆచారం.

### ఈ పండుగ పరమార్థం ఏమిటి?

**తన సోదరుని జీవితం తీపివలె ఎల్లప్పుడూ కమ్మగా ఉండాలని, తలపెట్టే ప్రతిపని విజయవంతం కావాలని, అతనికి సకలసంపదలు చేకూరాలని కోరుతూ తోబుట్టువులు సోదరుని చేతికి రక్షాబంధనం కట్టడమే ఈ పండుగ పరమార్థం.**

**ప్రతిఫలాన్ని ఆశించకుండా నిష్కల్మషమైన ప్రేమతో, స్వచ్ఛమైన మనస్సుతో ఈ పండుగ సమాజంలో అందరూ ఒకరికొకరు తోబుట్టువుల వంటి వారేనని, సొంత సంబంధం లేకపోయినా, సామాజికంగా స్త్రీ పురుషుల మధ్య ప్రేమ, అత్మీయత మమతానురాగాలు పరిఢవిల్లాలని, తోబుట్టువులు లేరని చింతించకుండా సోదర ప్రేమ కలిగినవారికి రక్షణగా నిలవాలన్నది ఈ పండుగ ఉద్దేశ్యం.**




ఇది మన క్షేత్రం.
ఇది మనందరి పుణ్యక్షేత్రం.
ఈ పవిత్రక్షేత్రాన్ని పరిశుభ్రంగా ఉంచడం
మనందరి బాధ్యత..
మన అడుగులు..
స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర వైపు!

# తిరుమల ఆలయం- విఖనస ఆరాధన

– డా॥ నొస్సం నరసింహాచార్య, 90528 44442

తిరుమల శ్రీవారి ఆలయానికి, శ్రీవైఖానస భగవదారాధనా విధానానికి, చాలా ప్రాచీనకాలం నుండే అవినాభావ సంబంధం ఉంది. విష్ణ్వంశ సంభూతుడైన భగవాన్ విఖనస మహర్షి శిష్యులైన ఋషులు – అత్రి, భృగు, మరీచి, కశ్యపుడు, గురువుగారి ఆదేశం మేరకు అనేక వైఖానస సంహితలను రచించి వాటి ఆధారంగా ఈ భూమండలంలో విష్ణువును ఆరాధించారు. మరీచిమహర్షి మందరక్షేత్రంలో, అత్రి శ్రీనివాస క్షేత్రంలో, కశ్యపుడు విష్ణ్వధిష్ఠాన క్షేత్రంలో, భృగుమహర్షి శుభక్షేత్రంలో, శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్ర విధిగా శ్రీమహావిష్ణువు అర్చారూపాన్ని ఆరాధించారు.

## భగవాన్ విఖనసమహర్షి

భగవాన్ విఖనస మహర్షి విష్ణుమానసపుత్రుడు. ఆదికాలంలో యజుర్వేదశాఖగా వైఖానస సూత్రాన్ని రచించిన విఖనసుడు స్వయంగా బ్రహ్మ అని మరీచి ఆనందసంహిత తెలియజేస్తోంది. విఖనసమహర్షి వంశీయులే 'వైఖానసులు'గా ప్రసిద్ధి చెందారు.

విష్ణువే విఖనసుడు. ఆయన వంశస్థులు వైఖానసులు. విష్ణు వంశజుడైన విఖనసుడు ఉపదేశించిన సూత్రం, చాలా ఉత్తమమైంది. భగవంతుడైన మహావిష్ణువు భూలోకంలో అర్చావతార రూపంలో అవతరించదలచాడు. విష్ణువును ఆరాధించడానికి ఒక సమగ్రమైన ఆరాధన విధానం అవసరమైంది. అందువల్ల మహావిష్ణువు, బ్రహ్మను సృష్టించి, తన ఆరాధనకోసం ఒక సమగ్రమైన విధానాన్ని రూపొందించమని ఆదేశించాడు.

కాని బ్రహ్మదేవుడు తన అశక్తతను తెలియజేయగా, అప్పుడు శ్రీమహావిష్ణువు తన మనస్సులో సమస్త వేదరాశిమీద దృష్టి నిలిపి ధ్యానించాడు. తత్ఫలితంగా, భగవాన్ విఖనస మహర్షి విష్ణువు మనస్సు నుండి ఉద్భవించాడు. సలక్షణంగా, దివ్యమైన తేజస్సుతో విష్ణు చిహ్నాలైన, చతుర్భుజాలు, శంఖ, చక్రాలతో, అభయ వరదహస్తాలతో, ద్వాదశ ఊర్ధ్వపుండ్ర ధారియై, కమండలం, త్రిదండం చేతబూని తులసీ, పద్మ మాలలు, కిరీట కర్ణకుండలాలతో వెలుగొందుతున్న విఖనసుడు భగవంతునికి నమస్కరించి "ఆజ్ఞాపించమని" అడుగగా, విష్ణువు తన ఆరాధనకై శాస్త్రాన్ని రూపొందించుమని ఆదేశించాడు.

విఖనసుడు వేదరాశి మీద ధ్యానించి మహత్తరమైన శ్రీ వైఖానసకల్పసూత్రాన్ని రూపొందించాడు. ఇదే తర్వాతి కాలంలో విఖనసుడి శిష్యాదులచే విస్తరింపబడి, శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్రం అనే పేరుతో ప్రసిద్ధి చెందింది.





శ్రీసూక్త మంత్రంలో మహాలక్ష్మి సూర్య, చంద్రాగ్ని స్వరూపిణీ అని చెప్పబడింది

*(గత సంచిక తరువాయి భాగం...)*

శ్రీగోదాదేవి దివ్యావతారకాలమైన మిథున శ్రీపూర్వ ఫల్గునీ నక్షత్రరూప విశిష్టవేళలో శ్రీగోదాదేవిని శ్రీగోవింద రాజ స్వామితో చేర్చి తిరుమల యడివారమున అలిపిరి మండపంలో స్వయంవ్యక్తమైన శ్రీవేంకటాచలపతి దివ్యపాదార విందాల ముందు విజయం చేయించి శ్రీవేంకటేశ్వరుడు శ్రీశైలపూర్ణులకు ప్రత్యక్షమైనారు.

## తిరుపతిలో శ్రీగోవిందరాజస్వామివారి ఆరాధన క్రమం

బ్రహ్మాండపురాణంలో దశాధ్యాయియైన శ్రీవేంకటాచల మాహాత్మ్యంలో నారదమహర్షి- శ్రీనారాయణుని దర్శించుకొని పాదాభివందనం చేయగా శ్రీవిష్ణుదేవుడు-

“వత్సా! నీవు ముల్లోకాలు చూచావు. బ్రహ్మాండంలో ఏ దేశంలో నాకు వాసం తగి యుండగలదు? నా విహారానికి అకర్వమై ఉత్తమమైన విశ్రాంతి స్థానమేది? భూలోకంలో అలాంటి ప్రదేశముంటే నాకు చెప్పు” అని ప్రశ్నింపగా శ్రీనారద మహాముని –

“ప్రభూ! నీ పాదంనుండి ఆవిర్భవించిన గంగానదికి దక్షిణదిగ్భాగంలో రెండువందల ఆమడల మితిగల దండ కారణ్యంలో, దక్షిణసముద్రానికి ఉత్తరంగా, తూర్పుసముద్రానికి పశ్చిమభాగంలో అయిదామడల మితిగల పడమటి భాగంలో ఉన్న ఈ రమణీయ స్థానం నీకు విహారయోగ్యం.”

ఇత్యాది వచనాలచేత, ఇలాంటి గుర్తులతో తిరుమల కొండే నిత్యనివాసయోగ్యమని పలుకగా శ్రీహరి–

ఆనందవికసిత నయనుడై ఎదుటనున్న శేషుని పిలచి మేఘధ్వనిగంభీరమైన వాక్కుతో ఇలా అన్నాడు.

“అనంతా! నీకంటే నాకు ప్రియమైనవాడు ఈ లోకంలో మరొకరు లేరు. కావున నీవు నాకు ప్రియమైన క్రొత్తపని చేసిపెట్టాలి. నారదుడు పలికినదంతా విను. విహారయోగ్యమైన దేశంలో వసించాలని నా నిర్ణయం. నీవు భూతలంపై పర్వతరాజువై ఉండు. నీ ఫణామండలాధిదేశంపై రమతోడ నే నుండాలి”

ఇలా శ్రీశేషుని పర్వతంగా ఉండుమని నియమించి తాముకూడ శ్రీదేవిమున్నగు దేవేరులతోడ, విష్వక్సేనుడు మున్నగు నిత్యసూరులతో అవతరించాలని సంకల్పించాడు.




క్షీరాబ్ధిశయనుడైన శ్రీహరి తానుగనే శేషాద్రికి విజయం చేసినాడనే విశేషవృత్తాంతం పురాణసిద్ధమగుట చేత క్షీరాబ్ధి శాయికిని వేంకటాచలపతికిని వస్త్యైక్యం సిద్ధమే యైనను పూర్వభావిత్వ – పశ్చాద్భావిత్వములు (మొదట నేర్పడుట, తరువాత నేర్పడుట) ఏర్పడకుండుటను గూర్చి భగవద్రామానుజులవారు శ్రీచిత్రకూటం (చిదంబరము)నందు క్రిమి కంఠచోళవ్యాజమున మూలబేరము సముద్రంలో ప్రవేశించుట వల్ల ఆ మూలవిగ్రహమైన నీలమహా సముద్రమున నున్న వానినిగూడ ఆవాహన చేసికొని ఉత్సవమూర్తిగ విజయం చేసిన దేవాధిదేవునకు మూలవిగ్రహముగ క్షీరాబ్ధిశాయిని తిరుమల యడివారమునందు శ్రీప్రతిష్ఠ చేయించారు.

*(ఇంకా ఉంది)*

# సకల దేవతాస్వరూపిణి గాయత్రీదేవి

– శ్రీమతి పి.రమాదేవి

వేదజననీ లోకపావనీ అయిన గాయత్రీదేవి నాలుగు వేదాలకు జనని. సమస్తలోకాలను పావనం చేసే పరతత్త్వం గాయత్రి. గాయత్రీమంత్రాన్నే వేదమాతగా భావించి, సకల వేదాలసారంగా పరిగణించి సాధకులు ధ్యానిస్తారు. సర్వలోకాలను సజీవంగా నిలిపి ఉంచే సూర్యశక్తిని ఉపాసించడం, నిరంతరభావనలో నిలుపుకోవడం దీని తాత్పర్యం. సకల వేద సారంగా భావించే గాయత్రీమంత్రం అత్యంత శక్తివంతమైంది. ఈ మంత్రాన్ని ప్రతిరోజూ పఠించడంవల్ల బుద్ధి వికసిస్తుంది. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. జ్ఞానోదయం కలుగుతుంది.

**మంత్రం:** ఓం భూర్భువస్వః। తత్సవితుర్వరేణ్యం।
భర్గో దేవస్య ధీమహి। ధియోయోనః ప్రచోదయాత్॥

ఈ గాయత్రీమంత్రం మొదట ఋగ్వేదంలో చెప్పబడింది. గాయత్రి పదం 'గయ', త్రాయతి' అనే పదాలతో కూడుకొని ఉంది. 'గయాన్ త్రాయతే ఇతి గాయత్రీ' అని ఆది శంకరులు విశదీకరించి చెప్పారు. "గానం చేసేవారిని రక్షించేది గాయత్రి" అని అధ్యాత్మకోవిదుల మాట. ఈ గాయత్రీ మంత్రాన్నే దానికి లక్ష్యమైన సవితృదేవత పేర సావిత్రి అని, లోకంలోనికి (మనోభూమిక లోనికి) దిగివచ్చినందుకు సరస్వతి అని చెప్పారు. ఈ మంత్రానికి ద్రష్ట విశ్వామిత్రుడు.

'ఓం' అనగా అకార, ఉకార, మకార అర్ధమాత్రల సంయోగరూపమైన ప్రణవం. ఇది మొదటిభాగం. రెండవది వ్యాహృతుల సమ్మేళనం. భూః= భూలోకం; భువః= పితృలోకం, సువః=దేవలోకాన్ని సూచించే మూడులోకాలను సూచిస్తూ సూక్ష్మస్థితిలో శరీరం– మనోప్రాణాలు– ఆత్మలను ఆయా స్థితులను అనుభవింపచేసేది.

'ఓం' అనేది ప్రణవం. మూలమంత్రం. దీని నుంచే అన్ని ఇతరమంత్రాలు, శబ్దాలు, వేదాలు మొదలైన సమస్తం ఉద్భవించాయి. భూః అన్న శబ్దం నుంచి ఋగ్వేదం, భువః అన్న శబ్దం నుంచి యజుర్వేదం, సువః నుంచి సామవేదం పుట్టాయి.

ఇక భూః+ భువః+ సువః అనేవి సృష్టి, స్థితి, లయ కార్యక్రమాలు నెరవేర్చే త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల స్వరూపశక్తులు, అవే ప్రాణశక్తులు. వ్యాహృతులు. మన లోని త్రిగుణాలు కూడా ఇవే. సర్వ ఉపనిషత్ సారమే గాయత్రి. వీటినే జాగ్రత, స్వప్న, సుషుప్తి అవస్థలుగా కూడా వివరిస్తారు.

సవిత అనే దేవతాశక్తి సర్వప్రాణులను సృజిస్తుంది. వాటికి మేధస్సును ప్రసాదిస్తుంది. 'వరేణ్యం' అనగా భగవంతుని వద్దనుండి మానవుడు పొందగలిగినటువంటిది సత్యం, శివం, సుందరం కొరకై సన్మార్గంలో అన్వేషణకు ప్రేరణనిచ్చే శక్తి. 'భర్గో' అనగా మాయను తొలగించి, జ్ఞానం ప్రసాదించే భగవంతుని స్వయం తేజోమయశక్తి. "దేవస్య" అనగా సర్వ వ్యాపకమైన ప్రభువుకే ప్రభువైన బ్రహ్మస్వరూపం, "ధీమహి" అనగా మనశ్శాంతి నిచ్చి పరమాత్మతో ఏకమయ్యే మార్గాన్ని చూపగల బుద్ధిని ఇవ్వమని ఈశ్వరుని అర్థించుట. ఏకాగ్రత, జ్ఞానం ద్వారా మానవుడు దీన్ని పొందవచ్చు.

"ధీ" అనగా బుద్ధి. మనస్సుద్వారా ఆలోచించి, వాక్కు ద్వారా చెప్పబడి, కర్మ ద్వారా ఆచరింపబడే త్రికరణశుద్ధి. "యః" ఎవరైతే అలా చేస్తారో అట్టివారందరూ "నః" నేనేకాక అట్టివారందరూ అనగా సమస్త మానవాళి సద్బుద్ధి, సదాలోచన సత్కార్యాచరణ పొందాలి.

"ప్రచోదయాత్" మమ్ములను బట్టి మంచిమార్గంలో నడిపించే దైవత్వాన్ని చేరు సన్మార్గం వైపు మమ్ములను సదా ప్రేరేపించుగాక అని అర్థం.

## గాయత్రీ జననం

శ్రీ దేవీభాగవతం నవమ స్కంధంలో గాయత్రీదేవి జననం గూర్చి ఒక ఉపాఖ్యానం ఉంది. ప్రకృతి స్వరూపిణి అయిన ఆదిపరాశక్తి సృష్టి ప్రారంభవేళ యోగశక్తితో తనను తాను (ఆత్మ) రెండుగా విభజించుకుంది. వీటిలో కుడిభాగం పురుషుడిగా, ఎడమభాగం స్త్రీగా రూపాంతరం చెందాయి. ఆ స్త్రీరూపం ఆదిపరాశక్తి, సృష్టివికాస వేళ ఈ ఆది పరాశక్తి ముఖ్యంగా 5 స్త్రీరూపాలుగా పరిణామం చెందింది. అవి 1)పార్వతి 2)మహాలక్ష్మి 3)సరస్వతి 4)గాయత్రి 5)సావిత్రి.

## అక్షరానికో అధిదేవత

గాయత్రీమంత్రంలో 24 బీజాక్షరాలున్నాయి. ఈ అక్షర క్రమంలో ఋషులున్నారు. 1)వామదేవుడు 2)అత్రి 3)వశిష్ఠుడు 4)శుక్రుడు 5)కణ్వుడు 6)పరాశరుడు 7)విశ్వామిత్రుడు 8)కపిలుడు 9)శౌనకుడు 10)యాజ్ఞవల్క్యుడు 11)భారద్వాజుడు 12)జమదగ్ని 13)గౌతముడు 14)ముద్గలుడు 15)వేదవ్యాసుడు 16)లోమశుడు 17)అగస్త్యుడు 18)కౌశికుడు 19)కత్సుడు 20)పులస్త్యుడు 21)మాండూకుడు 22)దూర్వాసుడు 23)నారదుడు 24)కశ్యపుడు

ఇదేవిధంగా 24 బీజాక్షరాలకు 24 మంది అధిదేవతలున్నారు. వారు. 1)అగ్ని 2)ప్రజాపతి 3)వాయువు 4)ఈశానుడు 5)సవిత్రుడు 6)ఆదిత్యుడు 7)బృహస్పతి 8)మిత్రావరుణుడు 9)భగదేవత 10)ఆర్యమ 11)గణేశుడు 12)త్వష్ట 13)పౌష్ణ 14)ఇంద్ర 15)వాయవ్య 16)వామదేవ 17)మైత్రావరుణి 18)వైశ్వదేవ 19)మాతృదేవ 20)విష్ణు 21)వసుదేవ 22)రుద్రదేవ 23)కుబేరదేవ 24)అశ్వినీదేవ

వాల్మీకి రామాయణానికి మూలాధారం గాయత్రీ మంత్రమేనని, గాయత్రీమంత్రంలోని ఒక్కొక్క బీజాక్షరానికి వెయ్యి శ్లోకాల చొప్పున 24 వేల శ్లోకాలతో వాల్మీకి రామాయణాన్ని రచించడం జరిగిందని పురాణాల ద్వారా తెలుస్తోంది. గాయత్రీ మంత్రబీజాక్షరాలతో కూడిన శ్రీమద్రామాయణ పారాయణం వల్ల సకలశుభాలు చేకూరుతాయి.



## బ్రహ్మపురాణం ఉవాచ

గాయత్రీమంత్రానికి బ్రహ్మపురాణం అర్థవివరణ ఇచ్చింది. భూలోకం, స్వర్గలోకం, అంతరిక్షంతో పాటు సమస్త ప్రకృతికి వెలుగును ప్రసాదించేది. బ్రహ్మ, విష్ణు, మహేశ్వర సర్వదేవాత్మకమైంది. జ్ఞానానంద స్వరూపం. అజ్ఞానాన్ని పారదోలేది. దివ్యమైన జ్యోతి స్వరూపము. సృష్టి స్థితి లయలకు కారణము, పవిత్రము. ఏ తేజస్సు జ్ఞానమును వెలిగిస్తోందో ఆ తేజోరూపమైన పరమాత్మను ధ్యానిస్తున్నాను అని అర్థం.

## పద్మపురాణం విశ్లేషణ

గాయత్రీమంత్రంలోని 24 అక్షరాలు మన శరీరంలోని వివిధ అవయవాలను అదుపు చేస్తుంటాయి. ఈ మంత్రజపం వల్ల ఆయా అవయవాల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చు. తత్– కాలి బొటనవేలు; స– చీలమండ; వి– పిక్కలు; తుకి– మోకాళ్లు; వ– తొడలు; ర్– మర్మావయవం, న– వృషణాలు; యం– నడుము, భరి–బొడ్డు; గ్–పొట్ట; దే– స్తనాలు; వ– హృదయం, స్య– చేతులు, ధీ– నోరు; మ– దవడలు; హి– ముక్కు, ధియో– భృకుటి; న– ముఖంపైభాగం; ప్ర– ముఖం కుడిభాగం; చో– ముఖం క్రింది భాగం; ద– ముఖం ఎడమ భాగం; యాత్– శిరస్సు. ఈ వర్ణాలతో శరీరభాగాల చైతన్య శక్తి బంధాన్ని గురించి పద్మ పురాణం వివరించింది.

## ఫలశ్రుతి

**"అగ్నిర్ముఖం, బ్రహ్మ శిరః విష్ణు హృదయం, రుద్ర శిఖాః"** అని గాయత్రీరూపాన్ని గురించి వేదపాఠం, సృష్టిస్థితి లయకారకులైన బ్రహ్మవిష్ణుమహేశ్వరులే గాయత్రీదేవి అవయవాలు అని దేవీభాగవతం కూడా వర్ణించింది.

సంధ్యాదేవత అయిన గాయత్రిని తొలిసంధ్యలో గాయత్రిగా, మధ్యాహ్న సంధ్యలో సావిత్రిగా, సాయంత్ర సంధ్యలో సరస్వతిగానూ పూజిస్తారు. గాయత్రీమంత్రాన్ని త్రికాలాల్లో యథాశక్తి జపించడం ఆచారం. గాయత్రి మంత్రాన్ని జపించడంవల్ల ఐశ్వర్య, జ్ఞాన, వైరాగ్యసిద్ధులతో పాటు సకల కార్యసిద్ధి కలుగుతుంది. ప్రాణాయామం కలిపి గాయత్రీ మంత్రాన్ని ధ్యానించడం ఆరోగ్యాన్నిస్తుంది.

# మహాభక్త కవయిత్రి

– డా॥ సంగీతం కేశవులు, 90146 57722

- బాల్యంలో వెంగమాంబకు మదనపల్లె దగ్గర శ్రీయోగ భోగేశ్వరాలయంలో రూపవతారం సుబ్రహ్మణ్యశాస్త్రి దగ్గర యోగదీక్షవల్ల శారదదేవి కటాక్షం కలిగింది.
- వెంగమాంబ తరిగొండ నుండి తిరుమలకు కాలినడకన వస్తుండగా తలస కోన ప్రాంతం దగ్గర "సందెకాలపు మొగలి పెంట" అటవీప్రాంతంలో శ్రీ ఆంజనేయస్వామి ఆభయంతో పాటు దర్శనం జరిగింది. అక్కడ వెంగమాంబ ఆంజనేయస్వామి ప్రతిమచిత్రించింది.
- తరిగొండ వెంగమాంబ తిరుమలలో సాహితీరచన చేస్తున్న కాలంలో స్వామివారు బాలుడి రూపంలో వచ్చి వెంగమాంబకు తాళపత్రాలు ఇచ్చి ద్విపదలో భాగవత రచన చేయని ఆదేశించాడు. ఆమె ద్విపద భాగవత రచన చేస్తుండగా స్వామివారు తన కథను తానే స్వయంగా వింటూ ఆనందించారు.
- వెంగమాంబ తిరుమల చేరిన కొత్తలో తుంబురకోనను సందర్శించింది. తిరుమలకు తిరిగి వస్తుండగా దారిలో క్రూరమృగాల నుండి, చోరుల నుండి రామలక్ష్మణులు తనను కాపాడారని తన రచనల్లో వెంగమాంబ చెప్పుకుంది.
- వెంగమాంబ స్వామివారికి ముత్యాలహారతి ప్రారంభించింది. ఒక రోజు తాను స్వయంగా హారతి సమర్పిస్తుండగా వేంకటేశ్వరుడు దశావతారాలతో కూడిన తన విశ్వరూపాన్ని ఈ భక్తురాలికి దర్శనం ఇచ్చారు.
- 1817 సం॥లో ఈశ్వరనామ శ్రావణశుద్ధనవమినాడు ఈ మహాయోగిని, భక్తకవయిత్రి గోవింద నామస్మరణ మధ్య తన 18 గ్రంథాలను స్వామివారిపాదాలకు సమర్పించింది.
- ఈమె అంత్యసమయంలో స్వామివారి సన్నిధికి చేరుకుంది.



## మే నెల క్విజ్-47 సమాధానాలు

| | |
|---|---|
| 01) శ్రద్ధ | 09) ఇంద్రియనిగ్రహం |
| 02) శ్రద్ధ | 10) అభ్యాసం |
| 03) 400 పైగా | 11) నాగలిపూజ |
| 04) బందర్‌పూంచ్ | 12) మంచిబుద్ధి |
| 05) మహామోక్ష | 13) స్థిరంగా |
| 06) గరుత్మంతుని | 14) శరీరము |
| 07) పల్లాండు | 15) విభీషణుడు |
| 08) గురువు | |

### సరైన సమాధానాలు వ్రాసినవారు–

01)మాచిరాజు విష్ణువందన, విజయవాడ 02)వక్కలపద్మ, కర్నూలు 03)సన్నిధి వీరవేంకటసూర్యకార్తికేయ, ఆకివీడు 03) చెరుకుపల్లి శ్రుతి, కర్నూలు 04)మామిళ్లపల్లి వసుధా భార్గవి, ప్రొద్దుటూరు 05)పులికంటి వ్యోమకేశ్, హైదరాబాదు 06)సుంకర మోక్షిత్, తాడికొండ 07)చలపాక హర్షిత, అనకాపల్లి 08)భూమ ముకుంద్ విహాన్, బెంగళూరు 09)కె.సాత్త్విక, కర్నూలు 10)గొల్లాపిన్ని శ్రీగౌతమ్, కురబలకోట 11)బారికి వింధ్యశ్రీ, ఆదోని 12)వెంట్రప్రగడ రూపితా సౌమ్యా, ఉయ్యూరు 13)గొలివి కౌండిన్య క్రిష్ణంనాయుడు, పూడివలస 14)పర్వతం వేంకట భరద్వాజ్, హైదరాబాదు 15)యామర్తి శ్రీనివాస సకృత్, బెంగళూరు 16)బలివాడ సాత్త్విక,రెడ్డిపేట 17)రావిళ్ల నాగమహిక, హైదరాబాదు 18)పి.సాయిప్రజ్వల్, ఖమ్మం 19)డి.సుప్రియ, విజయవాడ 20)డి.రాము, విజయవాడ 21)జె.లక్ష్మణ్‌వీర్, కుప్పం 22)జి.అతులిత్ రెడ్డి, హైదరాబాదు 23)పి.రితేష్, కోనమ్మతోట

# రాయలవారి కావ్యానికి నాంది!

– డా॥ గంగిశెట్టి శివకుమార్,
994418 95343

పచ్చని పంట పొలాలతో కళకళలాడే ప్రాంతం శ్రీకాకుళం. ఇది విజయవాడకు 40 కి.మీ. దూరంలో తూర్పుదిక్కుగా ఉంది. ఆంధ్రులు ఇక్కడ తమకిష్ట దైవమైన మహావిష్ణువుకు దేవాలయం కట్టుకున్నారు.

శ్రీకాకుళంలో ఉన్న స్వామి ఆంధ్రమహావిష్ణువు, ఆంధ్ర నాయకుడు, ఆంధ్ర వల్లభుడు, తెలుగు వల్లభుడు, సిరికా కుళనాథుడు అనే పేర్లతో ప్రసిద్ధికెక్కాడు. అప్పటినుండే 'సర్వపాపహరణం, శ్రీకాకుళాంధ్ర మహా విష్ణుదర్శనం' అనే నానుడి ఏర్పడింది.

ఈ మహావిష్ణువు ఆలయం చరిత్రకు సాక్షిగా అల రారుతోంది. ఇది భద్ర కోష్ఠ విమాన త్రితల గోపురాలతో నిర్మించబడింది. ఉత్తర, దక్షిణాలలో మరి రెండు ఉపాలయా లున్నాయి. ఆలయం తూర్పు ముఖంతో ఉంది. అలయగోడల్లో ప్రాచీనశాసనాలు ఉన్నాయి. ఇది వివిధకాలాలకు చెందినవి.

శ్రీస్వామివారిది పంచలోహవిగ్రహం. ఈ విగ్రహం ఒక కాలంలో అదృశ్యమైపోయింది. ఒకసారి ఒరిస్సాపాలకుడు అంగపాలుడి ప్రధానమంత్రి నరసింహవర్మ కాంచీపురానికి బయలుదేరి, మార్గమధ్యంలోని కృష్ణానదీతీరంలో ఉన్న ఈ ఆలయానికి చేరుకున్నాడు. ఇక్కడి క్షేత్రమాహాత్మ్యం తెలుసు కున్నాడు. ఎలాగైనా అదృశ్యమైన విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించా లనుకున్నాడు. ఆయనకు స్వామి కలలో కనిపించి, " 'అహిఛ్చత్ర పుర' ప్రాంతంలో ప్రవహిస్తున్న 'బ్రహ్మకుండి'నదీ తీరంలోని 'వేమశర్మ' అనే బ్రాహ్మణుని గృహ ఆవరణలో మరుగున ఉన్నా"నని తెలిపాడు.

వెంటనే నరసింహవర్మ ఆ ప్రాంతానికి వెళ్లి, తవ్వకం జరిపి, విగ్రహాన్ని తీసుకువచ్చి, ఆలయంలో తిరిగి పునఃప్రతిష్ఠి చేశాడు. ప్రస్తుత ఆలయ గోపురం చోళరాజైన అనంత దండపాలుడు నిర్మించినట్లుగా శాసనాలున్నాయి.

విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు కళింగ మీదకు దండెత్తడానికి ముందు శ్రీకాకుళాంధ్ర మహా విష్ణువును దర్శించాడు. స్వామివారి నిత్య ధూపదీప నైవేద్యాలకు 5గ్రామాలను ఇచ్చారు. ఆలయప్రాంగణంలో ఆయన ఆ రోజు నిద్రించాడు. స్వప్నంలో శ్రీవిష్ణువు కల్పించి, కావ్యం రచించమని సెలవిచ్చారు. అదే 'ఆముక్తమాల్యద' అనే విశిష్ట కావ్యానికి ప్రేరణ ఇచ్చింది. ఆంధ్రజాతికి ఆచంద్రాతారార్కం నిలిచే ఖ్యాతి నిచ్చింది. రాయలవారు కలగన్న చోటు ఈ రోజు 16 స్తంభాల మంటపంగా కన్పిస్తుంది. రాయలవారివిగ్రహం ఈ ఆలయంలో కనువిందు చేస్తుంది. దీన్ని ఇప్పుడు రాయలవారి మంటపం అంటున్నారు.

శ్రీనారాయణతీర్థులవారు, శ్రీకృష్ణలీలాతరంగిణిలో ఆంధ్రమహావిష్ణువైన స్వామివారి గురించి అనేక రీతుల స్తుతించాడు. శ్రీనాథుడు తన 'క్రీడాభిరామం'లో శ్రీకాకుళక్షేత్ర మహిమను గూర్చి, ఇక్కడ జరిగే తిరునాళ్ల గురించి విశేషంగా వివరించాడు.



చల్లపల్లి జమీందారు ఆస్థానకవి శ్రీకాసుల పురుషోత్తమ కవి. శ్రీకాకుళాంధ్ర దేవ మకుటంతో ఆంధ్రనాయకశతకం రాశాడు. ఆయన విగ్రహాన్ని కూడా ఈ ఆలయంలో చూడవచ్చు. ఎంతో చారిత్రకప్రాశస్త్యం కల ఈ ఆలయం తప్పక దర్శించాల్సినది.

# స్వామికి మిక్కిలి ప్రియుడు

- డా॥ రెడ్డి సుబ్రమణ్యం గాడి,
98499 39637

భక్తియోగము ఇది అమృతపదము
భగవంతుని చేరుకొనుట సులభసాధ్యము ॥

స్వామి స్వీయరూపమందు మనసును లగ్నము చేయుము
దివ్యమును ఘనమును యగు శ్రద్ధతో అర్చన చేయుము
సర్వకర్మలను అతనికి సమర్పింపుము
భక్తియుతసేవ చేసి పరిపూర్ణత సాధించుము ॥

అవ్యక్త నిరాకారబ్రహ్మమును ధ్యానించువారు
ఇంద్రియాల కతీత మగురూపము నర్చింతురు
ప్రగతి సాధించుటకు క్లేశములను పొందుదురు
సత్యదర్శనము పిమ్మట పరమాత్మను చేరుదురు ॥

భగవంతుని చేరుటకు మనసును స్థిరముగ ఉంచుము
వీలుకానిచో భక్తివిధానములు పాటించుము
అదియును అసాధ్యమైన అతనికై కర్మలు చేయుము
ఇదియును కష్టమైన కర్మఫలత్యాగము చేయుము ॥

అన్నింట విఫలమైన జ్ఞానార్జన చేయుము
కానీ జ్ఞానముకన్న ధ్యానము ఉన్నతము
ధ్యానము కన్నా మేలు కర్మఫలత్యాగము
త్యాగముతో కలుగును మనసుకు శాంతిసౌఖ్యము ॥

సర్వజీవుల యెడ సమభావము కలవాడు
తనను యజమానిగా తలచినవాడు
అహంకారము లేని నిత్య సంతుష్టుడు
అటువంటి భక్తుడు స్వామికి మిక్కిలి ప్రియుడు ॥

సుఖదుఃఖాలలో సమచిత్తము కలవాడు
భక్తియుతసేవలో నెలకొన్నవాడు
ఓరిమిగలవాడు దృఢనిశ్చయుడు
అటువంటి భక్తుడు స్వామికి మిక్కిలిప్రియుడు ॥

ఏ ఒక్కరికి కష్టము కలిగించడు
ఎవ్వరిచే గాని కలత చెందడు
పవిత్రుడు, సమర్థుడు, శోకరహితుడు
అటువంటి భక్తుడు స్వామికి మిక్కిలిప్రియుడు ॥



శుభాశుభముల రెంటిని విడచినవాడు
కోరికలు లేనివాడు ఉదాసీనుడు
జ్ఞానంలో సుస్థిరుడు దేవుని సేవకుడు
అటువంటి భక్తుడు స్వామికి మిక్కిలిప్రియుడు ॥

శత్రుమిత్రులను సమముగా చూచువాడు
మానావమానములు లెక్కచేయడు
నిందాస్తుతులలో నిలకడ గలవాడు
అటువంటి భక్తుడు స్వామికి మిక్కిలిప్రియుడు ॥

దుష్టసాంగత్యమునకు సుదూరుడు
నివాసమేదైన పట్టించుకోడు
ఎల్లప్పుడు మౌనముగా ఉండేవాడు
అటువంటి భక్తుడు స్వామికి మిక్కిలిప్రియుడు ॥

108 దివ్యదేశాలు

# తిరుక్కోష్ఠియూర్

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

తిరుక్కోష్ఠియూర్ క్షేత్రం తమిళనాడులోని శివగంగ నుండి 19కిలోమీటర్ల దూరంలో, తూర్పుముఖంగా, 2.92 ఎకరాల విస్తీర్ణంలో రెండు ప్రాకారాలు, ఐదుఅంతస్తుల రాజగోపురంతో ఎంతో అందంగా నిర్మితమైంది. ఈ ఆలయ ఈశాన్యమూలలో "మహామహం"బావి (తీర్థం) ఉంది. ఆలయ ప్రాకారంలో ఆండాళ్ అమ్మవారు, నరసింహస్వామి, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, గోపాలకృష్ణుడు, ఆంజనేయస్వామి, చంద్రుడు మొదలైన దేవతలకు విడివిడిగా ఉపసన్నిధులు (గర్భగుడులు) ఉన్నాయి.

దేవతలందరూ ఒకే చోట గుమికూడి, శ్రీమన్నారాయణుడిని ప్రార్థించి, హిరణ్యకశిపుడి వధ కోసం విన్నవించుకున్న క్షేత్రం కావడం వల్ల- "దేవతలు ఒకచోట కూడిన స్థలం" అనే అర్థంలో దీనికి "గోష్ఠీపురం" (తమిళంలో తిరుక్కోష్ఠియూర్) అని పేరు వచ్చింది.

ఇక్కడి అష్టాంగవిమానం నాలుగు అంతస్తులను (నాలుగు మంటపాలు) కలిగి ఉంటుంది. వాటిలో-

**01)మొదటి అంతస్తు (భూతలం):** క్షీరసాగరంలో భగవంతుడు కొలువై ఉండే విధంగానే, ఇక్కడ స్వామివారు ఆదిశేషుని శయ్యపై మూలమూర్తిగా కొలువై ఉన్నారు. "కదంబమహర్షి" చేసిన తపస్సుకు ప్రసన్నుడై స్వామి ఇక్కడ "ఉరగ మెల్లణైయాన్" (పాన్పుపై పడుకున్న స్వామి) అనే తిరునామంతో తూర్పు ముఖంగా అనుగ్రహిస్తున్నారు. ఇక్కడి ఉత్సవమూర్తిని తిరుమంగై ఆళ్వార్ తన 'పెరియతిరుమొళి'లో మంగళాశాసనం చేశారు. ఈ ఉత్సవమూర్తి శ్రీదేవి, భూదేవి సమేతుడై "సౌమ్య నారాయణన్" అనే తిరునామంతో భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఇక్కడి అమ్మవారు "తిరుమామగళ్ నాచ్చియార్" అనే తిరు నామంతో విడిగా ఉన్న ప్రత్యేక సన్నిధిలో కొలువై ఉన్నారు.

**02)రెండవ అంతస్తు:** ఇక్కడ కూడా స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతుడై ఉపేంద్ర నారాయణుడిగా, నిలుచున్న భంగిమలో (తిరుక్కోలం)"నిన్రనంబి" అనే తిరునామంతో అనుగ్రహిస్తున్నారు.

**03)మూడవ అంతస్తు:** పరమపదంలో భగవంతుడు ఏ విధంగా ఆసీన భంగిమలో వైకుంఠనాథుడిగా విరాజిల్లుతున్నాడో, అదే విధంగా ఇక్కడ ఇద్దరు దేవేరులతో కలిసి స్వామివారు పరవాసుదేవుడిగా దర్శనమిస్తున్నారు.

**04)నాల్గవ అంతస్తు (విమానం పై భాగం):** ఈ నాల్గవ అంతస్తులోనే శ్రీ రామానుజాచార్యుల వారు ఎన్నో రకాల కష్టాలకు ఓర్చి, శ్రీరంగం నుండి తిరుక్కోష్ఠియూర్ వరకు నడచి వచ్చారు. ఇక్కడి తన ఆచార్యులైన "తిరుక్కోష్ఠియూర్ నంబి" వద్ద మంత్రోపదేశం పొందడానికి ప్రయత్నించి, 17 సార్లు

| | | |
|---|---|---|
| భగవానుడు | : | సౌమ్యనారాయణన్ |
| అమ్మవారు | : | తిరుమామగళ్ నాచ్చియార్ |
| స్థల తీర్థం | : | దేవతీర్థం |
| క్షేత్రం | : | తిరుక్కోష్ఠియూర్ |
| విమానం | : | అష్టాంగ విమానం |
| స్థల వృక్షం | : | కదంబవృక్షం |
| ప్రత్యక్షం | : | కదంబమహర్షి, ఇంద్రునకు |
| నది | : | వైగై నది |
| ముఖము/స్థితి | : | తూర్పుముఖం, భుజంగశయనం |
| మంగళాశాసనం | : | పెరియాళ్వార్, తిరుమంగై ఆళ్వార్, పేయాళ్వార్, పూదత్తాళ్వార్, తిరుమళిసై ఆళ్వార్ |
| ఆగమం | : | వైఖానసం |



విఫలమై, చివరికి 18వసారి రహస్యమంత్రాన్ని పొందారు. ఆ విధంగా తాను పొందిన పరమరహస్యమంత్రాన్ని, దాని విశిష్టఅర్థాన్ని లోకోద్ధరణ కోసం ఈ నాల్గవ అంతస్తు గోపురం పైకి ఎక్కి గట్టిగా అరుస్తూ అందరికీ ఉపదేశించారు. అందుకే వారిక్ ఎమ్బెరుమానార్ అనే నామం సార్ధకమైంది.

108 దివ్యదేశాలలో మదురైలోని 'తిరుక్కూడల్' మరియు 'తిరుక్కోష్ఠియూర్' అనే ఈ రెండు దివ్యదేశాలు మాత్రమే అష్టాంగ విమానాన్ని కలిగి ఉండేలా నిర్మించబడ్డాయి.

## తిరుక్కోట్టియూర్ అష్టాంగ విమాన విశిష్టత

ఈ అష్టాంగవిమానంలోని ఉత్తరభాగాన్ని అసురశిల్పి అయిన మయన్ (మయుడు), అలాగే దక్షిణభాగాన్ని దేవశిల్పి విశ్వకర్మ మూడు విభాగాలుగా విభజించి నిర్మించారు. అష్టాక్షరీ మంత్రంలోని మూడు పదాలైన "ప్రణవం (ఓం), నమః, నారాయణాయ" వలే ప్రణవనాదంలోని "అకార, ఉకార, మకార" అనే మూడక్షరాల వలే ఈ విమానం మూడుప్రధాన అంతస్తులు కలిగి విరాజిల్లుతోంది.

నరసింహమూర్తి శిలావిగ్రహాలు దేవశిల్పులచే అత్యంత అద్భుతంగా చెక్కబడ్డాయి. విశ్వకర్మచే చేయబడ్డ నరసింహ



మూర్తి విగ్రహం హిరణ్యకశిపుడిని గట్టిగా పట్టుకున్నట్లుగా ఉండగా, మయుడిచే సృష్టించబడ్డ భగవంతుడి శిలావిగ్రహం హిరణ్యకశిపుడిని తన తొడపై పడుకోబెట్టుకుని సంహరిస్తున్న భంగిమలో ఉంది. ఆ విధంగా దక్షిణదిశగా చూస్తున్న నరసింహ స్వామిని (దక్షిణేశ్వర నరసింహర్) అని, ఉత్తర దిశగా చూస్తున్న స్వామిని (ఉత్తరేశ్వర నరసింహర్) అని ప్రజలు భక్తితో పిలుచుకుంటారు.

## స్థలపురాణం

హిరణ్యకశిపుడు ఎవరి వల్లా తనకు మరణం సంభవించకూడదనే వరాన్ని పొంది, ముల్లోకాలను భయపెడుతూ తన వశం చేసుకున్నాడు. దీని వల్ల బ్రహ్మ, రుద్రులతో సహా సమస్త దేవతలు శ్రీమన్నారాయణుడిని శరణు వేడారు. వారు చెప్పిందంతా విన్న పరమాత్మ– "మీరందరూ ఉమ్మడిగా, ఒక సమూహంగా (గోష్ఠిగా) ఆలోచించి, వ్యూహాత్మకంగా పని చేస్తేనే హిరణ్యకశిపుడి అంతానికి ఒక ముగింపు పలకగలరు" అని సలహా ఇచ్చాడు.

భగవంతుని ఆజ్ఞను పరమకర్తవ్యంగా భావించి, దేవతలందరూ ఒక సమూహంగా (గుంపుగా) కూడి "కదంబ మహర్షి" ఆశ్రమం రాక్షసుల బాధ లేని ఈ ప్రదేశంలో అందరూ ఒకచోట చేరి, ఆ అసురుడి వధ గురించి రహస్యంగా చర్చించడం వల్ల ఈ పుణ్యక్షేత్రానికి "గోష్ఠీపురి" (తిరుక్కోష్ఠియూర్) అనే నామం స్థిరపడింది. దేవతల ప్రార్థనలను ఆలకించిన భగవంతుడు నరసింహమూర్తిగా ఆవిర్భవించి, హిరణ్యకశిపుడిని సంహరించి లోకాలను రక్షించాడు. ఈ తిరుక్కోష్ఠియూర్ దివ్యదేశంలో జరిగే నిత్యతిరువారాధనలు, ఉత్సవాలు, కైంకర్యాలు అన్నీ వైఖానస ఆగమం ప్రకారమే నిర్వహించబడుతున్నాయి. అలాగే భగవద్రామానుజ సంప్రదాయాన్ని అనుసరించి ఉత్సవాలు నిర్వహించబడుతున్నాయి. అలాగే ఇక్కడ జరిగే తెప్పోత్సవం ఒక గొప్ప వైభవాన్ని సంతరించుకుంది.

ఈ సౌమ్యనారాయణస్వామిని దర్శించడం చేత సత్యగుణాభివృద్ధి కలిగి, పుత్రపౌత్రాదులతో ఇహలోకంలో సుఖాన్ని అనుభవించి తదుపరి పరలోకసౌఖ్యాన్ని పొందగలరని అమృతోక్తి.

# శ్రీవరలక్ష్మీ వ్రతపూజావిధానం

**వరలక్ష్మీవ్రతం (21-08-2026) సందర్భంగా 'సప్తగిరి' పాఠకుల కోసం...!!**

(గమనిక: శ్రీవరలక్ష్మీవ్రతాన్ని శ్రావణమాసంలో పున్నమకు ముందువచ్చే శుక్రవారంనాడు (తిథి ఏది వచ్చినాసరే) ఆచరించాలి. ఒకవేళ ఏదైనా ఇబ్బంది వస్తే- శ్రావణమాసంలోని ఏ శుక్రవారమైనా చేయవచ్చు. అప్పుడూ వీలుకాక పోతే దసరాలో వచ్చిన శుక్రవారంనాడైనా ఆచరించవచ్చు. దీపారాధన, సంకల్పం, గణేశపూజ అన్ని వ్రతాల్లోనూ తప్పక చేయాల్సిందే!)

సూచన: సంకల్పంలో ఈ విధంగా చెప్పాలి. "మమ ఉపాత్త సమస్త దురితక్షయద్వారా శ్రీపరమేశ్వరప్రీత్యర్థం, శుభే శోభనే ముహూర్తే (సంవత్సరం- మొదలైనవన్నీ చెప్పాలి) ...... అస్మాకం సహకుటుంబానాం క్షేమస్థైర్య విజయ ఆయురారోగ్య ఐశ్వర్య అభివృద్ధ్యర్థం, ధర్మార్థ కామమోక్ష చతుర్విధపురుషార్థఫలసిద్ధ్యర్థం, సత్ సంతాన సౌభాగ్య శుభఫలప్రాప్త్యర్థం వర్షే వర్షే ప్రయుక్తాం, ఏతద్వర్షే శ్రీవరలక్ష్మీ దేవతాం ఉద్దిశ్య, శ్రీవరలక్ష్మీదేవతాప్రీత్యర్థం, భవిష్యోత్తర పురాణ కల్పోక్తప్రకారేణ యావచ్ఛక్తి ధ్యాన ఆవాహనాది షోడశ ఉపచారపూజాం కరిష్యే" (అని చెప్పి, శ్రీవరలక్ష్మీపటంపై, కలశంపై, పూలు, అక్షతలు వేసి, నమస్కరించాలి) (తర్వాత కలశపూజ, గణపతిపూజ చేయాలి.)

## శ్రీవరలక్ష్మీ దేవీధ్యానం

ఓంపద్మాసనే పద్మకరే సర్వలోకైకపూజితే
నారాయణప్రియే దేవి! సుప్రీతా భవ సర్వదా॥
ఓం క్షీరోదార్ణవసంభూతే! కమలే కమలాలయే!
సుస్థిరా భవ మే గేహే సురాసురనమస్కృతే!
ఓం శ్రీవరలక్ష్మీదేవతాం ధ్యాయామి

*(అని చెప్పి, పూలు, అక్షతలు- అమ్మవారికలశం, పటంవద్ద ఉంచి, నమస్కరించాలి)*

## ఆవాహనం

ఓం దేవి! త్రైలోక్యజనని! సర్వలోకైకపావని।
ఆగచ్ఛ వరదే! మాతః ప్రసీద పరమాత్మికే!
ఓం శ్రీవరలక్ష్మీదేవతాం ఆవాహయామి

*(అని చెప్పి, పూలు, అక్షతలు లక్ష్మీపటంపై, కలశంపై వేసి, నమస్కరించాలి)*

## ఆసనం

ఓం స్వర్ణరత్నమయం దివ్యం హేమవర్ణం సుశోభితమ్।
ఆసనం తే ప్రదాస్యామి స్వీకురుష్వ హరిప్రియే!
ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః రత్నసింహాసనం సమర్పయామి

*(అని చెప్పి, అమ్మవారికలశం వద్ద, పటంవద్ద పూలు, అక్షతలు ఉంచి, నమస్కరించాలి.)*

## పాద్యం

ఓం గంగాదిసలిలైర్యుక్తం సుగంధేన సువాసితమ్।
పాద్యం గృహాణ శ్రీదేవి! సర్వదేవ నమస్కృతే॥
ఓం శ్రీవరలక్ష్మీదేవతాయైనమః పాదయోః పాద్యం సమర్పయామి

*(అని చెప్పి, కలశంలోని నీళ్లు రెండుమార్లు ఉద్ధరణితో తీసుకుని, అమ్మవారి కలశంవద్ద పాదాలున్నట్లు భావించి, తాకించి, ఆ నీళ్లు అర్ఘ్యపాత్రలో వేయాలి.)*






శ్లో॥ లక్ష్మీం క్షీరసముద్రరాజతనయాం, శ్రీరంగధామేశ్వరీం, దాసీభూతసమస్తదేవ వనితాం లోకైకదీపాంకురాం।
శ్రీమన్మంద కటాక్షలబ్ధవిభవత్ బ్రహ్మేంద్రగంగాధరాం, త్వాం త్రైలోక్యకుటుంబినీం సరసిజాం వందే ముకుందప్రియామ్॥

భావం: అమ్మా! లక్ష్మీదేవి!! పాలసముద్రపురాజు కూతురువై, శ్రీరంగధామానికి రాణివై, సమస్త దేవతాస్త్రీలచే సేవలు పొందుతూ, లోకాలన్నింటినీ ప్రకాశింపజేసే జ్ఞానదీపజ్యోతివి నీవు. బ్రహ్మ, ఇంద్రుడు, శివుడు మొదలైనవారు కూడా శ్రీమంతురాలగు నీ చల్లని చూపులచే వైభవాన్ని పొందారు. ముల్లోకాలు నీ కుటుంబమే. పద్మంలో పుట్టిన, విష్ణువుకు ఇష్టసఖివైన ఓ లక్ష్మీదేవీ! నీకు నమస్కరిస్తున్నాను.

## అర్ఘ్యం

ఓం శుద్ధోదకం చ పాత్రస్థం గంధపుష్పాదిమిశ్రితమ్।
అర్ఘ్యం దాస్యామి తే దేవి! గృహాణ సురపూజితే॥
ఓం శ్రీవరలక్ష్మీ దేవతాయై నమః హస్తయోః అర్ఘ్యం సమర్పయామి
(అని చెప్పి, కలశంలోని నీటిని రెండుమార్లుగా ఉద్ధరణితో తీసుకొని, అమ్మవారిచేతులకు తాకించి, ఆ నీటిని అర్ఘ్యపాత్రలో సమర్పించాలి)

## ఆచమనీయం

ఓం సువర్ణకలశానీతం, చందనాగరుసంయుతమ్ ।
గృహాణాచమనం దేవి! మయా దత్తం శుభప్రదే॥
ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః ముఖే ఆచమనీయం సమర్పయామి
(అని చెప్పి, మూడుమార్లుగా ఉద్ధరణితో కలశంలోని నీళ్లు తీసుకొని, అమ్మవారిముఖానికి తాకించి, అర్ఘ్యపాత్రలో సమర్పించాలి)

## పంచామృతస్నానం

(పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చక్కెర కలిసిన ద్రవ్యం)

ఓం పయోదధిఘృతోపేతం శర్కరామధుసంయుతమ్!
పంచామృతస్నాన మిదం, గృహాణ కమలాలయే!
ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః పంచామృతస్నానం సమర్పయామి
(అని చెప్పి, పంచామృతాన్ని పువ్వుతో అద్ది, ఐదుమార్లు కొద్దికొద్దిగా అమ్మవారికలశంపైన, పటంపైన చల్లాలి)

## శుద్ధోదకస్నానం

ఓం గంగాజలం మయానీతం మహాదేవశిరఃస్థితమ్!
సుగంధిద్రవ్యసంయుక్తం జలం స్నానాయ గృహ్యతామ్॥
ఓం శ్రీవరలక్ష్మీదేవతాయైనమః సుగంధిద్రవ్యసంయుక్త శుద్ధోదక స్నానం సమర్పయామి
(అని చెప్పి, కలశంలోని నీళ్లు ఉద్ధరణితో తీసుకొని, ఆ నీటిని పువ్వుతో అద్ది, కలశంపై, పటంపై చల్లాలి.) "స్నానానంతరం ఆచమనీయం సమర్పయామి" (అని చెప్పి, కలశంలోని నీళ్లు ఉద్ధరిణితో అమ్మవారిముఖానికి చూపించి, అర్ఘ్యపాత్రలో వేయాలి)

## వస్త్రం

ఓం సురార్చితాంఘ్రియుగళే దుకూలవసనప్రియే
వస్త్రయుగ్మం ప్రదాస్యామి గృహాణ హరివల్లభే! ॥
ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః వస్త్రయుగ్మం సమర్పయామి
(అని చెప్పి, రెండు ప్రత్తివస్త్రాలు అమ్మవారికలశానికీ, అట్లే అమ్మవారిపటానికీ ధరింపజేయాలి)

## ఆభరణాలు

ఓం కేయూరకంకణే దివ్యే హారనూపురమేఖలాః
విభూషణాని అమూల్యాని గృహాణ ఋషిపూజితే! ॥
ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః ఆభరణాని సమర్పయామి
(ముందే ఆభరణాలు అమ్మవారికి పెట్టి ఉంటాం కనుక పూలు, అక్షతలు తీసుకొని, కలశంపై, పటంపై ఉంచి నమస్కరించాలి)

## యజ్ఞోపవీతం(జందెం)

ఓం తప్తహేమకృతం దేవి! ముక్తాదామసమన్వితమ్ ।
ఉపవీతం మయా దత్తం గృహాణ త్వం శుభప్రదే ॥
ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః యజ్ఞోపవీతం సమర్పయామి
(అని చెప్పి, ప్రత్తితో చేసిన జందేన్ని అమ్మవారికి సమర్పించాలి)

## గంధం

ఓం కర్పూరాగరుకస్తూరీరోచనాదిభిరన్వితమ్।
గంధం దాస్యా మ్యహం దేవి! ప్రీత్యర్థం ప్రతిగృహ్యతామ్॥
ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః దివ్యపరిమళగంధాన్ ధారయామి
(అని చెప్పి, గంధం పువ్వుతో అద్దుకొని, కలశంమీద, పటంపైన చల్లాలి)

## హరిద్రాచూర్ణం(పసుపు) కుంకుమ, అక్షతలు

ఓం అక్షతాన్ ధవళాన్ దేవి! శాలీయాం స్తండులాన్ శుభాన్।
హరిద్రాకుంకుమోపేతాన్ గృహ్యతాం అబ్ధిపుత్రికే॥
ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః అక్షతాన్, హరిద్రాచూర్ణం, కుంకుమం సమర్పయామి
(అని చెప్పి, అక్షతలు, పసుపు, కుంకుమ అమ్మవారికి సమర్పించాలి)

## పుష్పసమర్పణం

ఓం మల్లికాజాతికుసుమైః చంపకైర్ వకుళైరపి
శతపత్రైశ్చ కల్హారైః పూజయామి హరిప్రియే!
ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః నానావిధపరిమళపత్రపుష్పాణి సమర్పయామి
(అని చెప్పి, పూలు కలశంపై, పటంపై సమర్పించి, నమస్కరించాలి)

## శ్రీ వరలక్ష్మీదేవికి అంగపూజ నిర్వహించాలి

(అమ్మవారిని పాదాలనుంచీ, శిరస్సువరకూ పూలతో పూజించాలి)

| | | | |
|---|---|---|---|
| ఓం శ్రీచంచలాయై | నమః | పాదౌ పూజయామి | (పాదాలకు) |
| ఓం శ్రీచపలాయై | నమః | జానునీ పూజయామి | (మోకాళ్లకు) |
| ఓం శ్రీపీతాంబరాయై | నమః | ఊరూ పూజయామి | (తొడలకు) |
| ఓం శ్రీకమలవాసిన్యై | నమః | కటిం పూజయామి | (నడుము) |
| ఓం శ్రీపద్మాలయాయై | నమః | నాభిం పూజయామి | (బొడ్డు) |
| ఓం శ్రీమదనమాత్రే | నమః | స్తనౌ పూజయామి | (స్తనాలు) |
| ఓం శ్రీలలితాయై | నమః | భుజద్వయం పూజయామి | (భుజాలు) |
| ఓం శ్రీకంబుకంఠ్యై | నమః | కంఠం పూజయామి | (మెడ) |
| ఓం శ్రీసుముఖాయై | నమః | ముఖం పూజయామి | (ముఖం) |
| ఓం శ్రీశ్రియై | నమః | ఓష్ఠౌ పూజయామి | (పెదవులు) |
| ఓం శ్రీసునాసికాయై | నమః | నాసికాం పూజయామి | (ముక్కు) |
| ఓం శ్రీసునేత్ర్యై | నమః | నేత్రే పూజయామి | (కన్నులు) |
| ఓం శ్రీరమాయై | నమః | కర్ణౌ పూజయామి | (చెవులు) |
| ఓం శ్రీకమలాయై | నమః | శిరః పూజయామి | (తల) |
| ఓం శ్రీవరలక్ష్మీదేవ్యై | నమః | సర్వాణి అంగాని పూజయామి. | |

(తర్వాత శ్రీలక్ష్మీ అష్టోత్తరశతనామావళితో (కుంకుమతో కానీ, పూలతో గానీ) పూజించాలి)

# శ్రీ లక్ష్మీ అష్టోత్తరశతనామావళి



ఓం ప్రకృత్యై నమః
ఓం వికృత్యై నమః
ఓం విద్యాయై నమః
ఓం సర్వభూతహితప్రదాయై నమః
ఓం శ్రద్ధాయై నమః
ఓం విభూత్యై నమః
ఓం సురభ్యై నమః
ఓం పరమాత్మికాయై నమః
ఓం వాచే నమః
ఓం పద్మాలయాయై నమః 10

ఓం పద్మాయై నమః
ఓం శుచయే నమః
ఓం స్వాహాయై నమః
ఓం స్వధాయై నమః
ఓం సుధాయై నమః
ఓం ధన్యాయై నమః
ఓం హిరణ్మయ్యై నమః
ఓం లక్ష్మ్యై నమః
ఓం నిత్యపుష్టాయై నమః
ఓం విభావర్యై నమః 20

ఓం అదిత్యై నమః
ఓం దిత్యై నమః
ఓం దీప్తాయై నమః
ఓం వసుధాయై నమః
ఓం వసుధారిణ్యై నమః
ఓం కమలాయై నమః
ఓం కాంతాయై నమః
ఓం కామాక్ష్యై నమః
ఓం క్రోధసంభవాయై నమః
ఓం అనుగ్రహపరాయై నమః 30

ఓం బుద్ధయే నమః
ఓం అనఘాయై నమః
ఓం హరివల్లభాయై నమః
ఓం అశోకాయై నమః
ఓం అమృతాయై నమః
ఓం దీప్తాయై నమః
ఓం లోకశోకవినాశిన్యై నమః
ఓం ధర్మనిలయాయై నమః
ఓం కరుణాయై నమః
ఓం లోకమాత్రే నమః 40

ఓం పద్మప్రియాయై నమః
ఓం పద్మహస్తాయై నమః
ఓం పద్మాక్ష్యై నమః
ఓం పద్మసుందర్యై నమః
ఓం పద్మోద్భవాయై నమః
ఓం పద్మముఖ్యై నమః
ఓం పద్మనాభప్రియాయై నమః
ఓం రమాయై నమః
ఓం పద్మమాలాధరాయై నమః
ఓం దేవ్యై నమః 50

ఓం పద్మిన్యై నమః
ఓం పద్మగంధిన్యై నమః
ఓం పుణ్యగంధాయై నమః
ఓం సుప్రసన్నాయై నమః
ఓం ప్రసాదాభిముఖ్యై నమః
ఓం ప్రభాయై నమః
ఓం చంద్రవదనాయై నమః
ఓం చంద్రాయై నమః
ఓం చంద్రసహోదర్యై నమః
ఓం చతుర్భుజాయై నమః 60

ఓం చంద్రరూపాయై నమః
ఓం ఇందిరాయై నమః
ఓం ఇందుశీతలాయై నమః
ఓం ఆహ్లోదజనన్యై నమః
ఓం పుష్ట్యై నమః
ఓం శివాయై నమః
ఓం శివకర్యై నమః
ఓం సత్యై నమః
ఓం విమలాయై నమః
ఓం విశ్వజనన్యై నమః 70

ఓం తుష్ట్యై నమః
ఓం దారిద్ర్యనాశిన్యై నమః
ఓం ప్రీతిపుష్కరిణ్యై నమః
ఓం శాంతాయై నమః
ఓం శుక్లమాల్యాంబరాయై నమః
ఓం శ్రియై నమః
ఓం భాస్కర్యై నమః
ఓం బిల్వనిలయాయై నమః
ఓం వరారోహాయై నమః
ఓం యశస్విన్యై నమః 80

ఓం వసుంధరాయై నమః
ఓం ఉదారాంగాయై నమః
ఓం హరిణ్యై నమః
ఓం హేమమాలిన్యై నమః
ఓం ధనధాన్యకర్యై నమః
ఓం సిద్ధయే నమః
ఓం స్త్రైణసౌమ్యాయై నమః
ఓం శుభప్రదాయై నమః
ఓం నృపవేశ్మగతానందాయై నమః
ఓం వరలక్ష్మ్యై నమః 90

ఓం వసుప్రదాయై నమః
ఓం శుభాయై నమః
ఓం హిరణ్యప్రాకారాయై నమః
ఓం సముద్రతనయాయై నమః
ఓం జయాయై నమః
ఓం మంగళాదేవ్యై నమః
ఓం విష్ణువక్షఃస్థలస్థితాయై నమః
ఓం విష్ణుపత్న్యై నమః
ఓం ప్రసన్నాక్ష్యై నమః
ఓం నారాయణసమాశ్రితాయై నమః 100

ఓం దారిద్ర్యధ్వంసిన్యై నమః
ఓం దేవ్యై నమః
ఓం సర్వోపద్రవవారిణ్యై నమః
ఓం నవదుర్గాయై నమః
ఓం మహాకాళ్యై నమః
ఓం బ్రహ్మవిష్ణుశివాత్మికాయై నమః
ఓం త్రికాలజ్ఞానసంపన్నాయై నమః
ఓం భువనేశ్వర్యై నమః 108
ఓం శ్రీవరమహాలక్ష్మీదేవ్యై నమః

అష్టోత్తరశతనామపూజాం సమర్పయామి

## ధూపం

ఓం దశాంగం గుగ్గులూపేతం సుగంధం చ మనోహరమ్!
ధూపం దాస్యామి దేవేశి! కృపయా పరిగృహ్యతామ్॥

ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః దివ్యపరిమళధూపం ఆఘ్రాపయామి

*(అని చెప్పి, గంట వాయిస్తూ అమ్మవారికి ధూపం మూడుమార్లు త్రిప్పాలి)*

## దీపం

*(నేతిలో తడిపిన మూడువత్తులు వెల్గించాలి)*

ఓం ఘృతాక్తవర్తిసంయుక్తం అంధకారవినాశకమ్ ।
దీపం దాస్యామి తే దేవి! గృహాణ ముదితా భవ॥

ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః దీపం దర్శయామి

*(అని చెప్పి, గంటవాయిస్తూ - దీపాన్ని అమ్మవారిపాదాలనుంచీ, శిరస్సువరకూ మూడుమార్లు చూపించాలి)*

"ధూపదీపానంతరం ఆచమనీయం సమర్పయామి"

*(అని చెప్పి, కలశంలోని నీళ్లు ఉద్ధరణితో ఒకమారు తీసుకొని, అమ్మవారిముఖానికి చూపించి, అర్ఘ్యపాత్రలో వేయాలి)*

నైవేద్యం (నైవేద్యానికి టెంకాయలు, పండ్లు, బెల్లం పొంగలి, పులిహోర, తీపి పదార్థాలు మొదలైనవి ఉండాలి. నైవేద్యపదార్థాల్లో వెల్లుల్లి, ఉల్లి పాయలు, మసాలా దినుసులు ఉపయోగించరాదు)

గమనిక: నైవేద్యపదార్థాలపై కలశంలోని నీళ్లు పువ్వుతో లేదా తులసీపత్రంతో చల్లాలి.

## నైవేద్యమంత్రం

ఓం నైవేద్యం షడ్రసోపేతం దధి మధు ఆజ్యసంయుతమ్।
నానాభక్ష్యఫలోపేతం గృహాణ హరివల్లభే!

ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః "నారికేళఫలఖండద్వయ, నానావిధఫల, భక్ష్యసహితమహానైవేద్యం సమర్పయామి"

*(అని చెప్పి, కుడిచేతిలో ఒక పువ్వుపట్టుకుని)* "ఓం ప్రాణాత్మనే నమః, ఓం అపానాత్మనే నమః, ఓం వ్యానాత్మనే నమః, ఓం ఉదానాత్మనే నమః, ఓం సమానాత్మనే నమః" *(అని చెప్పి, ఐదుమార్లు కలశంలోని నీళ్లు ఉద్ధరణితో తీసుకొని, అమ్మవారికి చూపించి, అర్ఘ్యపాత్రలో వేయాలి)*

*తర్వాత "మధ్యే మధ్యే పానీయం సమర్పయామి" (అనిచెప్పి, మూడు మార్లు అమ్మవారికి ఉద్ధరణితో నీళ్లు చూపించి, అర్ఘ్యపాత్రలో వేయాలి. పిదప) "హస్తౌప్రక్షాళయామి, పాదౌప్రక్షాళయామి" శుద్ధాచమనీయం సమర్పయామి అని 5 మార్లు ఉద్ధరణితో నీళ్లు చూపించి, అర్ఘ్యపాత్రలో వేయాలి.*

## తాంబూలం

*(మూడు ఆకులు, రెండువక్కలు లేదా రెండుఆకులు, మూడువక్కలుగానీ తాంబూలంలో ఉంచాలి. యథాశక్తిగా దక్షిణ కూడా ఉంచాలి. వక్కపొడి పొట్లాలూ, చినిగినవీ, తొడిమలు- కొనలు లేనివీ ఐన తమలపాకులూ పెట్టరాదు. మంచిఆకులూ, బిళ్లవక్కలే పెట్టాలి.)*

ఓం పూగీఫలసమాయుక్తం నాగవల్లీదళైర్యుతమ్।
కర్పూరచూర్ణసంయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతామ్॥

ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః సదక్షిణతాంబూలం సమర్పయామి

*(అని చెప్పి, ఉద్ధరణితో నీళ్లు తాంబూలానికి తాకించి, అమ్మవారినోటికి చూపించి, పిదప ఆ నీటిని అర్ఘ్యపాత్రలో వేయాలి)*

## కర్పూరనీరాజనం

ఓం నీరాజనం సమానీతం కర్పూరేణసమన్వితమ్।
తుభ్యం దాస్యామి అహం దేవి! గృహ్యతాం విష్ణువల్లభే!

ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః కర్పూరనీరాజనం దర్శయామి

*(అని చెప్పి, అమ్మవారిపాదాలనుండి శిరస్సువరకూ - మూడుమార్లు నిదానంగా కర్పూరం వెలిగించిన హారతి పళ్లెం త్రిప్పాలి. ఈకాంతిలో భక్తులు అమ్మవారిని దర్శించాలి.)*

"నీరాజనానంతరం ఆచమనీయం సమర్పయామి"

*(అని చెప్పి, ఉద్ధరణినీళ్లు అమ్మవారికి చూపించి, అర్ఘ్యపాత్రలో వేయాలి.)*

## మంత్రపుష్పం

*(చేతిలో పూలూ, అక్షతలు ఉంచుకోవాలి)*

ఓం పద్మాసనే! పద్మకరే! సర్వలోకైకపూజితే!
నారాయణప్రియే దేవి! సుప్రీతా భవ సర్వదా॥

ఓం శ్రీవరలక్ష్మి దేవతాయై నమః మంత్రపుష్పం సమర్పయామి

*(అని చెప్పి, చేతిలోని అక్షతలూ, పూలూ అమ్మవారి కలశంవద్ద ఉంచి, నమస్కరించాలి)*

## ప్రదక్షిణం

*(పూలు, అక్షతలు పట్టుకొని, నమస్కారం చేస్తూ అమ్మవారికి వీపు చూపకుండా- ప్రక్కన ఉండి, మూడుమార్లు ప్రదక్షిణం చేయాలి. తర్వాత అమ్మవారికి ఎదురుగా నిల్చుండి, పూలు, అక్షతలు అమ్మవారి కలశంవద్ద ఉంచి, నమస్కరించాలి.)*

యాని కాని చ పాపాని జన్మాంతరకృతాని చ
తాని తాని ప్రణశ్యంతి ప్రదక్షిణపదే పదే॥

అన్యథాశరణం నాస్తి త్వమేవశరణం మమ ।
తస్మాత్ కారుణ్యభావేన రక్ష రక్ష హరిప్రియే!

ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః ఆత్మప్రదక్షిణాని సమర్పయామి.

## నమస్కారాలు

*(అమ్మవారికి మూడుమార్లు నమస్కరించాలి.)*

ఓం నమ స్త్రైలోక్యజనని! నమస్తే విష్ణువల్లభే
త్రాహి మాం భక్తవరదే! వరలక్ష్మి! నమోఽస్తుతే॥

ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమస్కారాన్ సమర్పయామి

*(తర్వాత చేతికి కట్టుకునే తోరాలకు పూజ (అమ్మవారివ్రతంలో అమ్మవారికికట్టే తోరానికీ, వ్రతం చేస్తున్న స్త్రీలు కట్టుకోవడానికికూడా - తొమ్మిది నూలు పోగులు కల్గిన తెల్లదారం చేసి, దానికి పసుపు పూసి, తొమ్మిది చోట్ల- మధ్యలో కాస్త తావుండేటట్టుగా తమలపాకు, లేదా పువ్వు మడిచిపెట్టి, ముడులు వేయాలి. ఇలా మొత్తం ఒక్కో తోరానికీ తొమ్మిదిముడులు స్పష్టంగా తెలిసేట్టుగా కట్టాలి. ఈ తోరాల్ని ఒక తాంబూలంలో పెట్టి, అమ్మవారికి కుడి వైపున) (అంటే కలశానికి కుడివైపున ఒక పళ్లెంలో ఉంచి, ముడులపై పసుపు కుంకుమ పెట్టి, ఈ క్రిందినామాలతో పూజించాలి.)*

ఓం శ్రీకమలాయై నమః ప్రథమగ్రంథిం పూజయామి (1వ ముడిపై)
ఓం శ్రీరమాయై నమః ద్వితీయగ్రంథిం పూజయామి (2వ ముడిపై)
ఓం శ్రీలోకమాత్రే నమః తృతీయగ్రంథిం పూజయామి (3వ ముడిపై)
ఓం శ్రీవిశ్వజనన్యై నమః చతుర్థగ్రంథిం పూజయామి (4వ ముడిపై)
ఓం శ్రీమహాలక్ష్మ్యై నమః పంచమగ్రంథిం పూజయామి(5వ ముడిపై)
ఓం శ్రీక్షీరాబ్ధితనయాయై నమః షష్ఠగ్రంథిం పూజయామి (6వ ముడిపై)
ఓం శ్రీవిశ్వసాక్షిణ్యై నమః సప్తమగ్రంథిం పూజయామి (7వ ముడిపై)
ఓం శ్రీచంద్రసహోదర్యై నమః అష్టమగ్రంథిం పూజయామి (8వ ముడిపై)
ఓం శ్రీహరివల్లభాయై నమః నవమగ్రంథింపూజయామి (9వ ముడిపై)
ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః నవగ్రంథియుక్తథోరపూజాం సమర్పయామి

*(అని చెప్పి, తోరాలపై పసుపు, కుంకుమ పెట్టి, పూలు ఉంచి, నమస్కరించాలి. ఈక్రిందిమంత్రం చెప్తూ- మొదట అమ్మవారి కుడిచేతికి కట్టి, అమ్మవారికి పసుపుకుంకుమలు పెట్టి, నమస్కరించాలి)*

ఓం బధ్నామి దక్షిణే హస్తే నవసూత్రం శుభప్రదమ్।
పుత్రపౌత్రాభివృద్ధిం చ సౌభాగ్యం దేహి మే రమే!
ఓం శ్రీవరలక్ష్మీదేవతాయై నమః
శ్రీవరలక్ష్మీవ్రతాంగ నవగ్రంథిథోరం సమర్పయామి

*(అని చెప్పి, అమ్మవారికుడిచేతికి తోరం కట్టాలి.)*

*(తర్వాత) వరలక్ష్మీవ్రతం చేస్తున్న స్త్రీలు ఇదే మంత్రం చెప్తూ - కుడిచేతిలో టెంకాయకానీ, పండు కానీ పట్టుకొని, మరొక ముత్తైదువతో తోరాన్ని కుడిచేతికి కట్టించుకోవాలి. మంత్రం "బధ్నామి........ రమే" అనేదే! తోరం కట్టుకొన్న తర్వాత అమ్మవారికి పసుపు, కుంకుమ పెట్టి నమస్కరించాలి.*

*గమనిక: ఇలా తోరాలు కట్టుకొన్నాక పురోహితునికి వాయనం (కానుక) ఇవ్వాలి. వాయనంలో తాంబూలం, దక్షిణ, చేసిన తీపి వంటకాలు 12 పెట్టి, 12 పండ్లుపెట్టాలి. - ఈ క్రిందిమంత్రాన్ని వాయనం ఇస్తున్న దంపతులతో చెప్పించాలి, పురోహితుడూ చెప్పాలి.)*

ఓం ఇందిరా ప్రతిగృహ్ణాతు ఇందిరా వై దదాతి చ
ఇందిరా తారికోభయోః ఇందిరాయై నమో నమః॥

*(అని చెప్తూ, వాయనాన్ని దంపతులూ, పురోహితుడూ ఇరువురూ పట్టుకోవాలి. (దంపతులు ఇవ్వాలి. పురోహితుడు స్వీకరించాలి.) ఇలా స్వీకరించిన తర్వాత పురోహితుడు వాయనం ఇచ్చిన దంపతులను ఇలా ఆశీర్వదించాలి.)*

శ్రీవరలక్ష్మీకృపాకటాక్షేణ అనయోః దంపత్యోః దీర్ఘ సౌమంగల్య ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధిరస్తు। సతతం శ్రీరస్తు। వంశాభివృద్ధిరస్తు

*అని (తర్వాత పూజచేసిన దంపతులచేతికి, పూలు, అక్షతలు ఇచ్చి, ఈ క్రింది శ్లోకం చెప్తూ, ఆ పూలూ, అక్షతలూ, ఉన్నకుడిచేతిలోనికి మూడు ఉద్ధరణులు నీళ్లువేసుకొని అమ్మవారిముందు వదలిపెట్టాలి.)*

మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం హరిప్రియే!
యత్పూజితం మయా దేవి! పరిపూర్ణం తదస్తు తే ॥

"ఏతత్ పూజాఫలం సర్వం శ్రీవరలక్ష్మీదేవతా అర్పణమస్తు"

"అనయా కల్పోక్తప్రకారేణ కృతయా షోడశోపచారపూజయా భగవతీ సర్వాత్మికా శ్రీవరలక్ష్మీదేవతా సుప్రీతా, సుప్రసన్నా వరదా భవతు। మమ ఇష్టకామ్యార్థసిద్ధిరస్తు"



*(అని అక్షతలు, నీళ్లు అమ్మవారికలశం ముందు పళ్లెంలో వదలి, దంపతులు నమస్కరించాలి. తర్వాత వరలక్ష్మీవ్రతకథ చదవాలి. కథ చెప్పే ముందు అందరికీ పూలు, అక్షతలు ఇచ్చి, కథ పూర్తి అయ్యేవరకూ అట్లే ఉంచుకొని, భక్తితో కథ వినాలని చెప్పాలి.)*

## శ్రీవరలక్ష్మీవ్రతకథ

ఓం సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణి।
విద్యారంభం కరిష్యామి సిద్ధి ర్భవతు మే సదా॥

ఓం గురుర్ బ్రహ్మా, గురుర్ విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః
గురు స్సాక్షాత్ పరబ్రహ్మా, తస్మై శ్రీగురవే నమః॥

(ఈ వరలక్ష్మీవ్రతకథను శివుడు పార్వతికి చెప్పాడు.)

## భక్తులారా! వినండి!!

ఒకప్పుడు కైలాసపర్వతంపై పరమశివుడు, పార్వతి రత్న సింహాసనంపై కూర్చొని ఉన్నారు. ఎందరో మహర్షులు అక్కడ చేరి ఉన్నారు. శివుడు లోకాలకు శుభాన్ని కల్గించేవాడు కనుక- పార్వతి శివుణ్ణి చూచి, "నాథా! సకలలోకనాథుడవై, అన్నిజీవులందూ దయగల స్వామీ! రహస్యమైన ఒక శుభవ్రతాన్ని నాకు చెప్పండి" అని మనందరి మేలు కోరిందై అడిగింది. అప్పుడు శివుడు "పార్వతీ! నీ ఆశయాన్ని గుర్తించాను. అన్ని వ్రతాల్లోనూ ఉత్తమమైన వ్రతం 'శ్రీవరలక్ష్మీవ్రతం'. దీన్ని ఆచరిస్తే అన్నిసంపదలూ కల్గుతాయి. శీఘ్రంగా మంచిసంతాన ఫలం సిద్ధిస్తుంది.

ఈ పవిత్రమైనవ్రతాన్ని శ్రావణమాసంలో పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారంనాడు ఆచరించాలి. "పార్వతీ! ఈవ్రతం చేసిన స్త్రీకి గొప్పపుణ్యం కల్గుతుంది" - అని చెప్పాడు. వెంటనే పార్వతి "నాథా! ఈవ్రతాన్ని ఏవిధితో చేయాలి? ఈవ్రతంలో ఏ దేవతను సేవించాలి? ఈ వరలక్ష్మీదేవిని ఇంతకు ముందు ఎవరు ఆరాధించారు? ఆ తల్లి కృపకు ఎవరు పాత్రులయ్యారు?" అని అడిగింది.

అప్పుడు శివుడు "పార్వతీ! పరమపవిత్రమైన వరలక్ష్మీవ్రత ప్రభావం చెప్తాను విను. సకలసంపదలకు నిలయమైన "కుండినము" అనే పేరుగల ఒక పట్టణం ఉంది. ఆ పట్టణంలో 'చారుమతి' అనే ఒక బ్రాహ్మణస్త్రీ ఉండేది. ఆమె పతివ్రత, భర్తసేవ, అత్తమామల సేవలు చేస్తుంది. అన్ని పనులూ సొంతంగా చేసుకొంటుంది. మంచి విద్యావతి, ఎప్పుడూ చిరునవ్వుతో ఇంపుగా మాట్లాడుతుంది. మంచి మనస్సు, భావాలూ కలది.

ఆ చారుమతీదేవికి ఒకనాడు కలలో లక్ష్మీదేవి ప్రత్యక్షమై "ఓ సౌభాగ్యవతీ! ఇటు రమ్ము. నీకు మేలు జరుగుతుంది. శ్రావణ మాసంలో పున్నమికి ముందువచ్చే శుక్రవారంనాడు. నన్ను పూజించు. నీకు కోరినవరాలు ఇస్తాను" అని అనుగ్రహించింది. వెంటనే చారుమతి ఎంతో సంతోషంతో "అమ్మా! జగన్మాతా! నీవు పుణ్యస్వరూపిణివి. శరణు కోరినవారిని కాపాడేదానివి. మూడు లోకాల్లో అందరిచేత పూజ లందుకొనే దానివి. విష్ణుదేవుని వక్షఃస్థలంపై ఉండే దానివి. నీవు ఎవరిని దయతో చూస్తావో అతడే పుణ్యాత్ముడు.. అతడే ధనవంతుడు. అతడే గుణవంతుడు. అమ్మా! ఎన్నో జన్మల్లో, ఎంతో పుణ్యం చేసి ఉంటేనే నీపాదపద్మాల దర్శనం లభిస్తుంది" అని లక్ష్మి దేవిని స్తోత్రం చేసింది. లక్ష్మీదేవి సంతోషించి, చారుమతికి అనేక వరాలు ఇచ్చి, దీవించి వెళ్లింది..

చారుమతి కల వచ్చిన తర్వాత పరుండి, తెల్లవారగానే తన కల సంగతిని బంధువులందరికీ తెల్పింది. అందరూ "చారుమతీ! నీ కల చాలా బాగుంది. మంచిది. అందరం ఆ తల్లి చెప్పినట్లే వ్రతాన్ని ఆచరిస్తాం" అని నిర్ణయించుకొని, "శ్రావణపున్నమ" ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ వచ్చారు. వారి అదృష్టం కొద్దీ వరలక్ష్మీవ్రతం రోజు రానేవచ్చింది. స్త్రీలందరూ నిర్మలమైన మనస్సులతో తలస్నానాలు చేసి, శుభ్రమైన వస్త్రాలు ధరించారు. ఒక కలశంలో బియ్యం, మర్రి ఇగుళ్లువేసి, పసుపుకుంకుమలు కలశానికి పెట్టి, ఆ కలశంలో వరలక్ష్మి దేవిని ఆవాహనం చేసి, చారుమతి మున్నగువాళ్లందరూ పూజలు చేశారు. కుడిచేతికి తొమ్మిది ముడులు గల్గిన దారాలు కట్టుకున్నారు. నెయ్యితో చేసిన పిండివంటలు, తీపుపదార్థాలూ అమ్మవారికి నైవేద్యం పెట్టారు. పురోహితునికి పన్నెండు తీపిపదార్థాలు (భక్ష్యాలు), పండ్లు, టెంకాయ, తాంబూలం, దక్షిణ పెట్టి వాయనం ఇచ్చారు. అమ్మవారిసన్నిధిలో దేవికి నివేదించిన పదార్థాలు భక్తితో దేవీప్రసాదంగా స్వీకరించారు.

తర్వాత వరలక్ష్మీదేవీప్రభావం వల్లనే చారుమతి మొదలైన స్త్రీలందరూ ముత్యాల, మణులహారాలు ధరించారు. కాలి అందెలు, రవ్వలు చెక్కినసొమ్ములు పొందారు. ఇలా సంపదలే కాక - కొడుకులూ, మనుమళ్లూ కలిగి, ధనం, ధాన్యం సమృద్ధిగా పొందారు. దానధర్మాలు చేస్తూ, బంధువుల్ని పోషిస్తూ ఆనందంగా జీవించారు.

పార్వతీ! చారుమతీదేవివల్ల విన్న ఈ శ్రీవరలక్ష్మీవ్రతాన్ని ఆ నగరంలోని వాళ్లందరూ తెలుసుకొన్నారు. వాళ్లూ భక్తిశ్రద్ధలతో ఈవ్రతాన్ని ఆచరించారు. "చారుమతివల్ల మనమందరం ధన్యులం అయ్యాం. భోగభాగ్యాలతో హాయిగా ఉన్నాం. ఔరా! చారుమతి ఎంత పుణ్యాత్మురాలో కదా! ఆమె ఎంత అదృష్టవంతురాలు! ఆమెకు వరలక్ష్మీ దేవియే ప్రత్యక్షమై ఈ వ్రతాన్ని ఉపదేశించింది" అంటూ ఆమెను ప్రశంసించారు.

పార్వతీ! అది మొదలు ఈవ్రతం "శ్రీవరలక్ష్మీవ్రత"మని ప్రసిద్ధి కెక్కింది. ఇది వ్రతాలన్నింటిలో ఉత్తమమైంది. దీన్ని నీకు వివరంగా చెప్పాను. ఈవ్రతాన్ని ఎవరు ఆచరిస్తున్నారో, వ్రతకథ ఎవరు వింటు న్నారో, ఎవరు చెప్తున్నారో వాళ్లకు వరలక్ష్మీదేవీకృపవల్ల అన్నికార్యాలూ సిద్ధిస్తాయి" అని చెప్పాడు.

ఇది భవిష్యోత్తరపురాణంలోని పార్వతీపరమేశ్వరుల సంవాదం లోనిది.

శ్రీవరలక్ష్మీవ్రతం సంపూర్ణమ్

సర్వేజనాః సుఖినో భవంతు । సమస్తసన్మంగళాని భవంతు

*(అక్షతలు, పూలు అమ్మవారి కలశంవద్ద ఉంచి, నమస్కరించాలి. తర్వాత తీర్థప్రసాదాలివ్వాలి.)*

## తీర్థమంత్రం

అకాలమృత్యుహరణం సర్వవ్యాధినివారణమ్।
సమస్తపాపశమనం లక్ష్మీపాదోదకం శుభమ్॥

*॥ శుభమస్తు ॥*



# చల్లని కృష్ణుడు

- డా॥ కడిమిళ్ళ వరప్రసాద్, 92478 79606

కస్తూరీతిలకం లలాటఫలకే వక్షస్థలే కౌస్తుభమ్
నాసాగ్రే నవమౌక్తికం కరతలే వేణుం కరే కంకణమ్
సర్వాంగే హరిచన్దనంచ కలయం కంఠేచ ముక్తావళీ
గోపస్త్రీ పరివేష్టితో విజయతే గోపాల చూడామణిః

ఇది ప్రపంచప్రసిద్ధమైన శ్రీకృష్ణస్తుతి. ఇందులో వాసుదేవుని అలంకార వైభవాలను కొన్నింటిని పేర్కొనడం జరిగింది. వాటిని జాగ్రత్తగా గమనిస్తే స్వామి సౌందర్యం మాత్రమే కాక చల్లదనం కూడ కనిపిస్తుంది. **కస్తూరీతిలకం** – కస్తూరి చాల అందమైంది, పరిమళభరితమైంది మాత్రమే కాదు నుదుటిపై పెట్టుకుంటే చాల చల్లగా హాయిగా ఉండి, ప్రసన్నగుణాన్ని అందిస్తుంది. అందుకనే పూర్వకాలం తల్లులు చంటిపిల్లలకు స్నానం చేయించి, కస్తూరిబొట్టు పెట్టేవారు. 'కస్తూరి రంగ రంగా' అంటూ జోల పాడేవారు. వారి జీవితం చల్లగా ఉండాలన్నది ఆ తల్లుల కోరిక. మనం కస్తూరి బొట్టు పెట్టుకుంటే మన జీవితం చల్లగా ఉంటుంది. వాసుదేవుడు కస్తూరి పెట్టుకుంటే జగమంతా చల్లగా ఉంటుంది.

గుండెపై **కౌస్తుభమణి** వ్రేలాడుతుంటుంది. అసలే అది మణి. పైగా పాలకడలిలో పుట్టింది. దాని చల్లదనం గురించి చెప్పేదేముంది. ఆ గుండెలోనే నిరపాయినిగా లక్ష్మీదేవి ఉంటుంది. ఆమె అనుగ్రహంతో సంపదలు సమకూరుతాయి. మనకు లభించే సంపదలు జీవితాన్ని చల్లబరిచేవిగా ఉండాలి కాని, ఉద్రేకాన్ని, ఉద్వేగాన్ని పెంచేవి కాకూడదు. అలా ఉండాలంటే శ్రీకృష్ణానుగ్రహంతో లభించే సంపదలై ఉండాలి కాని, అన్యాయార్జితాలు కాకూడదు. కౌరవుల సంపద కృష్ణాను గ్రహంతో లభించింది కాదు. అందుకనే వారి సంపద సుఖ శాంతులను ఇవ్వలేదు. పాండవుల సంపద వాసుదేవాను గ్రహంతో లభించింది. కనుక అది వారికి సుఖశాంతులతోబాటు కీర్తిని కూడ ప్రసాదించింది. నాసాగ్రమందు **నవమౌక్తికముం టుంది** వాసుదేవునికి. మౌక్తికమంటే ముత్యం. పైగా అది సముద్రంలో పుడుతుంది. ఎప్పుడూ చల్లగానే ఉంటుంది. పైగా ఎప్పటికప్పుడు క్రొత్త ముత్యాన్ని ధరిస్తాడాయన. అందువల్ల ఆ చల్లదనంలో తాజాదనంకూడ ఉంటుంది. ఆయన శ్వాస ఆ ముత్యంవల్ల చల్లబడి లోకానికి శాంతిని ప్రసాదిస్తుంది. ముత్యం మనస్సుపై ప్రభావాన్ని చూపిస్తుంది. చంద్రుడు మనఃకారకుడు. చంద్రానుగ్రహం కావలిసిన జాతకునికి ముత్యం ధరించమని జ్యోతిష్యులు చెపుతుంటారు. శ్రీకృష్ణుని ఉచ్ఛ్వాసనిశ్వాసాలు కూడా లోకానికి చల్లదనాన్ని ప్రసాదిస్తాయి. మన ఊపిరి ఉన్నంతవరకు లోకం చల్లగా ఉండేందుకే ప్రయత్నం చేయాలి తప్ప, ప్రజాజీవితంలో సెగలు పొగలు సృష్టించరాదనే సందే శాన్నిస్తున్నాడు భగవానుడు తాను ముత్యాన్ని నాసాభరణంగా ధరించడం ద్వారా. శ్రీకృష్ణుని చేతిలో **వేణువు** అంటే పిల్లనగ్రోవి ఉంటుంది. అది వెదురుతో తయారౌతుంది. వెదురులోకూడ ముత్యాలు పుడతాయి. ఎక్కడ పుట్టినా ముత్యానికున్న లక్షణం తాను చల్లగా ఉంటూ తనను ధరించినవారికి చల్లదనాన్ని కలిగించడమే. చల్లదనమే తన ఉనికిగా కలిగిన ముత్యాలకు పుట్టినిల్లయిన వెదురు చల్లదనానికి ప్రతిరూపం కాక ఏమవు తుంది? అందుకే వాద్యాలు ఎన్ని ఉన్నా, వేణువాదనం వింటు న్నపుడు మనసు ప్రశాంతపడుతుంది. శ్రీకృష్ణుడు వేణువాదనం చేస్తుంటే పశువులు కూడా హాయిగా వింటూ పరవశించేవని భాగవతం చెపుతోంది. భగవంతుని అవతారాలలో కళాకారుడైన అవతారమూర్తి కేవలం శ్రీకృష్ణుడే.

కళలు ప్రజల జీవితాన్ని చల్లబరచేందుకే గాని వారిలో ఉద్రేకాన్ని రెచ్చగొట్టి, అశాంతిని ప్రేరేపించేందుకు కాదనే సందేశాన్ని లోకానికి అందిస్తున్నాడు మురళీకృష్ణుడు. **చేతికి కంకణముంటుంది** శ్రీకృష్ణునికి. కంకణం బంగారంతో తయారౌతుంది. బంగారం యొక్క ధర్మం చల్లగా ఉండడం, కాంతిమంతంగా ఉండడం. శ్రీకృష్ణానుగ్రహం కలిగినవారి జీవితం చల్లగానే కాదు తేజోమయంగా కూడ అంటే కీర్తిమంతమై ఉంటుంది. మనం చల్లగా ఉంటే అది సుఖజీవనం. ఇతరులు మనవల్ల చల్లగా బ్రతుకగలిగితే అది కీర్తిమంతమైన

జీవితం. 'కం' అనే మాటకు సంస్కృతంలో నీరు అని అర్థం. కం కణం అంటే నీటి బిందువు అని కూడా అర్థం వస్తుంది. కరే కం కణం అంటే చేతిలో నీటి బిందువును పెట్టుకొంటాడు అని భావం. పరమాత్మ ముందుగా నీటిని సృష్టించాడు అని. నీరే ప్రాణాధారం కనుక ముందు దానిని సృష్టించకుండా జీవులను సృష్టిస్తే అవి జీవించలేవు. విస్తారమైన మఱ్ఱిచెట్టుకు విత్తనం అణుమాత్రంగా భూమిలో దాగియున్నట్లే భూమికి మూడురెట్లున్న నీరు మొత్తం శ్రీకృష్ణునిచేతిలో ఒక బిందువు రూపంలో ఉంది. అంటే ఆయనే పరమాత్మ.

శ్రీకృష్ణ పరమాత్మ సర్వాంగాలందు **హరిచందనాన్ని** అంటే గంధాన్ని పూసుకుంటాడు. చందనమంటేనే చల్లదనానికి మారుపేరుగదా! అంతేనా చల్లదనంతోబాటు అందరినీ ఆహ్లాదపరచగల పరిమళంకూడా ఉంటుంది. తన ఒంటికి పూసుకున్న చందనం చల్లదనాన్ని తనకుమాత్రమే కలిగించినా దాని పరిమళం తన చుట్టూ ఉన్నవారందరికీ పంచుతుంది. మనం సుఖంగా ఉండడం కోసం మనం చేసే పని ఏదైనా, అది మిగిలినవారికి కూడ ఆనందాన్ని కలిగించేలా ఉండాలి కాని, ఇతరులకు బాధకలిగించడం ద్వారా మనం చల్లగా జీవించాలనుకోకూడదు అన్న సందేశం భగవానుడు అందిస్తున్నాడు.

కంఠమందుకూడా ముత్యాలహారాన్ని ధరిస్తాడు స్వామి. ఆయన మహాసంపన్నుడు. కావాలనుకుంటే వజ్రాలహారాన్నే ధరించగలడు. కానీ ముత్యానికున్న చల్లదనం వజ్రానికుండదు గదా! స్వామి కంఠంలో ముత్యాలమాల ధరించడం వల్ల ఆ కంఠం నుండి వచ్చే ప్రతి వాక్కూ లోకానికి చల్లదనాన్ని కలిగిస్తుంది. అందుకు ప్రబల సాక్ష్యం భగవద్గీత.

ఆయన **గోపస్త్రీ పరివేష్టితుడు**. గోవులు చల్లగా ఉంటాయి. అవి ఇచ్చే పాలు చల్లగా ఉంటాయి. ఆ పాలను గోప స్త్రీలే పెరుగుగా మారుస్తారు. అది చల్లగా ఉంటుంది. ఆ పెరుగునుండి వచ్చే వెన్న చల్లగా ఉంటుంది. ఆ వెన్ననుండి వచ్చే నేయి చల్లగా ఉంటుంది. అంతేకాదు యజ్ఞయాగాలను చేయాలంటే కావలసింది ఆవునేయి. ఆ నేతిని లోకానికి అందించేది గోపస్త్రీలే. అందుకే యజ్ఞపురుషుడైన శ్రీకృష్ణభగవానునికి వారంటే అంత ప్రేమ. అందుకే వారిని తన చుట్టూ తిప్పుకుంటుంటాడు.

**గోపాల చూడామణి** భగవానుడు. గోపాలకులు లేనిదే గోక్షీరం లేదు. వారు ప్రేమగా మేపడం చేతనే అవి పాలిస్తున్నాయి. ఆ పాలనుండే పెరుగు, వెన్న నేయి అన్నీ పుడుతున్నాయి. ఆ నేయితోనే యజ్ఞయాగాలు జరుగుతున్నాయి. అలా యజ్ఞయాగాలు జరగడానికి ముఖ్య భూమిక గోపాలురైతే వారిలో శ్రేష్ఠుడు శ్రీకృష్ణభగవానుడే. అంటే యజ్ఞయాగాలు లేనిదే ఆధ్యాత్మికత లేదు. అది లేనిదే మానవునికి మోక్షం లేదు. ఆ మోక్షానికి మూలకందం గోవు. వాటిని స్వయంగా పెంచి పోషించినవాడు శ్రీకృష్ణుడు. పశుపక్ష్యాదులకు లేని ముక్తి మార్గం మానవునికే దక్కింది. అది సద్వినియోగం కావాలంటే యజ్ఞయాగాదులు చేయడమో లేదా వాటికి సాయపడటమో చేయాలి. అలా చేయాలంటే ముందుగా చేయాల్సింది గోసంరక్షణం. గోవు లేనిదే ముక్తి లేదని లోకానికి తెలియజేసింది స్వయంగా తాను ఆచరించి మరీ చూపించిన శ్రీకృష్ణభగవానుడే.

శ్రీకృష్ణుడు పుట్టింది వర్ష ఋతువు చల్లని శ్రావణ మాసంలో. పైగా అర్ధరాత్రి. పుట్టిన వెంటనే యమునా నదిని దాటాడు. పైనుండి వర్షం, అటునిటు యమునానది. పైని గొడుగులా చల్లని పాముపడగ. కాస్త పెరుగుతూనే, పాలు, పెరుగు, వెన్నముద్దలు ఎక్కడ దొరికినా వదిలేవాడు కాదు. చల్లని యమునాతీరంలో విహరించేందుకు ఇష్టపడేవాడు. చల్లగా ఉండే నెమలిపింఛాన్ని శిరసున దాల్చేవాడు. కడుపులో చల్లగా పడిఉండే అటుకులు గుప్పెడు తిని కావలసినంత ఐశ్వర్యాన్ని బాల్యమిత్రుడు కుచేలునికి ప్రసాదించాడు. కావ్యాలు పురాణాలు అన్నీ ఆయనను మేఘశ్యామలమూర్తిగా అభివర్ణించాయి. నల్లని వస్తువులు లోకంలో చాలా ఉంటాయి. కాని మేఘంతోనే పోలిక ఎందుకంటే మేఘంలాగ చల్లగా ఉంటూ దయను వర్షిస్తాడు కనుక. లోకుల జీవితాలను సస్యశ్యామలం చేస్తాడు కనుక. ఆయన శరీరమంతా వర్షించే మేఘంలా ఉంటే, కన్నులు నీటిలో ఉండే చల్లని పద్మాల్లా ఉంటాయి. ఆ కనులతో చల్లని కృపారసాన్ని పై జల్లుతుంటాడు. చల్లగా నవ్వి అందరి హృదయాలను దోచుకుంటాడు. అటువంటి మా కన్నయ్య మీకు కనిపించాడా? అని గోపికలు చల్లని మల్లెలను అడుగుతారు. ఎందుకంటే చల్లదనం జాడ చల్లదనానికే తెలుస్తుంది. కృష్ణుని జాడ మల్లియలకే తెలుస్తుందని వారి భావన.

లీలాశుకుడు తన శ్రీకృష్ణకర్ణామృతంలో స్వామి శైశవ రూపాన్ని ఎంత మధురంగా సాక్షాత్కరింపజేస్తున్నాడో చూడండి.

**కరారవిన్దేన పదారవిన్దమ్**
**ముఖారవిన్దే వినివేశయన్తమ్**
**వటస్య పత్రస్య పుటే శయానమ్**
**బాలం ముకుందం మనసా స్మరామి ॥**

అది కల్పాంత ప్రళయకాల జలం, ఆ నీటిపై తేలుతున్న మఱ్ఱియాకు. దానిపై బాలకృష్ణుడు. బాలకృష్ణుడు అనడం కంటే శైశవకృష్ణుడు అనడం సముచితమేమో. పిల్లవారికి సహజమైన చేష్టగా తన కాలి వ్రేలును చేతితో తీసికొని నోటిలో పెట్టుకుంటున్నాడు. ఉన్నది చల్లని నీటిపై, దానిపై చల్లని మఱ్ఱియాకు. బాలకృష్ణుని చేయి పద్మంలా ఉంది. భూమిపై పుట్టిన చెట్టుపూవే చల్లగా ఉంటుంది. ఇంక నీటిలో పుట్టిన పద్మం చల్లదనం గురించి చెప్పేదేముంది.

అలాంటి కరారవిందంతో అంటే పద్మంలాంటి చల్లని చేతితో, పద్మంలాంటి చల్లని పాదాన్ని పద్మంవలె చల్లనైన



నోటిలో పెట్టుకుంటున్నాడు. ఇక్కడ పని చేస్తున్నవి మూడు అవయవాలు. చేయి, పాదం, నోరు. ఆ మూడూ పద్మాలలాగే కనిపించాయి భక్తకవి లీలాశుకునికి. అంటే శ్రీకృష్ణుడు బాల్యావస్థలోకూడా పరమ శాంతమూర్తిగా, పరమశైత్యమూర్తిగా కనిపించాడు.

శైశవావస్థనుండి కొంచెం పెద్దవాడైన బాలకృష్ణుడు కూడా ఆ మహాకవికి అలాగే కనిపించాడు.

**కాళిందీ పులినే, తమాల నిబిడచ్ఛాయే పురస్సంచరత్**
**తోయే, తోయజ పత్ర పాత్ర నిహితం దధ్యన్న మశ్నాతి యః**
**వామే పాణితలే నిధాయ మధురం వేణుం, విషాణం కటి**
**ప్రాంతే గాశ్చ విలోకయన్ ప్రతికలం, తం బాలమాలోకయే॥**

యమునా నది ఇసుక తిన్నె, చీకటి చెట్టు నీడ, ఎదురుగా నదీ ప్రవాహం, అక్కడ తామరాకును భోజనపాత్రగా చేసికొని, పెరుగన్నం తింటున్నాడట.

ఎడమచేతిలో పిల్లనగ్రోవి, మొలలో కొమ్ముబూరా పెట్టుకొని గోవులు చెదిరిపోకుండా మేత మేస్తున్నాయో లేదో గమనిస్తున్నాడట. ఎంత మధురమైన దృశ్యం. ఇందులో చల్లనిది కానిది ఒక్క వస్తువుకూడా లేదు. ఏ వేడి వేడి అన్నం తింటున్నాడని చెప్పవచ్చుగా, ఎపుడో ఉదయం బయలుదేరివనానికి వచ్చినవాడు. మధ్యాహ్నానికి అన్నం వేడిగా ఉండదు. పెరుగన్నమైతే ఎంత ఆలస్యమయినా రుచిగా, కడుపుకు చల్లగా ఉంటుంది. అదేమిటో ఏ కవి లేదా ఏ భక్తుడు శ్రీకృష్ణుని ఎలా దర్శిద్దామనుకొన్నా ఆయన చల్లనివాడుగానే కనిపిస్తాడు.

కృష్ణస్తుతి ఎందరో ఎన్నోరకాలుగా స్తుతించారు కాని మొట్టమొదటగా స్తుతించే భాగ్యంకూడ దేవకీ వసుదేవులకే కలిగింది. శిశురూపనారాయణుని చూడగానే ఇద్దరూ పరవశంతో విడివిడిగా స్తుతించి, తరించారు. ఆ శిశువును ముందుగా దర్శించిన వసుదేవుడు ఆనంద రసాబ్ధిమగ్నుడయ్యాడట. వెంటనే వేయి గోవులను దానం చేయాలని సంకల్పించాడట. నాలుగు మోముల బ్రహ్మను కన్నతండ్రి నా బిడ్డడుగా జన్మించాడని మురిసిపోయాడు. దేవకీదేవి అయితే 'తోయజేక్షణ! నలినలోచన!' అంటూ వాసుదేవుని చల్లనిపద్మాల వంటి కన్నులను గాంచి స్తుతించింది.

ఆ చంటిపాపడు నందుని ఇంటికి చేరాడు. బిడ్డ పుట్టాడని ఆనందించిన నందుడు వెంటనే స్వస్తిపుణ్యాహ వాచనంబులు చేయించి, రెండు లక్షల గోవులను దానం చేశాడట. అక్కడ వసుదేవుడు, ఇక్కడ నందుడు కూడ అంత విరివిగా గోదానం చేశారు. శ్రీకృష్ణుని బాల్యమంతా గో సేవలోనే గడిచింది. శ్రీకృష్ణునికి గోజాతికి విడదీయరాని బంధం ఏర్పడింది. అందుకనే ఆ స్వామిని గోవిందుడనే పేరుతోనే లోకం ఎక్కువగా వ్యవహరిస్తోంది.

కృష్ణుడు పుట్టిన వార్తను తెలిసికొని గోపకాంతలందరూ వచ్చి నేతులు, పెరుగు, పాలు, నీళ్లు, వెన్న ఒకరిపై ఒకరు చల్లుకుంటూ వసంతాలాడారట. అదీ వసంతాలాడటమంటే, అంతేకాని రసాయనాలు కలిపిన రంగునీళ్లు చల్లుకుంటూ, హోలీ పండుగ జరుపుకునేవారు దీన్ని గమనించాలి. చల్లుకోవలసింది రంగు నీళ్లు కాదు. పాలు పెరుగు నేయి వెన్న నీళ్లు లాంటివి చల్లుకుంటే చలవ చేస్తుంది. ఆరోగ్యం కలుగుతుంది. రసాయనాలు కలిపిన నీళ్లు జల్లుకొంటే అనారోగ్యం వస్తుంది. బాలకృష్ణుడు అల్లరివాడై మన్ను తింటున్నాడని యశోదకు తెలిసింది. కృష్ణుని దండించబోయింది. లేదమ్మా నేను మన్ను తినలేదని తన నోరు చూపించాడు. శ్రీకృష్ణుడు. అంతే! ఆ నోటిలో యశోదకు సమస్త విశ్వం కనిపించింది. ముందుగా సముద్రం కనిపించింది. శ్రీకృష్ణుని విశ్వరూపసందర్శనం ముందుగా చేసికోగలిగిన భాగ్యశాలిని యశోదాదేవి.



నందాదులు వార్షికంగా చేసే ఇంద్రయాగానికి సిద్ధపడినపుడు 'కాదు గోవర్ధనగిరిని పూజించ' మన్నాడు కృష్ణుడు. అదొక పర్వతం. దాని నిండా చెట్లుచేమలు ఉంటాయి. పుష్కలంగా పశుగ్రాసం లభిస్తుంది. ఆ పర్వతాన్ని ఆధారం చేసికొని గోపాలక కుటుంబాలన్నీ బ్రతుకుతున్నాయి. అటువంటి గిరిని పూజించకుండా ఇంద్రుని పూజించడమేమిటని కృష్ణుడు విప్లవవాదం చేశాడు. భగవదవతారలన్నిటిలో విప్లవవాదానికి బీజం వేసింది శ్రీకృష్ణావతారమే. ఇంద్రపూజను వ్యతిరేకించడం కృష్ణుని ఉద్దేశ్యం కాదు. వారి సమీపంలో ఉండి, ప్రత్యక్షంగా బ్రతుకుతెరువు కల్పిస్తున్న ప్రకృతిని నిర్లక్ష్యం చేయకూడదని చెప్పడమే భగవానుని ఉద్దేశ్యం.

భగవంతుడు చెప్పినట్లు చేస్తే ఏవైనా ఆపదలు వస్తాయోమో అని భయపడవలసిన పనిలేదు. ఆపద్బాంధవుడైన భగవంతుడే వారిని రక్షిస్తాడనే సత్యాన్ని ఇక్కడ శ్రీకృష్ణుడు ఆవిష్కరించాడు. అంతేకాదు ఇంద్రుడు అధిపతి. తన పాలనలో ఉన్న లోకులను రక్షించడం అతని విధి. అంతేకాని తాను అలా రక్షిస్తున్నందుకు బదులుగా లోకులందరూ తనను పూజించాలనుకోవడం స్వార్థం, అహంకారం అవుతాయి. అందుకని గోవర్ధనోద్ధరణంద్వారా ఇంద్రుని అహంకారాన్ని రూపుమాపాడు. ఇంద్రు దంతటివానిని దాసోహమనిపించాడు.

యమునానది చల్లని నీటితో అందరికీ తాపోపశమనాన్ని కలిగిస్తుంది. తృష్ణోపశమనాన్ని కలిగిస్తుంది. తన పైనుండి వీచే గాలికి చల్లదనాన్ని కలిగించి, సమీపంలో సంచరించేవారికి ఎంతో హాయిని కలిగిస్తుంది. భూమిని సస్యశ్యామలం చేసి జీవజాలానికి ఆకలి తీరుస్తుంది. అటువంటి పవిత్రమైన యమునానది నీటిని తనముఖస్థమై ఉన్న విషంతో

పూర్తిగా పాడు చేస్తున్న కాళియుని పడగలపై తాండవం చేసి, దాని శక్తిని క్షీణింపజేశాడు. తన శక్తి పై తనకు గల అతిమాత్రమైన విశ్వాసాన్ని, దానివలన వచ్చిన అహంకారాన్ని అణగదొక్కాడు. కాళికేయుని భార్యల ప్రార్థన మేరకు ప్రాణాలతో విడిచి పెట్టి దూరంగా పంపివేయడంద్వారా జలసంరక్షణకు బీజావాపం చేసిన మొదటి మహనీయుడు చల్లనిదేవుడు శ్రీకృష్ణుడే.

లోకంలో పూర్వకాలంలో విద్యాభ్యసనానంతరం గురు దక్షిణ ఇచ్చిన వారున్నారు. కాని శ్రీకృష్ణుడు తన గురువు సాందీపని కోరికమేరకు, 'నా కుమారుడు సముద్రస్నానం చేస్తుండగా మరణించాడు, వానిని బ్రతికించి తీసికొని రా' అనిన వెంటనే యమనగరానికి వెళ్లి మరీ ఆ కుమారుని బ్రతికించి తెచ్చి ఇచ్చాడండి శ్రీకృష్ణునికంటె చల్లనిదేవుడెవరుంటారు! గర్భ శోకనివారణంకంటే జీవితానికి చల్లదనమేముంటుంది? అటు వంటి గురుదక్షిణ నిచ్చినవాడు లోకంలో ఎవరూ లేరు కేవలం ఒక్క శ్రీకృష్ణుడు తప్ప.

అంతటి మహనీయుడు కనుకనే కులశేఖరాళ్వారుల వారు పరవశించి ముకుందమాల అనే పేరుతో శ్రీకృష్ణుని నలుబదిరకాలుగా స్తుతించారు. అందులో ఒకటి...

**జిహ్వే! కీర్తయ కేశవం మురరిపుం చేతో భజ శ్రీధరమ్
పాణి ద్వంద్వ! సమర్చయాచ్యుతకథాః శ్రోత్రద్వయ! త్వం శ్రుణు
కృష్ణం లోకయ లోచనద్వయ! హరేః గచ్ఛాంఘ్రియుగ్మాలయమ్
జిఘ్ర ఘ్రాణ! ముకున్దపాద తులసీం మూర్ధన్! నమాధోక్షజమ్॥**

ఎవరినో తాను ప్రబోధించడంలేదు. తన అవయవాలనే తాను ప్రబోధిస్తున్నాడు.

"ఓ నాలుకా! కేశవుని కీర్తించు" అంటూ ఆరంభమైందీ శ్లోకం. 'శ్రవణం, కీర్తనం విష్ణోః' అంటూ భక్తిని తొమ్మిది రకాలుగా చెపుతారు. ఈ శ్లోకంలో ఒక్కొక పాదంలో రెండేసి రకాలైన హరిసేవను ఎనిమిది అవయవాలకు ప్రబోధించారు కులశేఖరులు. ముందుగా నాలుకను సంబోధించారు. 'పిబరే రామరసం రసనే' అన్న సుప్రసిద్ధ సంస్కృతకీర్తనలో కూడ సంబోధింపబడింది నాలుకే. మన శరీరంలో నాలుకది అతి ప్రధానమైన స్థానం. కొలవడానికి చాల చిన్నదే అయినా, చాల సున్నితమైందే అయినా ఏది తినాలన్నా నాలుక కావాలి. ఏది అనాలన్నా నాలుక కావాలి. అందువల్ల మన జీవితం బాగు పడడానికి, పాడవడానికి కూడా నాలుకదే ప్రధానపాత్ర. కాబట్టి నాలుకను జాగ్రత్తగా నియంత్రించాలి. హస్తచాపల్యం, పాద చాపల్యంలాంటి మాటలు లేవు. కాని జిహ్వాచాపల్యం అనే మాట బాగా వాడుకలో ఉంది. నాలుకకు చాపల్యం ఉంటే తినకూడనివి తినాలనిపిస్తుంది. దానివల్ల శారీరక ఆరోగ్యం పాడౌతుంది. బెత్తెడునాలుకను సంతృప్తిపరచేందుకు ఏది పడితే అది తింటే ఆరడుగుల శరీరం పాడవుతుంది. నాలుకకు నియంత్రించాలి. అది చేసే రెండవ పని అనడం. మాట్లాడా లంటే నాలుక ఉండాలి. 'నరంలేని నాలుక' అనేది అందరి నోట్లో నానే మాట. అంటే నాలుక ఏదైనా మాట్లాడుతుంది. అలా మాట్లాడకుండా నియంత్రించాలి అని ఆ నానుడికి అర్థం. కేశవుని కీర్తించ మంటున్నారు. 'క' అంటే బ్రహ్మ, ఈశ అంటే ఈశ్వరుడు. క ఈశ కలిపితే కేశ'. ఆ ఇద్దరూ ఎవరియం దుంటారో అతడు కేశవుడు. అంటే నారాయణుడు. విష్ణువాచక శబ్దాలన్నీ శ్రీహరినే తెలియజేసినా కేశవ శబ్దం మాత్రం త్రిమూర్త్యాత్మకమై ఉంటుంది. అందుకనే ఆచమనం చేస్తున్న పుడు పఠించే 24 నామాలలో ప్రథమస్థానం కేశవ శబ్దానికే దక్కింది. కేశవనామంతో భగవంతుని కీర్తించుటవల్ల సృష్టి స్థితి లయాత్మకుడైన పరబ్రహ్మను స్తుతించినట్లై ఆ మూడింటికి అతీతమైన మోక్షాన్ని పొందే అవకాశం లభిస్తుంది.

నాలుకనే సంబోధిస్తూ కేశవుని కీర్తించమంటున్నారు కులశేఖరులు. శ్రవణం కీర్తనం అన్న ఆర్యోక్తిలో కీర్తనం రెండవది అయినా కులశేఖరులు కీర్తనకే ప్రథమస్థానం ఇచ్చారు. ఎందు కంటే శ్రవణం చేయాలంటే ఎవరో ఒకరు కీర్తనం చేయాలిగా. శ్రవణం వలన విన్నవాడే తరిస్తాడు. కాని కీర్తనవల్ల కీర్తించిన వాడు, దాన్ని ఆలకించినవాడు కూడా తరిస్తారు.

'తలలో నాలుక' అన్నది తెలుగునాట గొప్ప జాతీయం. ఇక్కడ తల అంటే నోరు అని అర్థం. నోటిలో గట్టివి, శక్తి మంతాలైనవి 32 పళ్లు ఉంటాయి. వాటి నడుమన మిక్కిలి సున్నితమైన నాలుక ఉంటుంది. ఒకరోజు, రెండు రోజులు కాదు జీవితకాలం వాటి నడుమనే ఉండాలి. గట్టి వస్తువులను అవి కొరికి, నమిలి అందిస్తే ఆ పదార్థాల రుచిని ఆస్వాదించేది

మాత్రం నాలుకయే. ఎపుడూ దంతాల నడుమనే ఉంటూ ఇరుక్కోకుండా వాటివలన తనకు కావలసిన ఉపకారాన్ని పొందుతూ వాటితో సయోధ్యగా ఉంటుంది కనుక నలుగురితో కలుపుగోలుతనంగా ఉంటూ అందరితో మంచిగా ఉండేవారిని 'తలలో నాలుకలా' ఉంటారు అని అంటారు. తిరుపతి వేంకటకవుల 'పాండవోద్యోగ విజయాలు' నాటకంలో రాయ బారం సన్నివేశంలో పాండవులనుగూర్చి చెపుతూ 'పతితులు గారు నీయెడల భక్తులు' అన్నపద్యంలో 'నృపసంతతికిన్ దలలోని నాల్కలు' అంటాడు శ్రీకృష్ణభగవానుడు. ఇన్నివిధాలుగా ప్రాధాన్యాన్ని సంతరించుకున్న నాలుకకు సరియైన నియంత్రణ లేకపోతే ఐహిక ఆధ్యాత్మికజీవితాలు రెండూ పాడవుతాయి.

**నాలుక** కేశవనామాన్ని కీర్తించడానికి పూనుకుంది. కాళ్లు చేతులు మొదలైన మిగిలిన అవయవాలు కూడా శ్రీహరికి అభిముఖ్యం కావాలంటే మనసు సహకరించాలిగదా! అందుకని వెంటనే కులశేఖరుల దృష్టి మనసుమీదకి మళ్లింది. వెంటనే 'ఓ మనసా! మురారిని సేవించు' అన్నాడు. మనసు మనం చెప్పిన మాట వినాలంటే అలా వినకుండా దానిని నిరోధించే ఆరుగురు శత్రువులు తనచుట్టూ ఉన్నారు. వారి పేర్లు కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు. వాటిని జయించకుండా భగవదారాధన చేసినా దృష్టి నిలబడదు. ఏకాగ్రత కుదరదుగదా అని అనుకుంటావేమో. ఆ సందేహం అక్కరలేదు. ఏకాగ్రత కుదిరినా కుదరకపోయినా నువ్వు ఆ మురారిని సేవిస్తూనే ఉండు. మురుడు అనే భయంకరుడైన రాక్షసునే చంపిన నారాయణునికి ఈ శత్రువులను పరిమార్చడం పెద్ద లెక్కకాదు అంటూ మనసును చైతన్యపరస్తున్నారు కులశేఖరులు. మనసును అదుపులో పెట్టుకున్న తరువాత మిగిలిన అవయవాలకు భగవదాభిముఖ్యం కలిగిస్తున్నారు. చేతుల జంటకు చెపుతున్నాడు శ్రీధరుని బాగుగా అర్చించమని. 'కష్టే ఫలీ' అన్నారు. మనం చేతులతో తగిన పని చేస్తే సంపద వస్తుంది. అలాగే శ్రీధరుని అర్చిస్తే మన జీవితం శ్రీమంతమౌతుంది. అచ్యుతుని కథలను వినుమని చెవులజంటను ఉద్బోధిస్తున్నాడు. కాకమ్మకథలతో కాలక్షేపం చేయడంకంటె అచ్యుతుని కథలను వింటే మన జీవితం చ్యుతం(భ్రష్టం) కాకుండా ఉంటుంది. కృష్ణుని చూడమని కనుదోయికి నచ్చజెపుతున్నాడు. కృష్ణుని రూపం జగన్మోహనం. సౌందర్యనిలయం. ఒక్కసారి అనశ్వరమైన ఆ మహాసౌందర్యాన్ని చూడగలిగితే నశ్వరమైన ఈ ప్రాపంచిక సౌందర్యాల పై వ్యామోహం అణగిపోతుంది. నిజమైన సౌందర్యం అంటే ఏమిటో బోధపడుతుంది.

హరియొక్క ఆలయానికి ప్రయాణించమని పాదద్వం ద్వానికి చెపుతున్నారు. చిన్న చితక కష్టాలను తీర్చుకునేందుకు ఎవరెవరి దగ్గరకో పోయే బదులు సమస్తకష్టాలను హరించే హరి ఆలయానికి వెళితే అన్ని కష్టాలు తీరి నిజమైన, శాశ్వత మైన ఆనందాన్ని పొందే వీలుంటుందని కులశేఖరుల ఆశయం. ముకుందుని పాదాలపై ఉన్న తులసీదళాన్ని వాసన చూడమని ముక్కుకు చెపుతున్నాడు. అలనాడు రుక్మిణీదేవి భక్తితో వేసిన ఒక్క తులసీ దళానికి తూగినవాడు పరమాత్మ. అవసానకాలంలో తులసీతీర్థం సేవిస్తే ఆ జీవికి ఉత్తమగతులు సంప్రాప్తిస్తాయం టారు. కేవలం తులసికే అంత శక్తి ఉన్నపుడు ముకుందుని పాదాలపై ఉన్న తులసి ఎంత శక్తిమంతమో వేరుగా చెప్పనక్కర లేదుగా. దాన్ని వాసన చూచి ఆనందించడానికి అలవాటు పడితే మిగిలిన విషయవాసనలపై ఆసక్తి తగ్గిపోతుంది.

చివరగా 'సర్వస్య గాత్రస్య శిరః ప్రధానమ్' అన్నారు గనుక శిరస్సును సంబోధించి, అధోక్షజునికి నమస్కరించు అని చెపుతున్నాడు. అధోక్షజుడు అంటే ఇంద్రియాలను అధఃకరిం చినవాడు. అంటే జితేంద్రియుడు. అన్ని పాడు ఆలోచనలు తలలోనే పుడతాయి. ఆ తలంపులకు అనుగుణంగా ఇంద్రియా లన్నీ వెఱ్ఱెత్తి వీరంగమాడుతుంటాయి. ఆ ఇంద్రియాల ప్రకోపం తోనే అహంకారం విజృంభిస్తుంది. అహంకారమే మనుజుని పతనానికి మూలకారణమౌతుంది. ఇంద్రియాల ప్రకోపం తగ్గాలన్నా, అహంకారం అణగాలన్నా తల వంచి నమస్కరిం చాలి. అందుకే జితేంద్రియుడైన శ్రీహరికి నమస్కరించమని ప్రబోధిస్తున్నాడు. ఈ విధంగా మన అవయవాలకు మనం నచ్చచెప్పగలిగితే భగవదాభిముఖ్యంగా వాటిని నడిపించగలిగితే జనన మరణచక్రంనుండి బయటపడే అవకాశం మనకు లభిస్తుంది.

ఇలా శ్రీకృష్ణుని గురించి ఆలోచిస్తే, శైశవంనుండి ప్రౌఢవయస్సువరకు ఎప్పుడైనా, ఎక్కడైనా స్వామి చేసే ఏ చేష్టలో అయినా పరమప్రయోజనం ఒక్కటే కనిపిస్తుంది. అది లోకాలను, లోకులను చల్లగా చూడటం.

# శ్రీ సుబ్రహ్మణ్య షోడశనామ స్తోత్రమ్



అస్య శ్రీసుబ్రహ్మణ్యషోడశనామస్తోత్రమహామంత్రస్య అగస్త్యో భగవానృషిః
అనుష్టుప్ఛన్దః, సుబ్రహ్మణ్యోదేవతా, మమేష్టసిద్ధ్యర్థే జపే వినియోగః

**ధ్యానమ్**

షడ్వక్త్రం శిఖివాహనం త్రిణయనం చిత్రామ్బరాలంకృతం
శక్తిం వజ్రమసిం త్రిశూలమభయం ఖేటం ధనుశ్చక్రకమ్।
పాశం కుక్కుటమంకుశం చ వరదం హస్తైర్దధానం సదా
ధ్యాయేదీప్సితసిద్ధిదం శివసుతం స్కన్దం సురారాధితమ్॥

ప్రథమోజ్ఞానశక్త్యాత్మా ద్వితీయః స్కన్ద ఏవ చ।
అగ్నిగర్భస్తృతీయస్తు బాహులేయశ్చతుర్థకః॥

గాంగేయః పంచమః ప్రోక్తః షష్ఠశ్శరవణోద్భవః।
సప్తమః కార్తికేయశ్చ కుమారశ్చాష్టమస్తథా॥

నవమః షణ్ముఖః ప్రోక్తః తారకారిః స్మృతో దశ।
ఏకాదశశ్చ సేనానీః గుహో ద్వాదశ ఏవ చ॥

త్రయోదశో బ్రహ్మచారీ శివతేజశ్చతుర్దశః।
క్రౌంచధారీ పంచదశః షోడశశ్శిఖివాహనః॥

షోడశైతాని నామాని యో జపేద్భక్తిసంయుతః।
బృహస్పతిసమో బుద్ధ్యా తేజసా బ్రహ్మణస్సమః॥

కన్యార్థీ లభతే కన్యాం జ్ఞానార్థీ జ్ఞానమాప్నుయాత్।
విద్యార్థీ లభతే విద్యాం ధనార్థీ ధనమశ్నుతే॥

యద్య త్ప్రార్థయతే మర్త్యః తత్సర్వం లభతే ధ్రువమ్

ఇతి శ్రీసుబ్రహ్మణ్యషోడశనామస్తోత్రమ్

గ్రంథసమీక్ష

# కటకటా మర్కటా!

## (బాలల బొమ్మల కథలు)

రచయిత-ఆర్.సి.కృష్ణస్వామి రాజు; సైజు-క్రౌన్; పుటలు-120; మూల్యం-రూ. 140/-(పోస్టేజి అదనం); ప్రతులకు- 22-4-71, బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ, అక్కారం పల్లి పోస్ట్, తిరుపతి. సెల్-93936 62821.

ఆర్.సి.కృష్ణస్వామిరాజు రచించిన 'కటకటా మర్కటా!' పుస్తకంలోని ముప్పై బాలల బొమ్మల కథలు పిల్లల్ని ఎంతగానో ఆకట్టుకుంటాయి. బాలసాహిత్యంలో హాస్యాన్ని పండించడం కత్తిమీద సాములాంటిది. కానీ కృష్ణ స్వామిరాజు ఎంతో సులభంగా కథలలో హాస్యాన్ని చొప్పిస్తారు.

'కటకటా మార్కటా!' కథ ద్వారా పిల్లకోతిచేష్టలను వర్ణిస్తూ మన పెదవులపై నవ్వులు పూయిస్తారు. ఒకరోజు ఊర్లోకి వచ్చిన ఒక అల్లరి పిల్లకోతి, ఐదో తరగతి చదివే చక్రి బెలూన్లను లాక్కొని ఆటపట్టిస్తూ ఉంటుంది. దానికి బుద్ధి చెప్పాలని ఒకసారి రంగురంగుల బెలూన్లన్నింటినీ ఒకే దారానికి కట్టి ఎగురవేస్తాడు. ప్రక్కనే చెట్టుకొమ్మపై ఉన్న ఆ పిల్ల కోతి వాటిపైకి దూకగానే దారాన్ని వదులుచేస్తాడు. బెలూన్ల గుత్తితో పాటు కోతి కూడా ఆకాశంలోకి లేస్తుంది. భయంతో వణికిపోయిన పిల్లకోతిని గమనించిన చక్రి నెమ్మదిగా దారాన్ని కిందికి లాగడంతో అది ప్రాణాలతో బయటపడుతుంది. కోతి చేష్టలతో నవ్వులు పూయిస్తూనే, అల్లరిపనుల వల్ల వచ్చే ప్రమాదాన్ని ఈ కథ చక్కగా చూపిస్తుంది.

బడికి వెళ్లే పిల్లలు మాస్టార్లు చెప్పిన పాఠాలను ఒక చెవితో విని, మరో చెవితో వదిలేయకుండా మెదడులో భద్రంగా దాచుకోవాలని చెప్పే కథ "పెట్టెలో ఏముంది?".

ఇరుగుపొరుగుతో, స్నేహితులతో ఎలా మెలగాలో చెప్పే కథ 'ఇచ్చుటలో ఉన్న హాయి', మరో కథ 'చీమ తెలివి' ద్వారా మంచి వారితో స్నేహం చేస్తే భవిష్యత్తు బాగుంటుంది అని అంటారు రచయిత. ఆపద ఎదురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలి అని చెప్పే కథ 'సజ్జ వడల డబ్బా'. పెద్దగా ఆలోచించేవాడే, పెద్ద గమ్యాలు పెట్టుకుని దానికోసం కృషి చేస్తాడు అని చెప్పే కథ 'కోట కట్టాలి'. ఇలా చెప్పుకుంటూ పోతే పుస్తకంలోని ప్రతి కథా అన్యోపదేశంగా పిల్లలకు మంచి సందేశాన్ని ఇచ్చేదే!

అల్లరి కథల ద్వారా జాగ్రత్తలను, వినోదం ద్వారా హాస్యాన్ని పండించి, వాటిలోనే ఆధునిక విజ్ఞానాన్ని జోడించి ఇలా ముప్పై కథలను పిల్లలకు ఆసక్తిదాయకంగా చెప్పారు రచయిత. **- శ్రీ కాపా మధుసూదన్, తిరుపతి.**






నారాయణీ అంటే జ్ఞానానికి నిలయమైన వేదమాత



ధారావాహిక

శ్రేష్ఠలూరి వేంకటార్య ప్రణీత

# శ్రీనివాస విలాస సేవధి-ద్విపదకావ్యం

సంక్షిప్తవచనం- ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి

*గత సంచిక తరువాయి...*

తన కావ్యకన్యకకు లక్ష్మీవిభుడు, ధన్యచరిత్రుడు, ఉదారశేఖరుడు, మన్మథుని జనకుడు, యతిబృందానికి వైభవాన్నిచ్చినవాడు, అతి పుణ్యకీర్తి, పాప సంహారి, కల్మష నాశకుడు, అఘటనఘటనా కార్యనిర్వహణదక్షుడు అయిన పరంధాముడు శ్రీహరియే పతిగా తగినవాడని భావించి కవి కావ్యరచనకు ఉపక్రమించాడు.

ధరణీధరుడు, పండితుల హృదయాలలో నివసించే వాడు, దేవేంద్ర రక్షకుడు, విస్తృత తేజమూర్తి అయిన వేంకటాచలాధిపతికి ప్రణమిల్లి 'శ్రీనివాసవిలాస సేవధి' ద్విపద కావ్యంలో శ్రీనివాసుని గుణసంపదను, అద్భుత మహిమను కవి వర్ణించిన కథాక్రమం.

## ప్రారంభం

శ్రీ నైమిశారణ్యసీమలో వ్యాసమౌని ప్రియశిష్యుడు సూతమహర్షి ఉన్నతాసనంపై కూర్చుని శౌనకాది మహా మునీంద్ర సమూహం ఆసక్తితో వినేటట్లుగా పురాణప్రసిద్ధ కథలు వీనులకింపుగా వివరించేవాడు. ఆ సందర్భములో మునులందరూ సూతమహర్షితో–

"మహర్షీ! పౌరాణికచంద్రా! ధరణిలో అతి పుణ్యతమమైన క్షేత్ర రాజమేది? భువనపావనమైన పర్వతమేది? ఎక్కడ ముకుందుడు లక్ష్మీదేవితో సహా విహరిస్తుంటాడు? మ్రొక్కి ప్రార్థించేవారికి తన లీలలతో నిత్యమూ కోరిన కోర్కెలనిచ్చే ప్రదేశమేది? ఎలాంటి కథ వినినంతనే సమస్తసంపదలు సమకూరుతాయి? అమిత పుణ్యాలు చేకూరుతాయి? మహా పాతకాలు సమసిపోవును? ఏ కథ విన్నంతనే సమస్తవేదాలు ఆదరంతో అలకించిన ఫలము కలుగుతుంది? అట్టి ఫలం భూమండలంపై ఉంటే తెలియజేయండి" అని ప్రార్థించారు.

సూతుడు– మునీంద్రులారా! ఈ భువిపై జ్ఞాన, విజ్ఞాన సాధనకు ఏకైక స్థానం శేషాచలం. వైకుంఠం మానవులకు చేరలేనిది, ప్రత్యక్షంగా చూడలేనిది. దేవమానవులకు చూడదగింది భువిపై వేంకటాద్రి ఇంపైన క్షేత్రం. కనుక వనజాక్షుడైన శ్రీహరి శ్రీదేవితో కూడి ఈ క్షేత్రంపై విహరిస్తుంటాడు. ఆ వేంకటాద్రి వైభవాన్ని మీకు తెలియచేస్తాను.

"జగత్సృష్టివేళ శ్రీహరి ఆదివరాహమై ప్రాదుర్భవించడం మిక్కిలి అద్భుతం. వరాహరూపంలో పృథివిపై ఆవిర్భవించి వేంకటాచల భర్త అయిన పుణ్యచరిత్రం అద్భుతాలకెల్ల అద్భుతం. అగణిత వాక్పటిమతో ఆ పుణ్యకథ చదివినా, ఇతరులకు తెలిపినను, శుభాలు, సిరిసంపదలు కలుగుతాయి. అమిత సౌఖ్యం, ఆరోగ్య ఘనభాగ్యం, సత్కీర్తి కలిగి విరాజిల్లుతారు. కావున అలాంటి వేంకటాచలమాహాత్మ్యాన్ని తెలుపుతాను. మీరు సావధానులై వినండి" అని సూతుడు శౌనకాది మహామునులకు వివిధ వృత్తాంతాల్ని వివరించడం ప్రారంభించాడు.

## శ్రీరమణుడు వరాహావతారంలో భూమినుద్ధరించడం

పూర్వం శ్రీరమణుడు క్షీరసాగరంలో శేషతల్పంపై శయనించిన వేళ తన లీలా విలాసం చేత లోకాలను సృజియించాలనే కోరిక కలిగింది. వెంటనే తన నాభి నుండి ఒక పద్మాన్ని ఆవిర్భవింపజేసి ఆ దివ్యకమలం నుండి బ్రహ్మను పుట్టించాడు. ఆ బ్రహ్మకు శ్రుతి, స్మృతులను ఉపదేశించి, పంచభూతమయమైన లోకసమూహాన్ని నిర్మించే పాటవాన్ని కలిగించాడు. కమలసంభవుడైన బ్రహ్మ కల్పాదిలో లోకాల్ని సృష్టింప పూనుకున్నాడు.

అగ్ని, నీరు, గాలి బరువుతో భూమిలో మునిగియుంది. ఆదికూర్మం పుడమిని వెన్నుపై మోసియుంది. అట్టి పుడమిని బ్రహ్మ పైకి ఎత్తలేనివాడయ్యాడు. పరమ కరుణాంతరంగుడు, పద్మనాభుడు శ్రీమహావిష్ణువు తన ముఖారవిందంపై చిరునగవు ఉదయించగా, ఆకస్మికంగా శ్వేతవరాహమై చెలువొందెను.

*(ఇంకా ఉంది)*

## శ్రీవేంకటేశ్వరలీలలు



# నమ్మినోళ్లకు నమ్మినంత

– శ్రీ మూరిశెట్టి గోవిందు, 95022 00749

అప్పుడు నేనొక ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాను. అది అక్టోబరు నెల మొదటి వారం. ఆఫీసు ముందు నిలబడి మాట్లాడుకుంటూ ఉన్నాం. తమిళనాడు నుంచి తిరుమలకు కాలినడకన వెళ్ళే భక్తులు తండోపతండాలుగా మా ఆఫీసు ముందే నడచి వెళుతున్నారు. కారణం అప్పుడు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.

చిత్తూరుజిల్లాలో అందునా తిరుపతిలో ఉన్నవారు ప్రతి సంవత్సరం తిరుమల బ్రహ్మోత్సవాలకు వెళ్లడం అందులో గరుడ వాహన సేవకు వెళ్లి చూడటమన్నది ఆనవాయితీ.

నాకూ రెండు మూడు సంవత్సరాల నుంచి తిరుమల శ్రీవారి గరుడవాహనసేవ చూడాలని కోరిక. అందుకే మా ఆఫీసులో మేనేజరుగా పనిచేసే రమేష్ బాబును పిలిచాను "సార్! గరుడవాహన సేవ చూడటానికి తిరుమల వెళదాం వస్తారా?" అని.

ఆయన "నాకూ చాలా రోజులనుంచి చూడాలని కోరిక. తప్పకుండా వస్తాను వెళదాం అరవింద్!" అన్నాడు. అలాగే గుమస్తాగా పని చేసే సురేషును కూడా పిలిచాను. అతను "నాకు కూడా చాలా రోజులుగా చూడాలని కోరిక కాని వెళ్లడానికి కుదరలేదు తప్పకుండా వస్తాను వెళదాం" అన్నాడు.

గరుడసేవ రోజు మధ్యాహ్నమే నేను స్నానంచేసి భోజనం కూడా చేసి రమేష్ బాబు, సురేష్ కోసం ఆఫీసుకు వెళ్లాను కానీ అక్కడ ఇద్దరూ లేరు. ఇంటి దగ్గర ఉంటారులే అని ముందు సురేష్ ఇంటికి వెళ్లి పిలిస్తే అతను వెంటనే బయలుదేరి వచ్చేశాడు. ఇద్దరం కలసి బయలుదేరి రమేష్‌బాబు గారి ఇంటికి వెళ్లి ఆయన్ను పిలిస్తే ఆయన "మీరు బయలుదేరి వెళ్లండి నాకు చిన్న పనుంది చూసుకొని వచ్చి మిమ్మల్ని తిరుమలలో కలుసుకుంటాను" అన్నాడు.

నేను "ఈ రోజు తిరుమలలో వచ్చి కలుసుకోవటం మాటలా! సార్! అది అసంభవం. మనం వెళ్తున్నది ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన తిరుమలకు. పైగా ఈరోజు గరుడోత్సవమనే సంగతి తెలిసిందే లక్షలాదిమంది భక్తజనం నాలుగు మాడవీధుల్లోనూ నిండిపోయి పిక్కటిల్లుతూ ఉంటారు.

అటూ ఇటూ తొలగడానికి కూడా సందుండదు. పిల్లలు తప్పిపోవడం కూడా కద్దు అంత జనముంటారు. అలాంటప్పుడు మీరొచ్చినా మమ్మల్ని కలుసుకొనేది కల్ల. ఇప్పుడు మాతో వస్తే వచ్చినట్టు లేదా మీదారి మీదే మాదారి మాదే" అన్నాను. ఎందుకంటే అప్పుడు సెల్‌ఫోన్లు కూడా లేవు, మేము ఫలానా చోటున్నాం వచ్చి కలుసుకోండి అని చెప్పడానికి.

ఆయన "అక్కడ దేవుడున్నాడని నా నమ్మకం. అక్కడ నమ్మినోళ్లకు నమ్మినంత. మీరు ఏమూల దాగున్నా నేనొచ్చి కలుసుకుంటాను మీరు వెళ్లి రండి" అన్నాడు. తిరుమలలో వచ్చి కలిసేది కుదరని పనని మేము. కలుసుకుంటానని ఆయన ఇలా మేము చాలాసేపు వాదులాడుకున్నాం కానీ, ఆఖరున అతనితో ఇక వాదనెందుకని బయలుదేరేశాం.

తిరుమలకు బస్సు ఎక్కుదామని చూస్తే బస్టాండులో జనమంటే జనంకాదు. ఒక్క బస్సొచ్చి నిలిచితే వందమంది దాని చుట్టూ చీమల్లా మూగిపోతున్నారు. అలా మేము రెండు మూడుబస్సులు కూడా వదిలేశాం. తరువాత ఇక్కడే ఇంత జనముంటే ఇక తిరుమలలో ఎంత జనముంటారో తొందరగా వెళ్లి, ఎక్కడో ఒక చోట నిలబడి చూడటానికి చోటు సంపాదించాలని నాలుగో బస్సు అతికష్టం మీద తోసులాడుకుంటూ ఎక్కి కూర్చున్నాం, బస్సు బయలుదేరింది.

బస్సులో వెళ్తూ చూస్తే ఎటు చూసినా జనమే అన్ని దారుల్లో జనం తిరుమలవైపే కదులుతున్నట్టు అనుపించింది.

ఘాట్ రోడ్లో పోతూ ఉంటే కార్లు, బస్సులు, మోటారు బైకుల మీద వెళ్లేవారు మా బస్సును దాటి వెళ్తున్నారు. తిరుమల గిరులు పచ్చగా చిగురించి ఆకుపచ్చరంగులో కళకళలాడిపోతూ కనబడ్డాయి.

అక్కడ దిగి చూస్తే నేల ఈనిందా అన్నట్టు ఎక్కడ చూసినా భక్తజన ప్రవాహమే. ఏ సందులో చూసినా భక్తజన సందోహమే. మనిషికి మనిషి ఒరుసుకుంటూ గుడివైపు తోసుకుపోతున్నారు. మేమూ ఆ జనసమూహంలో కలిసిపోయి అడుగులో అడుగేసుకుంటూ బేడి ఆంజనేయస్వామి గుడి దగ్గర తేలి అఖిలాండం దగ్గర కాసేపు ఆగాం.

అక్కడి నుంచి స్వామివారికి నమస్కరించి దిగి చిన్నగా ఎడమవైపు తిరిగి జనాన్ని తోసుకుంటూ దక్షిణ మాడవీథిలోకి చేరుకొన్నాం. గుడికి వెనుక కొద్దిగా ఖాళీస్థలం కనబడింది చుట్టూ పెన్సింగ్ వేయబడి, ఆరుగంటలకంతా ఆ పెన్సింగు దాటుకొని అవతలి వైపు వెళ్లి నిలబడుకున్నాం. వాహనసేవ దగ్గర పడే కొద్దీ జనం తోసుకుంటూ మాడవీథిలోకి జొరబడి పోతున్నారు. అక్కడ జనానికి కూర్చోవడానికి కాదుగదా నిలబడటానికీ చోటు దొరకలేదు.

కొంతమంది నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. కొంతమంది తి.తి.దేవస్థానం ఉద్యోగులక్కడ జనాన్ని నియంత్రిస్తున్నారు కాని వచ్చే జనానికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. క్షణక్షణానికి తిరుమల, జలాశయంలో నీరు చేరినట్టు జనంతో నాలుగు మాడవీథులూ నిండిపోతున్నాయి.



గరుడ వాహనసేవ ప్రారంభానికి ముందు సూచికగా చెక్క భజన కళాకారులు తప్పెట గుండ్ల కళాకారులు వివిధ కళారూపాలు వస్తున్నాయి. అప్పుడు సురేషుకు మా మేనేజర్ రమేషుబాబు గారు గుర్తుకొచ్చి "సార్! మన మేనేజర్ గారు వచ్చుంటాడంటారా?" అని అడిగాడు. నేను "అతను వచ్చి ఉండడు, వచ్చినా ఈ జనంలో మనల్ని కలుసుకునేది అసాధ్యం. తప్పించుకోవడానికే మనతో వస్తానని అబద్ధం చెప్పాడ"న్నాను.

తరువాత కొంతసేపటికి వెనుకనుంచి నా రెండు భుజాల మీదెవరో రెండు చేతులేసి అదిమినట్టు అనిపిస్తే తిరిగి చూసి అవాక్కయ్యాను. ఎవరో కాదు మా మేనేజర్ రమేషుబాబు గారు. నేను ఆశ్చర్యంతో "సార్! ఇదెలా సాధ్యం ఇంత పెద్ద జనసమూహంలో ఎలా వచ్చారు. మేమిక్కడున్నామని ఎలా కనిపెట్టారు" అన్నాను.

అతను ఒకటే మాట "నేను అప్పుడే చెప్పాను కదా! ఇక్కడ దేవుడుంటాడు. ఏదైనా సంభవమే! నేను మిమ్మల్ని కలుసుకుంటానని, అలా గుడి చుట్టూ చూసుకుంటూ వస్తున్నాను. ఎక్కడా నిలబడి చూడటానికి చోటు దొరకలేదు. ఇక్కడికొచ్చిన తరువాత చూశాను, ఇక్కడైతే మనకు సేఫ్టీగా దేవుణ్ణి చూడటానికి వీలుంటుందని లోనికొచ్చాను. చిన్నచిన్నగా నెట్టుకుంటూ ముందుకొచ్చాను మీరు కనబడ్డారు" అన్నాడు.

నేను "నిజమే! ఈ దేవదేవుని సన్నిధిలో నమ్మినోళ్లకు నమ్మినంత. నమ్మితే ఏదైనా సాధ్యమే. లేకపోతే అన్ని వీథులు వదిలేసి మేమున్న దక్షణమాడవీథికి రావడమేమిటి? ఇంత జనసమూహంలో కచ్చితంగా మేమున్న చోటికే వచ్చి మమ్మల్ని కలవడమేమిటి" అన్నాను.

ఇలా మేము మాట్లాడుకుంటూ ఉన్నాం. ఇంతలో డోలు నాదస్వరవాద్య శబ్దాలు వినబడితే, అటు చూశాం. దేవుడు గరుడవాహనం మీద దేదీప్యమానంగా వెలిగిపోతూ వచ్చాడు. మేము దర్శనం చేసుకుని తిరిగొచ్చేశాం.

బాలనీతి

# అహింసను సమర్థించిన రాజు

– శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు, 94907 99203

వివింశ మహారాజు కుమారుడు ఖనీనేత్రుడు. పదివేల యజ్ఞాలు పూర్తి చేసి, సమస్త భూమిని బ్రాహ్మణులకు దానం చేసినవాడు. అయితే ఆయనకు సంతానం లేకపోవడం వల్ల పుత్రుని పొందాలన్న కోరికతో పితృయజ్ఞం చెయ్యాలను కున్నాడు. ఆ యజ్ఞపదార్థాల కోసం అరణ్యాలకు వేటకు వెళ్లాడు.

గుర్రంపై వెళుతున్న మహారాజుకు ఎదురుగా ఒక జింక నిలబడి "నన్ను చంపి అభీష్టాన్ని నెరవేర్చుకో మహారాజా" అంది. మహారాజు ఆశ్చర్యపోతూ "నన్ను చూసిన మృగాలన్నీ భయంతో పారిపోతుంటే నువ్వు మృత్యుదేవతను ఆహ్వానిస్తున్నా వేం?" అనడిగాడు.

జింక "మహారాజా! నాకు సంతానం లేదు. దాంతో నా జన్మకు ప్రయోజనం లేదని భావించాను. ఇంకెవరి వేటలో వృథాగా ప్రాణాలు పోగొట్టుకునే బదులు మీ యజ్ఞంలో ఉప యోగపడేందుకు ప్రాణాన్ని విడిచి పెట్టాలని భావిస్తున్నాను" అంది.

అంతలో మరొక జింక వచ్చి "దాన్ని చంపవద్దు. నన్ను చంపి మీరు అనుకున్న యజ్ఞ కార్యాన్ని నెరవేర్చండి. మీకు సార్థకత, ఉపకారం చేసిన పుణ్యం నాకు దక్కుతుంది." అంది.

మహారాజు ఆ జింకతో "దానికి పుత్రులు లేని కారణంగా వైరాగ్యం కలిగి ఉండొచ్చు. నీకెందుకు వైరాగ్య భావం కలిగింది? ఎందుకు ప్రాణం విడిచి పెట్టాలనుకుంటు న్నావు" అనడిగాడు.

జింక "రాజా! నాకు ఎక్కువ సంతానం ఉంది. ఎవరి వల్ల, ఎప్పుడు, ఎలాంటి కీడు వాటికి కలుగుతుందోనన్న దుఃఖం, విచారంతో బతుకుతున్నాను. మా జాతి పిరికితనంతో అందరికీ భయపడి బ్రతకాలి. ఎక్కువ సంతానం ఉన్న నేను వాటన్నింటి మీద మమకారం పెంచుకున్నాను. అందువల్ల ఎక్కువ దుఃఖం అనుభవిస్తున్నాను. భూమి మీద గడ్డిని మేము కాకుండా ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు వంటివి తింటున్నాయి. ఇక మాకేం మిగులుతుంది?" అంది.

అప్పుడు మహారాజు "ఇంకేమైనా కారణాలున్నాయా?" అని ప్రశ్నించాడు.





భార్యభర్తలు పోట్లాడుకోని ఇల్లు లక్ష్మీనివాసం

జింక "నా సంతానం వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు వాటి మీద మమకారంతో భయం కలుగుతుంది. వారిలో ఎవరైనా వలలో చిక్కుకున్నారేమో అని విచారం కలుగుతుంది. వాళ్ల కోసం ఎదురుచూస్తూ, ఎలాంటి పరిస్థితుల్లో వస్తారో అని వేచి ఉంటున్నాను. అందుకే ఒక మంచి కారణం కోసం ప్రాణాన్ని విడిచి పెట్టాలని, మీ యజ్ఞంలో ఉపయోగపడాలన్న కోరుతున్నాను." అని చెప్పింది.

మహారాజు "సంతానం ఉన్నవారు ధన్యులా లేక సంతానం లేనివారు ధన్యులా అనే విషయం గ్రహించలేక పోతున్నాను. పుత్ర సంతానం కోసం చేస్తున్న నా ప్రయత్నం సరైందో కాదో గ్రహించలేకపోతున్నాను. సంతానం పొందిన తర్వాత నీకు వచ్చినట్టే కొత్త ఆలోచనలు వస్తాయేమోనని, పరలోకచింత లేకపోతే ఆ సంతానం ఇహలోకంలో, పరలోకంలోనూ దుఃఖానికి కారణమౌతుందన్న సత్యాన్ని తెలుసుకున్నాను. అయినా సంతానహీనులకు దేవఋణం, పితృఋణం, ఋషిఋణం అనే మూడుఋణాలు మిగిలి పోతాయని విన్నాను. కాబట్టి పుత్రుడిని పొందాలని వచ్చాను. అయినా ప్రాణివధ లేకుండానే గతంలో కొందరు రాజులు ఆచరించినట్లే తీవ్రమైన తపస్సు చేసి పుత్ర సంతానాన్ని పొందే ప్రయత్నం చేస్తాను" అని దేన్నీ వేటాడకుండానే వెళ్లిపోయాడు.

అక్కడ నుండి గోమతి నది తీరానికి వెళ్లి కఠినమైన తపస్సుతో, ఏకాగ్రమైన మనసుతో దేవేంద్రుని స్తుతించాడు ఖనీనేత్రుడు. ఆయన తపస్సుకు మెచ్చిన దేవేంద్రుడు ప్రత్యక్షమై వరం పొందే అవకాశం ఇచ్చాడు.

ఖనీనేత్రుడు "సమస్త శస్త్రధారులలో శ్రేష్ఠుడు, తరుగు లేని ఐశ్వర్యం గలవాడు, ధర్మకర్త, ధర్మవేత్త, పుణ్యవంతుడు అయిన పుత్రుడు కలగాలని" కోరుకున్నాడు. ఆయన కోరిక నెరవేరేలా 'తథాస్తు' అని దీవించాడు దేవేంద్రుడు. అలా మనో వాంఛ తీరడంతో తిరిగి పట్టణానికి వెళ్లి యజ్ఞాన్ని చేశాడు ఖనీనేత్రుడు. దేవేంద్రుని అనుగ్రహంతో ఆయనకు జన్మించిన పుత్రుడికి బలాశ్వుడు అని నామకరణం చేశారు. అతనే తదుపరి కాలంలో కరంధముడు పేరుతో ప్రసిద్ధుడయ్యాడు.

*(మార్కండేయ పురాణం నుండి)*

**విశ్వదాభిరామం** **వేమన పద్యసూక్తి**



# దుర్మార్గం - మంచితనం

**కుక్క గోవు కాదు; కుందేలు పులి గాదు;**
**దోమ గజము గాదు దొడ్డ దైన;**
**లోభి దాత గాదు లోకంబులోపల**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థాలు:** గోవు= ఆవు; గజము= ఏనుగు; దొడ్డది= గొప్పది.

**భావం:** పెద్దగా పెరిగినంత మాత్రాన కుక్క ఆవు కాదు. కుందేలు పులి కాలేదు. దోమ ఏనుగు కాలేదు. అలాగే లోకంలో పిసినిగొట్టు దాత కాలేదు.

**వివరణ:** కుక్క అల్పజంతువు. గౌరవానికి అర్హం కాదు. అది ఎంత గొప్ప జాతిలో పుట్టినా కుక్కకు పవిత్రమైన ఆవుతో సమానమైన గౌరవం ఇవ్వరు. కుందేలు సాధుజంతువు. పులి క్రూరజంతువు. దుర్మార్గమైంది. సహజంగా సాధువైన కుందేలు ఎప్పటికీ పులి కాదు. అంటే క్రూరజంతువు కాదు. అంటే ఆంతరమైన గుణం మారదు. దోమ చాల చిన్నకీటకం. ఏనుగు పరిమాణంలో చాల పెద్దది. దోమ ఎంతగా పెరిగినా ఏనుగుగా మారలేదు. అంటే బాహ్యమైన లక్షణం మారదు. అదే విధంగా పిసిని గొట్టుకు దానం చేయడం అనే గుణం లేక పోవడం సహజం. అది ఎప్పటికీ మారదు. కాబట్టి వాడు ఎప్పటికీ దానం చేయడు.

*- కీ.శే.విద్వాన్ కట్టా నరసింహులు*

చిత్ర కథ

# శత్రువులతో స్నేహం ఎంత అవసరమో అంతే!

కథ–'కళారత్న' డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు– శ్రీ తుంబలి శివాజీ




వల కొరికాక నువ్వు ఏమి ఆలోచిస్తావో ఎవరికి తెలుసు?! శత్రుత్వం ఉన్నచోట సంధి చేసుకున్నా పూర్తిగా నమ్మడానికి వీలు కాదు.
అయ్యో! నేను నీకు కీడు చేయను. నన్ను నమ్మి నా వల తాళ్లు కొరుకు వేగంగా...
భయపడకు.. వల తాళ్లు కొరికేస్తాను.
ఎలుక గబగబా వల తాళ్లు కొరికింది. పిల్లి వేగంగా చెట్టు పైకి ఎక్కింది.
మనిద్దరం స్నేహితులం.. ఆపదలో ఒకరినొకరు కాపాడుకున్నాం. ఇద్దరం కలిసి హాయిగా ఉందాం. నన్ను చూసి భయపడకు...
ఓ పిల్లీ! నా మాట విను. ఎవరు మిత్రులో, ఎవరు శత్రువులో చెప్పడం కష్టం. నీ మనసు ఎప్పుడు ఎలా మారుతుందో ఎవరికి తెలుసు?
అయ్యో! అలా అనడం ధర్మమా? నన్ను కాపాడావు కనుక నిన్ను తినను...
లేదు పిల్లీ! లేదు.. నీ వల్ల నేను బతికాను. నా వల్ల నీవు వల నుండి తప్పించుకున్నావు. మన స్నేహం అంతవరకే! ఇంతకన్నా నీకు దగ్గరగా నేను రాను. ఎందుకంటే నేను నీకు ఆహారం కదా..
ఎలుక చెప్పింది నిజమే.. అది నాకు ఆహారం.. ఏ సమయంలో బుద్ధి ఎలా మారుతుందోకదా..!
నీతి: శత్రువుకి అవసరం వస్తే సహాయం చేయొచ్చు, కానీ శత్రువుని పూర్తిగా నమ్మకూడదు.
2

# హయగ్రీవుడు



అశ్వముఖం గల విష్ణుమూర్తి హయగ్రీవుడు. హరికి గల అనేక అవతారాల్లో హయగ్రీవావతారం ఒకటి. విష్ణువుకు హయగ్రీవం రావడానికి గల కారణాలు పురాణ కథల్లో ఉన్నాయి.

వేదాలు తెచ్చి బ్రహ్మకిచ్చి, వేదవిజ్ఞానాన్ని కాపాడినందువల్ల హయగ్రీవుడు సర్వవిద్యలకు ఆధారభూతుడయ్యాడు.

'జ్ఞానానందమయందేవం నిర్మల స్ఫటికాకృతిమ్,
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే'

అని స్తుతించడానికి కారణం వేదాలతో హయగ్రీవుడికి గల సంబంధమే కారణం.

అద్వైత, ద్వైత, విశిష్టాద్వైత సంప్రదాయాల్లో హయ గ్రీవోపాసన ఉంది. హయగ్రీవుని వైష్ణవులు విద్యాప్రదాతగా ఆరాధించారు. ఆరాధిస్తున్నారు. అక్కడక్కడా వైష్ణవాలయాల్లో హయగ్రీవమూర్తులు కనిపిస్తాయి. ఉపాసనలో ఈ రకమైన మంత్రాలున్నాయి.

ఓం నమో భగవతే హయగ్రీవాయ- ద్వాదశాక్షరి

'విశ్వోత్తీర్ణ స్వరూపాయ చిన్మయానంద రూపిణే.
తుభ్యం నమో హరిగ్రీవ విద్యారాజాయ విష్ణవే'
- హయగ్రీవ మంత్రం.

'హరిగ్రీవాయ విద్మహే
విద్యానాథాయ ధీమహి,
తన్నో హంసః ప్రచోదయాత్'
- కపింజల సంహితలోని హయగ్రీవ గాయత్రి.

ముఖ్యంగా వేదాంతదేశికులు హయగ్రీవ మంత్రోపాసకుడు. వైష్ణవంలో ఆళ్వార్లు, ఆచార్యులు హయగ్రీవ స్తుతులు చేశారు.

# గరుడ పంచమి

శ్రావణశుద్ధపంచమి గరుత్మంతుడు పుట్టినరోజు. ఇందుకు ప్రతీకగా ఆ రోజున గరుడపంచమి జరుపుకోవటం ఆనవాయితీ. గరుత్మంతుడిని అర్చించిన వారికి సర్పబాధలనుంచి విముక్తి కలుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

ప్రతి వ్యక్తి రాత్రి నిద్రపోయేముందు రాముడు, సుబ్రహ్మణ్యస్వామి హనుమంతుడు, గరుత్మంతుడు, భీముడు- వీరిని తలుచుకుంటే దుస్స్వప్నాలు కలగవని పెద్దలు చెబుతారు.

తిరుమల కొండపై శ్రీవారికి జరిగే బ్రహ్మోత్సవాల్లో అగ్రతాంబూలం గరుత్మంతుడిదే. శ్రీవారి ఉత్సవాల ప్రారంభ సూచకంగా గరుత్మంతుడి చిత్రం ఉన్న పతాకాన్ని అర్చకస్వాములు ఎగురవేస్తారు. దీన్నే ధ్వజారోహణం అంటారు. ముక్కోటి దేవతల్ని ఉత్సవాలకు రావల్సిందిగా గరుత్మంతుడు ఆహ్వానిస్తాడు. ఉత్సవాల్లో గరుడపతాకావిష్కరణకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అలాగే, బ్రహ్మోత్సవ వాహన సేవల్లో గరుడవాహనసేవ ఎంతో ప్రత్యేకమైంది. ఈ ఉత్సవాన్ని చూడటానికి లక్షలాదిమంది భక్తులు కొండకు చేరుకుంటారు. దాసుడిగా, మిత్రుడిగా, విసనకర్రగా, ఆసనంగా, ఆవాసంగా, ధ్వజంగా ఇలా తన జీవితసర్వస్వాన్నీ శ్రీహరిసేవకు అంకితం చేసిన దాసోత్తముడు గరుత్మంతుడు. వైష్ణవసంప్రదాయంలో గరుత్మంతుని గరుడాళ్వార్ అనే పేరుతో దైవంగా కొలుస్తారు.

## ధర్మనిలయం... గరుడ పురాణం

గరుడపురాణం అష్టాదశ పురాణాలలో ఒకటి. ఈ పురాణం శ్రీమహావిష్ణువు చేత అతని వాహనమైన గరుత్మంతుడికి ఉపదేశించబడింది. అందుకే ఈ పురాణానికి "గరుడపురాణం" అని పేరు వచ్చింది. మానవుడు చేసే వివిధ పాపాలు, వాటికి నరకలోకంలో విధించే శిక్షలు, పాపాలకు ప్రాయశ్చిత్తం, పుణ్యం సంపాదించుకునేందుకు వివిధమార్గాలు, పితృకార్యాల వర్ణన ఈ పురాణంలో ఉంటుంది. ఇహలోకంలో ధర్మబద్ధమైన జీవితాన్ని గడపాల్సిన అవసరాన్ని, ధర్మబద్ధమైన జీవనఫలితాన్ని గరుడపురాణం ఎంతగానో ప్రకటిస్తుంది.



# క్విజ్ 49

01) సుగ్రీవుడి దగ్గరకు రాముడు తన ప్రతినిధిగా ఎవరిని పంపారు? జ)..........

02) దక్షిణాయణంలో ముందుగా వచ్చేమాసం? జ)..........

03) గరుడుడు అమృతాన్ని తెచ్చిన మాసం? జ)..........

04) కలియుగం చివరలో వచ్చే గొప్ప అవతారం? జ)..........

05) శ్రీకృష్ణదేవరాయల భార్యలు? జ)..........

06) పరిపూర్ణ కుసుమమని దేన్ని అంటారు? జ)..........

07) సీతకు బదులు లంకలో ఉన్న మహిళ? జ)..........

08) దేవతల గురువు? జ)..........

09) గాయత్రీదేవి జనన ఉపాఖ్యానం ఎందులో ఉంది? జ)..........

10) గాయత్రిని మధ్యాహ్నసంధ్యలో ఏ పేరుతో పూజిస్తారు? జ)..........

11) ద్విపద భాగవత రచయిత్రి? జ)..........

12) శ్రీకృష్ణలీలాతరంగిణి కర్త? జ)..........

13) శ్రీరామానుజులు మంత్రోపదేశం ఎవరి వద్ద పొందారు? జ)..........

14) మంత్రాలు స్తోత్రాలుగా అందించినవారు? జ)..........

15) వేదాంతదేశికులు ఎవరి ఉపాసకులు? జ)..........

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-08-2026.**

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........

పాఠశాల: .......... తరగతి: ..........

పేరు: ..........

చిరునామా: ..........

..........

..........

.......... పిన్‌కోడ్: ..........

ఫోన్ సంఖ్య: ..........

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

# పాఠశాలలో పతాక వందనం



**బాలలూ! ఆగస్టు నెల అనగానే భారతీయులందరికీ గుర్తొచ్చేది. స్వాతంత్ర్యదినోత్సవం, ఆగస్టు 15 మనందరికీ పండుగరోజు.**

***"విజయీ విశ్వ తిరంగా ప్యారా! ఝండా ఊంచా రహే హమారా! సదా శక్తి బరసానే వాలా! ప్రేమ్ సుధా సరసా వాలా! వీరోమ్ కీ హర్షనే వాలా! మాతృభూమికా తన్ మన్ సారా! ఝండా...!!!"* అంటూ మనసారా పాడుకుని దేశసేవకు పునరంకితం కాబోతున్నాం. ఈ సందర్భంగా పాఠశాలలో పతాకావిష్కరణ, ప్రతిజ్ఞలకు సంబంధించిన నియమావళి గురించి తెలుసుకొందామా.**

చతురస్రాకారంలో పాఠశాల విద్యార్థులు మూడు పక్కల ఉండి, పతాకస్తంభం నాలుగో పక్కన మధ్యలో ఉండే టట్లు నిలబడాలి. హెడ్మాస్టరు, విద్యార్థినాయకుడు, పతాకం ఎగురవేసే వ్యక్తి (హెడ్మాస్టరు కాని పక్షంలో) పతాకస్తంభానికి మూడు అడుగుల వెనుక నిలబడాలి.

విద్యార్థులు వారి తరగతుల ప్రకారం వరుసకు పదిమంది చొప్పున (సంఖ్యను బట్టి ఇది మారవచ్చు.) వరుసలు ఒకదాని వెనుక ఒకటి ఏర్పడాలి. విద్యార్థి నాయకుడు తన తరగతి మొదటివరుసలో కుడివైపున నిలడాలి. ఆ తరగతి మాస్టారు ఆ తరగతి ఆఖరి వరుస వెనుక మధ్యగా నిలబడాలి.

తరగతులు చతురస్రాకారంలో తరగతివారీగా అన్నింటికన్న పై తరగతి కుడివైపున వచ్చేటట్లు నిలబడాలి. వరుసకి వరుసకి మధ్యలో 30 అంగుళాల ఖాళీ ఉండాలి. అలాగే తరగతికి, తరగతికి మధ్య కూడా 30 అంగుళాల ఖాళీ ఉండాలి. తరగతి తయారైన పిదప, తరగతి నాయకుడు ముందుకు అడుగు వేసి తరగతి విద్యార్థి నాయకునికి వందనం చేయాలి. అన్ని తరగతులు తయారైన తర్వాత స్కూలు విద్యార్థినాయకుడు హెడ్మాస్టరుకు వందనం చేస్తే, హెడ్మాస్టరు అభివందనం చేయాలి. తర్వాత పతాకాన్ని ఎగురవేయాలి.

కవాతుకు కాని, సభకు కాని ప్రాతినిధ్యం వహించే స్కూలు విద్యార్థినాయకుడు కవాతును అటెన్షన్‌లోకి రావలసిందిగా పిలుపు ఇస్తాడు. పతాకం ఎగురవేయటానికి ముందరవారిని పతాకం ఎగురుతున్నప్పుడు వందనం చేయవలసిందిగా కోరుతాడు. కవాతు కొద్ది వ్యవధి వరకు వందనం చేసి తరువాత ఆర్డర్ అనగానే అటెన్షన్ స్థితికి రావాలి.

పతాక వందనం తర్వాత జాతీయగీతం '*జన గణమన*' పాడాలి. ఈ సమయంలో కవాతు అటెన్షన్‌లో ఉంటుంది. ప్రతిజ్ఞ తీసుకున్న అన్ని సందర్భాలలో ప్రతిజ్ఞ జాతీయగీతం తర్వాత తీసుకోవాలి.



ఈ సమయంలో అటెన్షన్‌లో ఉండి. హెడ్మాస్టరు ప్రతిజ్ఞను చదువుతుంటే మిగిలిన వారు తిరిగి చెప్పాలి. రెండు అరచేతులు దగ్గరగా చేర్చి నిలుచుని "నేను జాతీయ పతాకానికి, అది సూచించే సార్వభౌమ ప్రజాస్వామ్య రిపబ్లిక్‌కు కట్టుబడి ఉంటాను" అని చెప్పాలి.

మరి మీరంతా స్వాతంత్ర్యదినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారుగా.

# ఆగష్టు, 2026 రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** వైద్యసహాయం అవసరం. అస్వస్థత నుండి బయటపడతారు. ధనవ్యయం, సంతానం వృద్ధిలోకి రావడంతో ఆనందం. కుటుంబ వృద్ధి, భూలాభం.



**వృషభం–** అన్నదమ్ములకు అండగా ఉండటం, క్షమాగుణం కలిగియుండుట, ధైర్యం ప్రణాళికతో కార్యసిద్ధి, ఉన్నతవిద్యలలో రాణించడం. సంగీతాది విద్యలలో గుర్తింపు.



**మిథునం–** ఇంట్లో శుభకార్య సంప్రాప్తత, బంధు మిత్రులను కలుస్తారు. ఇతరులను ఒప్పించి రాయబారము చేసే సామర్థ్యం ఉంటుంది. కుటుంబపరంగా, వ్యక్తిగతంగా సంతోషంగా ఉంటారు. స్థిరాస్తిని కొనే అవకాశం ఉంది.



**కర్కాటకం–** ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతి, షేర్లు, స్థిరాస్తులలో పెట్టుబడులు కలిసివస్తాయి. విద్యార్థులు ఉన్నతవిద్యలలో రాణిస్తారు. విదేశాలకు వెళ్లడానికి లేదా ఇతర ప్రాంతాలకు ప్రయాణించడానికి అనుకూలమైన సమయం.



**సింహం–** లాభాలబాట పడతారు. మొదటి వారంలో ప్రభుత్వం నుండి ప్రయోజనాలు. మీరు పని చేసేచోట అహంకార ధోరణి ప్రదర్శిస్తారు. ధనసంపాదన సామర్థ్యం పెరుగుతుంది.



**కన్య–** భాగస్వామ్య వ్యాపారాల నుండి ప్రయోజనం, భూమి, ఆస్తి, వారసత్వంగా వచ్చిన ఆస్తిని వృద్ధిచేస్తారు. కుటుంబ వాతావరణం అనుకూలం. సంతానవృద్ధి.



**తుల–** వృత్తివ్యాపారాలలో అధికాదాయం. గౌరవం పెరుగుతుంది. మీరు చేసే పనులకు ప్రశంసలు లభిస్తాయి. ఉద్యోగంలో ప్రమోషన్లు, కొత్త ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది. వృత్తిపరంగా మంచి గుర్తింపు లభిస్తుంది.



**వృశ్చికం–**యోగా, ధ్యానం, ఆధ్యాత్మికత వంటి అభ్యాసక్రియలను అలవరుచుకుంటే మానసిక ప్రశాంతతను పొందుతారు. విందు వినోదాల వల్ల ధనం వృథా అయ్యే సూచన. దుర్వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్త అవసరం,



**ధనుస్సు–** సామాజికస్థితి మెరుగుపడుతుంది. విలాసజీవనం, సంతానసౌఖ్యం, అవసరమైనచోట తెలివైన నిర్ణయాలు తీసుకుని పదిమందిలో గుర్తింపు తెచ్చుకుంటారు.



**మకరం–** కొన్ని చట్టపరమైన సమస్యలు, అడ్డంకులు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. అజీర్ణం, రక్తప్రసరణ సమస్యలు, పైల్స్ ఇబ్బంది పెట్టే అవకాశం. డ్రైవింగ్ చేసేటప్పుడు లేదా నడిచేటప్పుడు కూడా జాగ్రత్తగా ఉండాలి.



**కుంభం–** మంచి ఆలోచనలతో, యుక్తితో స్వామి కార్యం, స్వకార్యం సంపూర్ణం. హాస్య సంభాషణతో ఆకట్టుకుంటారు. క్రయ విక్రయాల వల్ల లాభపడతారు.



**మీనం–** అవగాహనాశక్తితో లోతైన వివరాలు తెలుసుకుంటారు. సమస్యలను పరిష్కరిస్తారు. కొత్త విషయాలను కనుగొంటారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / ఎట్ పర్ చెక్ మాత్రమే :

........................................ తేది :..................

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# శ్రీపదకేళి

127

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | 4 | ■ | 5 |
| | ■ | | ■ | | ■ | | ■ | |
| | ■ | ■ | 6 | | | ■ | 7 | |
| | ■ | 8 | ■ | | ■ | 9 | ■ | |
| 10 | | | | ■ | 11 | | ■ | |
| | ■ | | ■ | 12 | ■ | | ■ | |
| 13 | | ■ | 14 | | ■ | 15 | | ■ |
| ■ | ■ | 16 | ■ | | ■ | | ■ | 17 |
| ■ | 18 | | | ■ | 19 | | | |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)శ్రావణపూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం నాడు చేసే వ్రతం (7); 6)బ్రహ్మ మానసపుత్రుడు(3); 7)స్వప్నం(2); 10)ఒక నరకం(4); 11)యుద్ధం(2); 13)ఇంటి ముందు వేసేది(2); 14)ఇక్ష్వాకుని కుమారుడు(2); 15)బురద(2); 18)శ్రావణశుద్ధ ఏకాదశి(3); 19)అధికం (మితం కానిది)(4)

**నిలువు** 1)దశావతారాల్లో ఒకటి(7); 2)విష్ణు పత్ని(2); 3)అజమీఢునికి కేశిని వల్ల జన్మించిన పుత్రుడు(4); 4)మోక్షం(2); 5)శ్రావణపూర్ణిమకు గల మరొక పేరు(6); 8)మహర్షులు నివాసం ఉండే చోటు(3); 9)శ్రావణశుద్ధ పంచమికి గల మరియొక పేరు(6); 12)ఆషాఢ కృష్ణ ఏకాదశి(3); 16)సూర్యుడు(2); 17)సర్పం(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr.V.G.Chokkalingam, M.A., Ph.D., P.G.Diploma in JMC., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D., P.G.Diploma in JMC



శ్రీవారి దర్శనార్థం 11-06-2026న కుటుంబసమేతంగా తిరుమలకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ గౌ॥ ఎస్.అబ్దుల్ నజీర్ గారికి తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్., అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్.,లు వీరికి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



శ్రీవారి దర్శనార్థం 12-06-2026న కుటుంబసమేతంగా తిరుమలకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ గారికి తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్., అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్.,లు వీరికి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.
















అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని (21-06-2026) పురస్కరించుకుని తి.తి.దే. (2026, జూన్ 7 నుండి 21 వరకు) 'యోగ- టి.టి.డి. ఆరోగ్యానంద' పేరిట ఘనంగా నిర్వహించిన వివిధ యోగ సంబంధిత కార్యక్రమాలు. ఇందులో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్., అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్., సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.శరత్, ఐ.ఏ.ఎస్., గార్లు పాల్గొన్నారు.

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams Printing on 25-07-2026 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 1st of Every Month.

